# మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 97 • పేజీలు:12+16 • వెల: రూ.5 బుధవారం • 7-3-2018 www.manamnews.com /manamnews

## విరుచుకుపడిన విపక్షాలు

- పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో గందరగోళం
- నేటికి వాయిదాపడిన లోక్‌సభ... రాజ్యసభ
- పలు డిమాండ్లతో పలువురు ఎంపీల నిరసన
- నినాదాల హోరుతో ఉభయసభల్లో అంతరాయం
- పీఎన్‌బీ మోసంపై ప్రధాని ప్రకటనకోసం పట్టు

7లో..

## పెళ్లి లారీ బోల్తా.. 26 మంది దుర్మరణం

- మృతుల్లో పదిమంది మహిళలు
- ఐదుగురు చిన్నారులు కూడా
- గుజరాత్‌లో ఘోర ప్రమాదం

7లో..

## సుప్రీంలో కార్తీకి చుక్కెదురు

- ఈడీ అరెస్టుపై స్టేకు నిరాకరణ
- మరో 3 రోజుల సీబీఐ కస్టడీ



లైఫ్ సైన్సెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి కేటీఆర్ తదితరులు

# 'లైఫ్' సైన్సెస్

### విజన్-2030 ప్రణాళిక.. జీనోమ్ వ్యాలీలో ఇంక్యుబేటర్

- పరిశోధనలు.. సృజనకు ప్రాధాన్యం
- హైరిస్క్ రీసెర్చ్‌కు బడ్జెట్‌లో నిధులు
- ప్రాధాన్య రంగంగా ఫార్మా అభివృద్ధి
- హైదరాబాద్ ఫార్మాసిటీ.. మైలురాయి
- ఐదు వ్యాధుల కట్టడిపై పరిశోధనలు
- అంతర్జాతీయ కంపెనీలూ వస్తాయి
- అడ్వయిజరీ కమిటీ భేటీలో కేటీఆర్

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి):

తెలంగాణను లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందుకు తీసుకు పోయేందుకు విజన్-2030 పేరుతో ప్రణాళికను రూపొందిస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫార్మాను ఒక ప్రాధాన్య రంగంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమ అభివృద్ధికి అనేక ప్రణాళికలు రచిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా ఈ అంశంలో హైదరాబాద్ ఫార్మాసిటీ ఒక మైలు రాయిగా నిలు స్తుందని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నోవాటెల్ హోటల్‌లో లైఫ్ సైన్సెస్ మిగతా 6లో..




సదస్సులో అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు, సదస్సుకు హాజరైన నిరుద్యోగులు

## ఉద్యమ రాష్ట్రంలో రాచరిక పాలన

### ప్రశ్నించే గొంతు నొక్కుతున్న సర్కారు


- రైతులు, నిరుద్యోగులను విస్మరించింది
- ప్రత్యామ్నాయం కోసం ప్రజల చూపు
- జేఏసీ చైర్మన్ కోదండరాం

మహబూబాబాద్, మార్చి 6(మనంన్యూస్):

పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోందని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రైతాంగ, నిరుద్యోగ సదస్సులో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 6లో..



## ఇదీలోకం!




ఆ రోజుల్లో అంతా కమ్యూనిస్టులే కాబట్టి మీ పేరు అలా పెట్టారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదు.. రామునిగానో, కృష్ణుడిగానో మార్చుకొని సీఎం కండి సార్..!

## కేసీఆర్‌కు కొత్త బుల్లెట్‌ప్రూఫ్ బస్!

### త్వరలో రూ.7 కోట్లతో కొనుగోలు.. మావోయిస్టు హెచ్చరికల నేపథ్యంలో నిర్ణయం

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనల్లో వినియోగం

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి):

ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో టీఆర్‌ఎస్ నేతలపై ప్రతీకారం తీర్చుకుంటామని మావోయిస్టు నేతలు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భద్రత పెంచాలని రాష్ట్ర హోంశాఖ నిర్ణయించింది. మావోయిస్టుల నుంచి సీఎంకు ముప్పు పొంచి వుందని





భావిస్తున్న హోంశాఖ.. ఆయన కోసం ప్రత్యేకమైన బుల్లెట్ ప్రూఫ్ బస్సును రూ.7 కోట్లతో కొనుగోలు చేయనుంది.అత్యాధునిక భద్రతాపరమైన సదుపాయాలు ఉండేలా కొత్త బుల్లెట్ ప్రూఫ్ బస్సును సీఎం పర్యటనల కోసం తయారుచేయించనున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటనల సందర్భంగా ఈ వాహనాన్ని ఉపయోగించాలని మిగతా 6లో..



## థర్డ్ ఫ్రంట్.. డ్రామా

- రైతు సమస్యలను పక్కదారి పట్టించేందుకే..
- ఇప్పటిదాకా 4 వేల మంది రైతుల ఆత్మహత్య
- మేం అధికారంలోకి వస్తాం..బాధలు తీరుస్తాం
- అన్ని పంటలకూ మద్దతు ధర పెంచుతాం
- ప్రజా చైతన్య యాత్రలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి

మెట్‌పల్లి, మార్చి 6 (మనం న్యూస్):

రైతు సమస్యలను పక్కదారి పట్టించేందుకే సీఎం కేసీఆర్ మూడో ఫ్రంట్ డ్రామాను తెరపైకి తీసుకువచ్చారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి మిగతా 6లో..

## ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.2.01 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ రా.10.32 తదుపరి అనూరాధ; వర్జ్యం: తె.2.54-4.39; దుర్ముహూర్తం: మ.12.04-12.51; రాహుకాలం: మ.12.27-1.56; అమృతఘడియలు: మ.1.14-2.56; శుభసమయం: మ.1.58-3.00.

**సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 6.21**


## వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. గంటకు 17 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

**గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు**

**కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు**

**గాలిలో తేమ: 29 శాతం**




## విమానం కూలి 32 మంది మృతి

- సిరియాలోని రష్యా స్థావరంలో దుర్ఘటన
- దిగుతున్న సమయంలో సాంకేతిక లోపం
- విచారణకు ఆదేశించిన అధ్యక్షుడు పుతిన్

మాస్కో, మార్చి 6:

సిరియాలో రష్యా వినియోగిస్తున్న హెమేమిమ్ వాయుసేన స్థావరంలో 'ఏఎన్-26' రవాణా విమానం కూలి 32 మంది మరణించారు. మంగళవారం లటాకియా రాష్ట్రం పరిధిలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సాంకేతిక లోపమే మిగతా 6లో..

## పట్టపగలే భారీ దోపిడీ

### ఐదు కిలోల బంగారం చోరీ.. కత్తులతో బెదిరించి నగలతో మాయం

- సీసీ కెమెరాలూ ఎత్తుకెళ్లిన వైనం
- హైదరాబాద్ పాతబస్తీలో ఘటన
- రెక్కీ నిర్వహించి పథకం ప్రకారమే
- పాత నేరస్థుల పనే.. పోలీసులు
- ఐదుగురు అనుమానితుల అరెస్ట్



హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి):

పాతబస్తీలోని మూసాబౌలిలో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఓ బంగారు నగల దుకాణంలో చొరబడిన 10 మంది దుండగులు బీభత్సం సృష్టించారు. పక్కా పథకం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం బైకులు, కారులో అక్కడికి చేరుకుని కార్మికులను కత్తులతో బెదిరించి, గాలిలోకి కాల్పులు మిగతా 6లో..

# దక్షిణ భారతంలో సూర్యాపేటకు గుర్తింపు

- బంగారు తెలంగాణే కేసీఆర్ లక్ష్యం
- నాలా నిర్మాణాలకు రూ.81.40 కోట్లు
- సూర్యాపేట అభివృద్ధిపై మంత్రి కేటీఆర్

సూర్యాపేట, మార్చి 6(మనం న్యూస్): దక్షిణ భారతదేశంలో సూర్యాపేట మున్సిపాలిటికి ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. మంగళవారం రూ.81.40 కోట్లతో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే తెలంగాణ దుర్భిక్షంగా మారిందన్నారు. బంగారు తెలంగాణ ఏర్పాటుకోసం సీఎం కేసీఆర్ నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో 2001నుంచి కేసీఆర్‌కు కుడి భుజంగా ఉన్న జగదీశ్‌రెడ్డి ద్వారానే సూర్యాపేట అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇండ్లకు, వ్యవసాయ 24 గంటల విద్యుత్ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. సూర్యాపేటలో ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న నాలా అభివృద్ధికోసం శక్తివంచన లేకుండా మంత్రి కృషిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయితే అంధకారంగా మారుతుందని పిల్లి శాపనార్థలు పెట్టిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కనిపించకుండా పోయాడని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో కెసిఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి జగదీశ్‌రెడ్డిని మంత్రిని చేశారని, సూర్యాపేటను జిల్లాకేంద్రంగా చేయడంతో పాటు రూ. 1500కోట్లు మంజూరీ చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కళలు కన్న బంగారు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. అడిగిందే తడువుగా కోట్లాది రూపాయాలు సూర్యాపేటతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే రానున్న ఎన్నికల్లో విజయసోపానాలు అన్నారు. నాలాను పరిశీలించి వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి కేటీఆర్‌కు హారతిస్తూ స్వాగతిస్తున్న మహిళలు

# మెడికల్‌లో 27 సీట్ల పెంపు

- ఎంసీఐ అనుమతి..

మంత్రి లక్ష్మారెడ్డి అభినందన

హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్ చొరవతో తెలంగాణ ప్రభుత్వం ఆసుపత్రిలో పెంచిన సదుపాయాలు, ఆధునీకీకరణ కారణంగా తెలంగాణ వైద్యవిద్యలో మరో 27 పీజీ సీట్లు పెరిగాయి. ఈమేరకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంబంధిత సీట్ల పెంపునకు అనుమతిస్తూ మంగళవారం లేఖ రాసింది. దీంతో మరిన్ని వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. సీట్లు పెరగడానికి కృషి చేసిన వైద్య సిబ్బందిని, అధికారులని వైద్య ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి అభినందించారు.

**విభాగాల వారీగా పెరిగిన సీట్ల వివరాలు**

**గాంధీ మెడికల్ కాలేజీలో**
- అనెస్తీషియా విభాగంలో – 2 సీట్లు
- ఛాతీ విభాగంలో –1 సీటు

**కాకతీయ కాలేజీలో**
- చర్మ వ్యాధుల్లో – 1 సీటు
- గైనకాలజీ చికిత్సలో – 5 సీట్లు
- రేడియాలజీలో – 3 సీట్లు
- ఈఎన్‌టీ విభాగంలో –1 సీటు
- కంటి విభాగంలో – 1 సీటు
- నిమ్స్‌లో మత్తులో విభాగంలో –6 సీట్లు
- ఉస్మానియాలో గైనకాలజీలో – 4 సీట్లు
- ఉస్మానియా ఈఎన్‌టీ విభాగంలో – 3 సీట్లు

# నిరంజన్.. నీది గబ్బు చరిత్ర

- సిమెంటు దొంగిలించిన వైనం మరిచావా?
- వావి వరుసల్లేకుండా సంబంధాలు
- వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఆరోపణలు



ఎమ్మెల్యే చిన్నారెడ్డి

వనపర్తి, మార్చి 6(మనంప్రతినిధి): వనపర్తి మండలం మెట్టుపల్లి గ్రామంలో 1985లో ఎంఎస్ చంద్రయ్య అనే దళితుడి ఇంటికి సంబంధించిన సిమెంట్, సీకులు దొంగిలించిన చరిత్ర నిరంజన్‌రెడ్డిదని ఏఐసీసీ కార్యదర్శి, వనపర్తి ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి ఆరోపించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆయన విలేకురుల సమావేశం నిర్వహించారు. అప్పట్లో ఎంఎస్ చంద్రయ్య ఫిర్యాదుతో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మీద వనపర్తి పోలీస్‌స్టేషన్‌లో 779, 420 కింద కేసు నమోదైందని చెప్పారు. మహిళలతో నాకు సంబంధం ఉందంటూ నిరంజన్‌రెడ్డి బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాడని చిన్నారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజానికి వావి వరుసలతో సంబంధంలేకుండా అక్రమ, అనైతిక వ్యవహారాలను నడుపుతున్నది నిరంజన్ రెడ్డేనని వివరించారు. నిరంజన్ పనులు చూసి ఆయన మామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాలకిష్టయ్య కృంగిపోయి, ప్రాణాలు పోగొట్టుకున్నారని చెప్పారు. తన వద్ద ఆధారాలు ఉన్నాయని అవసరమైనప్పుడు వాటిని బయటపెడతానని చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి సింహగర్జనలో రేవంత్‌రెడ్డి వాస్తవాలు మాట్లాడాడన్నారు. ఎంఎస్ చంద్రయ్య ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులతో తాను దాడులు చేయించానన్న ఆరోపణల్లో నిజంలేదని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. తనపై దొంగతనం కేసు పెట్టాడన్న కక్షతో నిరంజన్‌రెడ్డి అతడిపై దాడులు చేయించాడని తెలిపారు.

## 'పాలమూరు' ధరల పెంపుపై నాగం పిల్

హైదరాబాద్, మార్చి 6(మనం లీగల్ ప్రతినిధి): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా పంప్, మోటార్ల ధరలను అనూహ్యంగా పెంచడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్‌రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేసింది. బీజేపీ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై వాదనలు మొదలయ్యాయి. ఎలక్ట్రో మెకానికల్ పరికరాల రేట్లను రూ.1729 కోట్ల నుంచి రూ.2436 కోట్లకు పెంచేశారని, దోపిడీకి ఇదొక నిదర్శమని ఆయన తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వమే కాకుండా బీహెచ్‌ఈఎల్ కూడా కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిందన్నారు. దీనిపై లోతుగా విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా పడింది.

## కోర్టుకొస్తే.. కొడతారా.!

- జీహెచ్‌ఎంసీ, పోలీసులపై హైకోర్టు ఆగ్రహం
- నిందితులను పట్టుకుని కేసు పెట్టాలని ఆదేశం

హైదరాబాద్, మార్చి 6(మనం లీగల్ ప్రతినిధి): హైదరాబాద్ నగర పోలీసులు, జీహెచ్‌ఎంసీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రజాహితంతో హైకోర్టును ఆశ్రయించనందుకు తనను వ్యాపారులు కొట్టారని లక్ష్మీనివాస్ అగర్వాల్ ధర్మాసనం దృష్టికి తెచ్చాడు. హైదరాబాద్‌లోని సిద్దిఅంబర్‌బజార్, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారుల ఆక్రమణలను తొలగించాలని గతంలోనే హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశించిన ఆక్రమణలు తొలగించలేదని అగర్వాల్ హైకోర్టుకు ఫొటోల ఆధారాలతో చూపారు. దాంతో హైకోర్టు నగర పోలీసులు, జీహెచ్‌ఎంసీలపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తనపై వ్యాపారులు దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టారని, ఈదాడి వెనుక పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారుల హస్తం ఉందని అగర్వాల్ మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ దృష్టికి తెచ్చారు. ప్రజాహితంకోసం కోర్టుకు వస్తే వారిని కొడతారా.. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నాం.. దాడి చేసిన వారిని సీసీ పుటేజీల ఆధారంగా పట్టుకుని , కేసులు నమోదు చేయాలని హైకోర్టు బెంచ్ పోలీసుశాఖను ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్ నగరంలో పుట్‌పాత్ ఆక్రమణలపై రిటైర్డు ప్రొఫెసర్ బీఆర్ శాంత్ రాసిన లేఖను కూడా న్యాయమూర్తుల కమిటీ పిల్‌గా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ పిల్‌ను కూడా బెంచ్ విచారించి ప్రతివాదులైన మున్సిపల్ శాఖ సెక్రటరీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్ఎండీఏ కమిషనర్, పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు ఇచ్చింది.

## నిశాంత్‌రెడ్డికి బెయిల్ మంజూరు

హైదరాబాద్, మార్చి 6(మనం లీగల్ ప్రతినిధి): అవినీతి ఆరోపణలపై హెచ్ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తమ్‌రెడ్డిపై ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో నిందితుడైన ఆయన బంధువు గడ్డం నిశాంత్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రతి సోమ,బుధవారాలు ఏసీబీ అధికారుల ఎదుట హాజరుకావాలని, రూ.20వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని హైకోర్టు న్యాయమూర్తి టి.రజనీ మంగళవారం బెయిల్ ఇచ్చారు. పురుషోత్తమ్‌రెడ్డి అల్లుడికి నిశాంత్‌రెడ్డి సోదరుడని, ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నించారని, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తున్నారని, బెయిల్ మంజూరు చేయాలని నిశాంత్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## ఫాసిస్ట్ ధోరణికి పరాకాష్ట: చాడ

హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చడం సంఘ్‌పరివార్ శక్తుల ఫాసిస్ట్ ధోరణికి అద్దంపడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. విదేశీయుల విగ్రహాలు అవసరంలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రకటించడం బాధ్యతా రాహిత్యమని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో చాడ పేర్కొన్నారు. ప్రముఖుల విగ్రహాలు ప్రపంచమంతటా ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. వామపక్ష కార్యాలయాలమీద దాడులు చేసి తగలబెట్టడం, ఆక్రమించుకోవడం వంటి ఘటనలు సంఘ్‌పరివార్ వికృత స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయని చాడ ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయినంత మాత్రాన వామపక్షాలు కనుమరుగుకావని చాడ అన్నారు. వరి మునిగినంత మాత్రాన కొడవండ్లు పారేసుకుంటామా అని ప్రశ్నించారు. విగ్రహాన్ని కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యాప్తంగా నిరసన దినం పాటించాలని సీపీఐ పిలుపునిచ్చింది.

# అటవీ ఫలాలే...ఆదాయ వనరులుగా!

## గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా జీసీసీ.. తొలిసారి అందుబాటులోకి తెలంగాణ తేనె

- వచ్చే ఏడాది రూ.250 కోట్ల అమ్మకాలు లక్ష్యం
- ఇల్లెందులో విజయవంతంగా కారం, పసుపు యూనిట్లు
- హాస్టళ్లకు జీసీసీ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి) : అటవీ ఫలాలే ఆదాయ వనరులుగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) తాను ఎదుగుతూ అడవి బిడ్డల సంక్షేమానికి కృషి చేస్తు ముందుకు సాగుతోంది. గిరిపుత్రులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయటంతో పాటు మార్కెటింగ్ చేసేందుకు గానూ 1956లో జీసీసీని ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో డివిజనల్ కార్యాలయాలున్నాయి. నాటి నుంచి ఇప్పటి వరకు జీసీసీ గిరిజనులకు అండగా ఉంటుంది. గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయాన్ని దళారుల భారిన పడకుండా తానే వాటిని కొనుగోలు చేస్తూ వారికి మద్దతు ధరను ఇస్తూ గిరిజనులకు ఆర్థిక పరిపుష్టిని కల్పించటంలో తనవంతు కృషి చేస్తుంది. ఇప్పటి వరకు జిగురు, కారం, పసుపు వంటివి అమ్మేవారు. తేనెను ఆంధ్రప్రదేశ్‌కు పంపి అక్కడ శుద్ధి చేసి సరఫరా చేసేవారు. కాగా రాష్ట్ర విభజన అనంతరం తేనె విక్రయాలకు తెలంగాణలో తొలిసారిగా జీసీసీ శ్రీకారం చుట్టింది.

**విభజనతో పలు ఇబ్బందులు..**

రాష్ట్ర విభజన జరిగినప్పటికీ సాంకేతిక కారణాలతో జీసీసీ చాలాకాలం వరకు ఉమ్మడిగానే ఉంది. దీంతో ఈ వ్యవస్థ సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవటంలో ఇబ్బందులు ఎదుర్కొనేది. దీంతో నాలుగేళ్ల నుంచి జిగురు అమ్మకాలు, కొనుగోళ్లపై ప్రభావం పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం లేదన్న కారణంతో గోదాముల్లో మురగబెట్టారు. సుమారు రూ.కోటి విలువైన జిగురు ఇప్పటికీ మూలనపడింది. ఇక నుంచి ఈ తరహా సమస్యలకు పరిష్కారం లభించే అవకాశాలున్నాయి. ఇటీవలి కాలంలో జీసీసీ విభజన జరిగింది. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, వరంగల్ జిల్లాలోని ఏటూరు నాగారం, ఖమ్మం జిల్లాలోని భద్రాచలం ఐటీడీఏల పరిధిలోని జీసీసీలను తెలంగాణకు కేటాయించారు. 2017 ఆగస్టులో అధికారికంగా ఈ ప్రక్రియ పూర్తవడంతో మూలనపడి ఉన్న జిగురును విక్రయించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. భద్రాచలం జీసీసీ పరిధిలోని ఇల్లెందులో కారం యూనిట్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇదే స్పూర్తితో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో తేనే విభాగాన్ని అధికారులు ప్రారంభించారు. కాగా ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో సబ్బులు తయారు చేసేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ముడిసరకు తెలంగాణలో అధికంగా ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు.

**250 కోట్లు అమ్మకాలు లక్ష్యంగా..**

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 250కోట్లు వ్యాపారమే లక్ష్యంగా జీసీసీ ప్రణాళికలను రూపొందిస్తుంది. 2014-15లో రూ. 134కోట్లు, 2015-16లో రూ.140కోట్లు, 2016-17లో రూ.150కోట్లు, 2017-18లో రూ. 180 కోట్ల వ్యాపారానికి గానూ ఫిబ్రవరి చివరి నాటికి రూ. 150 కోట్ల వ్యాపారాన్ని జీసీసీ నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా భద్రాచలం, ఏటూరినాగారం, ఉట్నూర్ డివిజన్ కార్యాలయాల ఆధ్వర్యంలో 18 సొసైటీలు, 476 డీఆర్ డిపోల ద్వారా గిరిజనులకు జీసీసీ సేవలందిస్తోంది.



**విద్యార్థులకు కేసీఆర్ కాస్మొటిక్ కిట్‌లు..**

వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల్లాలోని గిరిజన విద్యార్థులకు సీఎం కేసీఆర్ కాస్మొటిక్ కిట్‌లను జీసీసీ అందిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మందికి ఈ కిట్‌లను పంపిణీ చేసినట్టుగా అధికారులు తెలిపారు. కిట్లలో మూడు నెలలకు సరిపడా సామగ్రిని అందిస్తున్నారు. ఒంటి సబ్బు, బట్టల సబ్బు, తల నూనె, పేస్ట్, బ్రష్, టంగ్ క్లీనర్, పౌడర్, షాంపు ఈ కిట్‌లో ఉంటాయి. హైస్కూల్ స్థాయి విద్యార్థినులకు నాప్కిన్‌లను కూడా జీసీసీ ద్వారా ఇస్తున్నారు.

**ప్రభుత్వ సహకారంపైనే ఆశలు..**

గిరిజనుల అండగా ఉంటున్న జీసీసీ భవిష్యత్తుపై నీలినీడలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలోని గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు నిత్యావసర సరుకులను జీసీసీ ద్వారానే ఇప్పటి వరకు సరఫరా చేస్తున్నారు. కాగా త్వరలో విడుదల కానున్న జీవోతో నిత్యావసర వస్తువుల కొనుగోలు సంబంధించి సంబందిత వార్డెన్లకు సర్వాధికారులు ఇవ్వనున్నట్టు తెలిసింది. నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరిగేలా జీసీసీ ఇప్పటి వరకు నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తూ వచ్చింది. ప్రభుత్వం చొరవ చూపి నిత్యావసర సరుకులను జీసీసీ నుంచే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గిరిజనుల అభ్యున్నతి కోసం ఏర్పడిన జీసీసీ బలోపేతానికి ఇది ఎంతో అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.



**తొలిసారిగా తెలంగాణ తేనె...**





ఉమ్మడి రాష్ట్రంలో తేనె సేకరించినప్పటికీ దీన్ని భద్రపర్చి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి పంపేవారు. అక్కడ శుద్ధి జరిగిన తర్వాత సీసాలలో తేనెను నింపి విక్రయాలకు అన్ని జీసీసీలకు పంపేవారు. జీసీసీ తేనెకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. దాదాపు 62 ఏళ్ల నుంచి ఆంధ్ర ప్రాంతం నుంచే తేనెను విక్రయిస్తున్నారు. జీసీసీ విభజన అనంతరం తెలంగాణ గిరిజన సహకార సంస్థ అదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లో తేనె శుద్ధి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. పక్క రాష్ట్రం నుంచి దిగుమతులను అధికారులు తగ్గించారు. నిర్మల్ నుంచి తెలంగాణలోని అన్ని జీసీసీ డిపోలకు ఈ తేనె పంపిణీ జరుగుతుంది. కిలో తేనె ధర రూ.330 ఉండగా అర కిలో రూ.175 గా ఎమ్మార్పీ ధరను జీసీసీ నిర్ణయించింది. దాదాపు 10 శాతం తగ్గించి నిర్మల్ యూనిట్ నుంచి జీసీసీలకు సరఫరా చేస్తున్నట్టుగా అధికారులు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన తేనెను అందించే లక్ష్యంగా నాణ్యతలో రాజీ పడకుండా, తక్కువ ధరకు అందిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. ఇల్లెందులో లాభాల బాటలో నడుస్తున్న కారం, పసుపు యూనిట్‌ను మరింతగా విస్తరించే ఆలోచనలో అధికారులున్నారు.

# వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- రూ. 150కోట్లతో నిర్మాణానికి ఏర్పాట్లు
- దానికి తగ్గట్లే సిబ్బంది నియామకాలు: కడియం
- ఎంజీఎంలో పలు విభాగాలు ప్రారంభించిన మంత్రి
- వైద్యరంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం: లక్ష్మారెడ్డి

వరంగల్, మార్చి 6(మనం న్యూస్ బ్యూరో): నిరుపేద రోగులకు అధునాతన వైద్య సౌకర్యాలను చేరువ చేసేందుకు వరంగల్ కేంద్రంగా రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన సముదాయం ఏర్పాటు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. దీనికి తగినట్లుగా వైద్యసిబ్బందిని నియమించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆసుపత్రిలో ఆయన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డితో కలసి 14పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని, అదేవిధంగా మెకానైజ్డ్ లాండ్రీ యూనిట్, సీనియర్ రెసిడెన్షియల్ డాక్టర్ల వసతి సముదాయాన్ని, 30 పడకల శస్త్ర చికిత్స నూతన వార్డు భవన సముదాయాన్ని, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులలో ఆధునాతన వైద్య పరికరాలు ఏర్పాట చేయడం ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతోపాటు ఆసుపత్రులలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. భూపాలపల్లి, ఏటూరునాగారం ఆసుపత్రులలో ఏజెన్సీ ప్రాంతాల రోగుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ముఖ్యంగా విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఆసుపత్రులలో ఆధునిక వైద్యపరికరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం 40 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. గర్భిణులకు వైద్య సౌకర్యాలు అందించడానికి 102 వాహనాలను ఏర్పాటు చేశామని లక్ష్మారెడ్డి వివరించారు. రాష్ట్రంలో సుమారు 10వేల పోస్టులను భర్తీ చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు లక్ష్మారెడ్డి, కడియం తదితరులు

## దరఖాస్తుదారులందరికీ ఫూలే స్కాలర్‌షిప్‌లివ్వాలి

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్‌సిటీ, మార్చి 6(మనం ప్రతినిధి ): విదేశీ విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మహాత్మజ్యోతిభాపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇరవై లక్షల సహాయ పథకాన్ని సాచ్యురేషన్ పద్ధతిలో అందరికీ వర్తింప చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని బీసీ ప్రతినిధుల బృందం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్నను కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పేద బీసీ విద్యార్థులకు వివిధ దేశాల్లో చదువుకునే అవకాశం రావడం వరం లాంటిదని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 2016-17 విద్యాసంవత్సరంలో ఈ పథకాన్ని ప్రారంభించారని కానీ యాభైశాతం ఉన్న బీసీలకు 300మందికి మాత్రమేనని పరిమితి విధించారన్నారు. గత సంవత్సరం సరియైన ప్రచారం లేకపోవడంతో కేవలం 150మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మంత్రి జోగురామన్న సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

## టెంత్‌లో నిమిషం నిబంధన లేదు: టీపీటీఎఫ్

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి): పదో తరగతి పరీక్షల్లో ఒక్క నిమిషం లేటు నిబంధనకు సంబంధించిన ఉత్తర్వులే వీ విద్యాశాఖ ఇవ్వలేదని టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రొగెసివ్ టీచర్స్ ఫెడరేషన్) నాయకులు తెలిపారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో సంచాలకులు కిషన్‌ను వారు కలిసి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరీక్షల సంచాలకులు సుధాకర్ సంప్రదించగా నిమిషం లేటుకు సంబంధించి పరీక్షల విభాగం నుంచి ఉత్తర్వులు జారీచేయలేదని, ఆ విషయంలో అపోహలు, అనుమానాలు అవసరంలేదన్నారని తెలిపారు. కలెక్టర్ల సమావేశంలో చర్చించిన కథనాలతో విద్యార్థులు భయాందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఒక నిమిషం లేటుకు సంబంధించి ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వులు ఇవ్వాలనే ఆలోచలో ఉంటే వెంటనే విరమించుకోవాలని, లేకుంటే తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించాల్సి వస్తుందని టీపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు.

# ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి: తుమ్మల

భూపాలపల్లి, మార్చి 6(మనం న్యూస్): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో 14 సంవత్సరాల పాటు చేసిన పోరాటాల స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికోసం పాడుపడుతున్నామని మంత్రులు కడియం శ్రీహరి, తుమ్మల నాగేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డిలు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం నాడు వారు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలను స్పీకర్ సిరికొండ మధుసూధనాచారితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం పూర్తిగా వివక్షకు గురైందని పాలకుల వివక్షలోంచే తెలంగాణ పోరాటం మొదలైందని వారు అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితోనే ప్రస్తుతం అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నామని అన్నారు. అయిదు దశాబ్దాల పాలనలో జరగని అభివృద్ధిని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేవలం నలబై నెలల్లో చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయటమే కేసీఆర్ ధ్యేయమని ఆ దిశగానే పాలన సాగుతోందన్నారు. కేసీఆర్ పాలన, ఆయన మేథోశక్తి దేశరాజకీయాలకు అవసరమని అ వైపుగా రాజకీయా లు మారుతున్నాయని అన్నారు. నిత్యం తన ప్రజలు తన నియోజకవర్గం అంటూ పరితపించే సిరికొండ మదన్న ఎమ్మెల్యే కావటం భూపాలపల్లి నియోజకవర్గ ప్రజల అదృష్టమని అన్నారు. ఆయన నేతృత్వంలో భూపాలపల్లి నియోజకవర్గం అన్నిరంగాల్లో అబివృద్ధి చెందుతోందన్నారు.ఈ సందర్భంగా 10 కోట్లతో 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని, మార్కెట్ శాఖ గిడ్డంగులను, భూపాలపల్లి నగర పంచాయతి నూతన భవనాన్ని, ఎమ్మెల్యే క్వార్టర్‌ను మంత్రులు ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# మీర్‌పేట్‌లో విద్యార్థి ఆత్మహత్య



బాలాపూర్, మార్చి 6(మనం న్యూస్): జల్సాలకు అలవాటుపడి చదువును పక్కనపెట్టిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి అర్థాంతరంగా జీవితాన్ని ముగిం చాడు. నాలుగేళ్ల కోర్సులో 21 సబ్జెక్టులు బ్యాక్‌లాగ్ ఉండడం.. మరికొద్ది రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్ ఉండడంతో తల్లిదండ్రులకు ముఖం చూపిం చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో జరిగిన ఈ దుర్ఘటన వివరాలు.. మంచిర్యాల టౌన్‌కు చెందిన కందుల విక్రం(21) టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) నాలుగో ఏడాది చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి ఆర్ఎన్‌రెడ్డిలోని సాయికుమార్ అనే స్నేహితుడి ఇంట్లో సోమవారం రాత్రి పార్టీ చేసుకున్నారు. ఆ తర్వాత స్నేహితుడిని కలిసి వస్తానంటూ బైక్ తీసుకొని బయటికి వెళ్లాడు. మీర్‌పేట లోని మణికంఠానగర్‌లో ఉంటున్న స్నేహితుడు మధుకర్ దగ్గరికి వెళ్లి పెంట్‌హౌజ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు తన రూంమ్మేట్‌కు తాను చనిపోతున్నానని మెసేజ్ చేశాడు. అందులో తన బంగారు గొలుసు పోయిందని చెప్పి తాకట్టుపెట్టానని విక్రం పేర్కొన్నాడు. ఆ గొలుసును విడిపించి చైతు అనే స్నేహితునికి నాలుగువేలు ఇవ్వాలని సూచించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేయగా అతని బీటెక్‌లో 21 సబ్జెక్ట్స్ బ్యాక్‌లాగ్ ఉన్నాయని తేలింది. దీంతో తల్లిదండ్రులకు ఏమిచెప్పాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నట్టుగా అనుమానం వ్యక్తంచేశారు.



హైదరాబాద్‌లో మంగళవారం ప్రభుత్వ సలహాదారు వివేక్ కుమారుడు వంశీ, ప్రముఖ మెజీషియన్ సామల వేణు కూతురు రోష్ని వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం కేసీఆర్.

# థర్డ్ ఫ్రంట్‌పై మమత ఫోన్ చేశారు

- ఇప్పటికైతే యూపీఏలో ఉన్నాం
- చేరే విషయంపై పార్టీలో చర్చించి నిర్ణయం: స్టాలిన్

న్యూఢిల్లీ, మార్చి 6: సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుపై మరో ప్రాంతీయ పార్టీ నేత స్పందించారు. తమిళనాడుకు చెందిన డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ మూడో ఫ్రంట్‌పై తన అభిప్రాయాన్ని చెప్పారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఈ నెల 4వ తేదీని తనకు ఈ విషయమై ఫోన్ చేసినట్లు స్టాలిన్ వెల్లడించారు. అయితే తాము ఇప్పటికే యూపీఏలో భాగస్వామ్య పక్షంగా ఉన్నామని, ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉన్న నేపథ్యంలో మూడో ఫ్రంట్‌పై హైలెవల్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేశారు. కేసీఆర్ మూడో ఫ్రంట్ ఆలోచనను తెరపైకి తీసుకురాగానే మమతా బెనర్జీతోపాటు అసదుద్దీన్ ఒవైసీ,అజిత్ జోగిలాంటి నేతలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పటికే కేసీఆర్ కూడా దీనికి సంబంధించిన ఎజెండా రూపకల్పనలో బిజీగా ఉన్నారు. దేశంలోని అన్ని మహానగరాల్లోనూ పర్యటించి.. ఆలిండియా సర్వీసెస్ రిటైర్డ్ అధికారులతో చర్చలు జరపాలని ఆయన నిర్ణయించారు.

## మాటమార్చిన హేమంత్ సోరెన్

ఫెడరల్ కూటమి ప్రతిపాదన మద్దతు విషయంలో అప్పుడే ఓ పార్టీ వెనక్కి తగ్గినట్లుగా కనిపిస్తోంది. జేఎంఎం నేత హేమంత్ సోరెన్ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేయబోతున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడిన ఆయన.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ''ఈ విషయమై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో చర్చించాం. వచ్చే ఎన్నికల్లో జేఎంఎం నేతత్వంలో పోరాడేందుకు రాహుల్ సుముఖత వ్యక్తం చేశారు'' అని తెలిపారు. థర్డ్ ఫ్రంట్ విషయంలో కేసీఆర్‌తో తాను మాట్లాడానని.. రాష్ట్రాల్లో ఉన్న బలమైన నాయకులు కలిస్తే జాతీయ స్థాయిలోని పార్టీలను ఎదుర్కోవచ్చని హేమంత్ సోరెన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసీఆర్‌పై పొగడ్తలు గుప్పించిన సోరెన్.. 48 గంటలు గడవకముందే కూటమిపై వెనక్కి తగ్గటం గమనార్హం.





పార్లమెంట్ ఆవరణలో టీఆర్ఎస్ ఎంపీల ధర్నా

# రిజర్వేషన్లు 50% మించొద్దని లేదు

- టీఆర్ఎస్ ఎంపీ కవిత స్పష్టీకరణ
- పార్లమెంట్‌లో కొనసాగిన ఆందోళన

హైదరాబాద్, మార్చి 6: రిజర్వేషన్ల విషయంలో పార్లమెంట్‌లో గళమెత్తిన టీఆర్ఎస్ ఎంపీలు.. మంగళవారం కూడా అదే జోరు కొనసాగించారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం దగ్గర గులాబీ పార్టీ ఎంపీలు ధర్నాకు దిగారు. రిజర్వేషన్ల అమలు అధికారం రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అంతకుముందు సభ ప్రారంభమైన కొద్దిసేపటికే టీఆర్ఎస్ ఎంపీలు.. రిజర్వేషన్ల అమలు రాష్ట్రాలకే అప్పగించాలంటూ నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఆందోళనలో కవిత మాట్లాడుతూ.. రిజర్వేషన్లు 50శాతం మించరాదని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. ఇలా మించకూడదని సుప్రీంకోర్టు మాత్రమే ఒక తీర్పులో చెప్పిందని, అయితే అవసరమైన చోట 50 శాతం మించి ఇవ్వొచ్చని కోర్టు ప్రకటించిందని గుర్తుచేశారు. మైనారిటీలు ఇతర అన్ని వర్గాల కంటే వెనుకబడి ఉన్నారన్నారు. మతపరమైన రిజర్వేషన్లు అనడం సరికాదని ఎంపీ అన్నారు. రిజర్వేషన్లపై అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని, తెలంగాణకు పారిశ్రామిక రాయితీలు కల్పించాలని ఎంపీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణలో మైనారిటీల కోటా పెంచాలని, ఇందుకు అనుగుణంగా రాజ్యాంగంలోని అధికరణం 16(4) నిబంధనను సవరించాలని డిమాండ్ చేశారు.

# ఎల్లుండి రాష్ట్ర బంద్

- ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టుల పిలుపు

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి) :తెలంగాణ-ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతికి నిరసనగా.. ఈ నెల 9న (శుక్రవారం) రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్టు మావోయిస్టులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యహింసలో భాగంగానే మావోయిస్టులు భూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆ లేఖలో విమర్శించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాగా, పోలీసులకు, మావోయిస్టులకు మధ్య గత నాలుగు రోజులుగా చోటు చేసుకున్న ఎరిణామాలు రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారచర్యగా మావోయిస్టులు సోమవారం రాత్రి విధ్వంసాలకు పాల్పడ్డారు. ఒకరిని కాల్చిచంపటంతో పాటు తెలంగాణ ఆర్టీసీ బస్సును, రెండు ప్రయివేటు వాహనాలు దహనం చేశారు. కాగా, మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో ఏజెనీ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పెంచినట్లు తెలిసింది. ప్రాంతాల్లో మంత్రులు, టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పర్యటించే క్రమంలో ముందస్తు సమాచారం తమకు ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా కూంబింగ్ చేపడుతున్నారు.

# ధనిక రాష్ట్రంలో ఆర్థిక ఆంక్షలెందుకు

- టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల



హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): ప్రభుత్వ పథకాలు కాగితాలకు, ప్రభుత్వ ప్రచార ఆర్భాటలకే పరిమవుతున్నాయి తప్ప అర్హులకు అందడంలేదని టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రంలో ఆసరా పింఛన్లు, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలకు నిధులు మంజూరు చేయకుండా ప్రభుత్వం ఆర్థిక ఆంక్షలు ఎందుకు విధిస్తోందని ఆయన ప్రశ్నించారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో రావుల మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రం, పైగా రూ.లక్షల కోట్ల అప్పులు తెస్తూ చిన్న చిన్న చెల్లింపులను నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెట్టాల్సిన అవసరమేంటో తెలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం డీపీఆర్‌లు సిద్ధం చేసిన ప్రాజెక్టులను, కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తే, టీఆర్ఎస్ పెద్దలు వాటి వద్ద ఫొటోలు దిగి, వాళ్లే నిర్మించినట్టు ఫోజు కొడుతున్నారని రావుల ఎద్దేవా చేశారు. గత రెండు బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఇప్పటి వరకు విడుదల చేసింది మాత్రం రూ.27 కోట్లు మాత్రమేనన్నారు. ఏపీ, కర్ణాటకలో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతుంటే, వ్యవసాయం, తెలంగాణలో ఎందుకు పెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రవేశ పెట్టిన రూ.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఏయే రంగాలకు ఎంత ఖర్చు చేశారో వెల్లడించాలని రావుల డిమాండ్ చేశారు.

## మంత్రివర్గంలో మహిళలకు చోటివ్వండి: టీటీడీపీ

రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా, మహిళలను టీఆర్ఎస్ ప్రభుత్వం అవమానిస్తోందని టీటీడీపీ తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలు బండ్రు శోభారాణి విమర్శించారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో శోభారాణి అధ్యక్షతన మహిళా విభాగం సమావేశం జరిగింది. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై ఈ భేటీలో చర్చించారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకోకుండా, ఇకనైన మహిళలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చి 13న తలపెట్టిన బంద్‌కు మద్దతివ్వాల్సిందిగా ఎమ్మార్పీఎస్ మహిళా నేతలు జెర్రిపోతుల లత, రేణుకాదేవి, తదితరులు శోభారాణిని కలిశారు.

## మన మహిళా

# మణులు వీరే..



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో సంబురాలు

- వివిధ రంగాల్లో విశిష్ట సేవలు
- 20 మందిని ఎంపిక చేసిన ప్రభుత్వం
- మహిళా దినోత్సవం రోజు సత్కారం
- లక్ష నగదు, మెమొంటోతో సన్మానం

హైదరాబాద్, మార్చి 6 (మనం ప్రతినిధి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన 20 మంది ప్రముఖ మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. అవార్డులకు ఎంపికైన వారిలో విద్య, వైద్య, క్రీడా, సాహిత్యం, నాట్యం, సంగీతం, వ్యవసాయం, సమాజసేవ తదితర రంగాలకు చెందిన వారు ఉన్నారు. ఇటీవల జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో రజత పతకం సాధించిన అరుణారెడ్డితో పాటు, సినిమా డైరెక్టర్ నందినీరెడ్డి, హైదరాబాద్ మెట్రో రైల్ డ్రైవర్ సుప్రియ సనం, ఢిల్లీ ఆర్టీసీ డ్రైవర్ సరిత, ఉద్యమ గాయకురాలు ఎదునూరి పద్మ, మహిళా సాధికారతలో యాప భద్రమ్మ తదితరులు అవార్డుకు ఎంపికయ్యారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్ కమిటీ.. ఈ అవార్డుల జాబితాను రూపొందించింది. ఈ అవార్డులకు ఎంపికైన 20 మంది మహిళలను ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న రూ.లక్ష నగదు రివార్డుతో సత్కరించనుంది. అవార్డులు పొందినవారు..



కవిత దరియాని



అరుణారెడ్డి



నిత్య సంతోషిని



నందినీ రెడ్డి



సరిత



సుప్రియా సనమ్

| రంగం | పేరు | వివరాలు |
|---|---|---|
| విద్య | కవిత దరియాని | వీసీ- జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల |
| క్రీడారంగం | అరుణా రెడ్డి | ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతకం |
| వైద్యం | డాక్టర్ సత్యలక్ష్మి | సంచాలకులు-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి- పుణె |
| సాహిత్యం | చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ | పద్యకవిత్వం, అభినవ మొల్ల |
| సాహిత్యం | డాక్టర్ సిరి | బాలసాహిత్యం కోసం కృ షి |
| నృత్యం | మంజులా శ్రీనివాస్ | శాస్త్రీయ నృత్యం |
| సంగీతం | నిత్య సంతోషిణి | శాస్త్రీయ సంగీతం, నేపథ్య గాయణి |
| చిత్రలేఖనం | కవితా దేవుస్కర్ | చిత్రలేఖనంలో ప్రతిభ |
| సినిమా | నందినీ రెడ్డి | చిత్రనిర్మాణం, దర్శకత్వం |
| జానపద సంగీతం | ఝాన్సీ | జానపద సంగీతంలో ప్రతిభ |
| ఉద్యమ గానం | ఈదునూరి పద్మ | తెలంగాణ ఉద్యమ గానం |
| ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు | రాజ్యలక్ష్మి | వడ్డెర కూలీలకు ఉపాధి అవకాశాలు, |
| జర్నలిజం | లతాజైన్ | మహిళ సమస్యలపై కథనాలు |
| జర్నలిజం | సౌమ్య నాగపురి | పలు సామాజిక అంశాలపై కథనాలు |
| ప్రొఫెషనల్ సేవలు | సుప్రియ సనం | హైదరాబాద్ మెట్రో రైలు తొలి మహిళా డ్రైవర్ |
| ప్రొఫెషనల్ సేవలు | సరిత | ఢిల్లీ ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్ |
| మహిళా సాధికారత | యాప భద్రమ్మ | మహిళా సంఘాలకు ప్రోత్సాహం |
| వ్యవసాయం | బొగ్గం జయమ్మ | అధునాతన వ్యవసాయం |
| ప్రజా ప్రాతినిథ్యం | శైలజ | సర్పంచి, కొత్తపల్లి గ్రామం- గ్రామాభివృద్ధికి కృషి |
| సామాజిక సేవ | గండ్ర రమాదేవి | సమస్యల్లో ఉన్న మహిళలకు సాయం |

# పంటకు లాభసాటి ధర రావాలి

- ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలకు రూపకల్పన
- విదేశాలకు ఎగుమతి చేసేలా విధానాలు
- కేబినెట్ సబ్ కమిటీ భేటీలో పోచారం
- హాజరైన కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల



కేబినెట్ సబ్ కమిటీ భేటీ

హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): రైతులు పండించిన పంటకు లాభసాటి ధరను పొందాలని ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు రూపకల్పన చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలోని డి బ్లాక్‌లో ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు విధివిధానాల రూపలక్పన కోసం కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. కమిటీ సభ్యులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు, ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని పట్టిష్ఠం చేయడానికి, రైతు పండించిన పంటకు లాభసాటి ధర అందించేందుకు సీఎం కేసీఆర్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రాంతాలకు అనుగుణంగా పండే పంటల విస్తీర్ణం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిశ్రమలు, నూతనంగా అవసరమయ్యే పరిశ్రమలపై సమావేశంలో చర్చించామని తెలిపారు. ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూపకల్పనలో భాగంగా జిల్లాలవారీగా పంటల బై ప్రోడక్ట్స్‌పై సమాచారం సేకరించనున్నట్టు తెలిపారు. రైతులు పంటకు తృప్తికరమైన ధర పొందాలే కానీ.. ఏదో పండించాను.. కొనేవారు లేక నా ఖర్మకు ఇంతే అనే దుఖంతో అమ్ముకోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ రంగం పటిష్ఠం కోసం 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, రాబోవు కొద్దిరోజుల్లో రెండు పంటలకు సాగునీరు, వచ్చే వానాకాలం నుంచి ముందస్తు పెట్టుబడికి ఎకరాకు రూ.8వేలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర పొందే విధంగా విధానాలను రూపొందించడమే కేబినెట్ కమిటీ ఉద్దేశమని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతుల బాధలు తెలవడం వల్లే.. రైతు ఆత్మగౌరవాన్ని పెంచి పంటలకు లాభసాటి ధరలను కల్పించాలనే ఉద్దేశంతో దేశంలో మొదటిసారిగా రైతులపై శ్రద్ధ వహిస్తున్నారన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి, కమిషనర్ జగన్‌మోహన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.


# స్వార్థ రాజకీయాల కోసం తప్పుదోవ

- విపక్షాలపై తలసాని మండిపాటు
- సచివాలయానికి వచ్చిన గద్వాల కురుమలు
- సబ్సిడీపై గొర్రెలు ఇవ్వాలని వినతి



హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ నేతలు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గద్వాల జిల్లాకు చెందిన కురువ కులస్తులు పెద్ద ఎత్తున సచివాలయానికి తరలివచ్చి పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను కలిసి తమకూ సబ్సిడీ గొర్రెలను ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నేటి వరకు రాష్ట్రంలో 47 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని, బంగారు తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. 45 ఏండ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చేయలేని అభివృద్ధిని నాలుగేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. ప్రజలను మభ్య పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. కురువలందరికీ గొర్రెలను అందజేస్తామని, గొర్రెల పంపిణీకి అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు.

# తృణధాన్యాలతో ఆరోగ్యం



- సేంద్రియ ఉత్పత్తులు బెస్ట్
- చిరుతిళ్లలో పెద్దమొత్తంలో ఆర్సెనిక్
- పండ్లల్లో కృత్రిమ రసాయనాలు
- ఉత్పత్తి పెంచేందుకు అడ్డదారులు
- వాటిని తింటే రోగాలు తప్పవు
- సంపూర్ణ ఆరోగ్యానికి నిపుణుల సూచనలు

హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): కొన్ని తరాలు వెనక్కి వెళితే.. జబ్బు చేస్తే వంటింట్లోని దినుసులతో, పెరట్లోని ఆకులతో నయం చేసేవారు. ఎనిమిది పదులు దాటినా పరుగులు పెడుతూ పనిచేసేవాళ్లు. కనుచూపు మేరలో ఏముందో స్పష్టంగా చెప్పేవాళ్లు. ఊతకర్ర కానీ, మనిషి సాయం కానీ అవసరంలేకుండానే నూరేళ్లు హాయిగా జీవించేవాళ్లు.. ఆధునిక యుగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా ఆరోగ్యం విషయంలో నానాటికీ దిగజారిపోతున్నాం.. కొంగొత్త జీవనశైలి పేరుతో కొత్త రోగాలను ఆహ్వానిస్తున్నాం! జీవన పరిస్థితులలో మార్పులు, రసాయన ఎరువుల వాడకం, నిల్వ ఆహార పదార్థాలు, మితిమీరిన మాంసాహారం వంటి అలవాట్లు అనారోగ్యానికి దారితీస్తున్నాయి. ఎటుచూసినా కాలుష్యం పెరిగిపోతున్న వేళ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రాగి, జొన్న, కొర్ర, సజ్జ, తైద, అరికలు వంటి తృణధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలను, కార్బైడ్ ఉపయోగించని పండ్లను తినాలని చెబుతున్నారు. ఈ రోజుల్లో ప్రజలు తీసుకోవాల్సిన ఆహార నియమాలపై నిపుణుల అభిప్రాయాలు..

> చిన్నారులు తక్కువ ఆహారం తినడం మంచింది. బార్లీ, రాగి, జొన్న, బార్లీ, కొర్రలు, సామలతో తయారు చేసిన పదార్థాలు తినిపించాలి. మొలకెత్తిన ధాన్యాలను అందించాలి. వీటిల్లో సెలీనియం ఎక్కువగా ఉంటుంది.

## అన్నంలో ఆర్సెనిక్ విషం

మనదేశంలో 20శాతం కంటే ఎక్కువమంది మదుమేహం, కేన్సర్ వ్యాధులతో బాధపడుతున్నారని, ప్రధానంగా దక్షిణ భారతీయులు ఆ జాబితాలో ఉన్నారని నేషనల్ కెమికల్ ల్యాబరేటరీ ఫార్మర్ సైంటిస్ట్ డా.ఒ.జి.బి. నంబియర్ తెలిపారు. ఎందుకంటే సౌత్ ఇండియాలో అన్నాన్నే ఆహారంగా తీసుకుంటారని, వరి అన్నంలో ఆర్సెనిక్ ఉండటమే ఈ జబ్బులకు కారణమని చెప్పారు. జీవక్రియలు సక్రమంగా జరగాలంటే థయామిన్ అవసరమని, ఆర్సెనిక్ శరీరంలో ఉండటం వల్ల థయామిన్ లోపిస్తుందని, తద్వారా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతోందన్నారు. అది మదుమేహానికి దారితీస్తుందని తెలిపారు. బెంగాల్, బిహర్ ప్రజలు తాగే మంచినీళ్లలో ఆర్సెనిక్ ఉండటం వల్ల అక్కడి వారికి ఎక్కువగా చర్మ కేన్సర్లు వస్తున్నాయన్నారు. బంగాళాదుంపల్లో కూడా ఆర్సెనిక్ ఉంటుందని, కట్ చేసి మంచిగా కడగడం వల్ల అది పోతోందని సూచించారు. మార్కెట్లలో లభించే చిప్స్‌లలో ఆర్సెనిక్ ఎక్కువగా ఉంటుందని, చిన్న పిల్లలు, గర్భిణులు అవి తినకూడదని హెచ్చరించారు. డైరీఫామ్‌లలో కోళ్లు త్వరగా బరువు పెరగడానికి ఫీడింగ్ ఇస్తుంటారని, వాటిల్లోనూ ఆర్సెనిక్ ఉంటుందని, ఆ కోళ్లను వండుకుని తినడం వల్ల కూడా శరీరంలోకి ఆర్సెనిక్ ప్రవేశిస్తుందని తెలిపారు. డ్రై ఫిష్‌లో థయామినేజ్ ఉంటుందని, ఇది థయామిన్‌ను నాశనం చేస్తుందని, అందువల్ల డ్రై ఫిష్ తినకపోవడమే ఆరోగ్యానికి మంచిదన్నారు. నేటికాలంలో చాలామంది రైస్‌కుక్కర్‌లలో అన్నాన్ని వండుతున్నారని, ఇందులో వండినపుడు గంజి వార్చడం ఉండదని అన్నారు. బిర్యానీ కూడా అదే పద్ధతిలో చేస్తామని, ఈ రెండు పద్ధతుల్లో గంజి వార్చక పోవడం వల్ల ఆర్సెనిక్ అన్నంలోనే ఉంటుందన్నారు. ఇది ఆరోగ్యానికి ప్రమాదకరమని తెలిపారు. అన్నంలో ఆర్సెనిక్ విషాన్ని తొలగించాలంటే.. ఒక పాలు బియ్యంలో, 6 పాళ్ల నీళ్లు పోయాలని, అది బాగా ఉడికిన తర్వాత గంజిని వార్చి పారబోయాలన్నారు. బియ్యంలో ఉన్న ఆర్సెనిక్ గంజిలోకి వచ్చి వార్చినప్పుడు పోతోందన్నారు.

## పాలు, మాంసాహారం తగ్గించుకోవాలి


ఒకప్పుడు ఆహారం తీసుకోవడం వల్ల శక్తి వచ్చేది, కానీ ఈనాటి పరిస్థితుల్లో ఆహారం శక్తినివ్వడంతో పాటు విషతుల్యాలను కూడా శరీరానికి అందిస్తోందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి డైరెక్టర్ కె.సత్యలక్ష్మి తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల ఆహార ధాన్యాలు కలుషిత మవుతున్నాయని, రసాయన కలుషిత ఆహారమే మనకు హాని కలిగిస్తుందన్నారు. నాటి కాలంలో జబ్బులు వస్తే చికిత్స చేయగానే తగ్గిపోయావే, కానీ నేటి తరంలో కేన్సర్, మదుమేహం,ఆర్థరైటిస్, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి నయం కాని జబ్బులతో మనం సతమతమవుతున్నామన్నారు. ఒరిజినాలిటీ, టేస్ట్, ఫ్లేవర్ కోల్పోకుండా, రసాయనిక ఎరువులు వాడని ఆహారమే సహజమైందని, అలాంటి ఆహారాన్ని తీసుకుంటే ఏలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని సూచించారు. ప్రిజర్వేటివ్ ఫుడ్‌ను తీసుకోకపోవడమే ఎంతో ఉత్తమమన్నారు. ప్రతి రోజు 30శాతం నుంచి 50శాతం వరకు పచ్చి కూరగాయలు తీసుకోవాలని, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు ఆహారంలో భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. పాలు, మాంసాహారం మనం అధికంగా తీసుకుంటున్నామని, ఇది పర్యావరణానికి చేటు చేస్తుందని ఆవేదనతో చెప్పారు. పాలు మంచివే అంటుంటాం.. కానీ ఆ పాలు ఎలా ఉత్పత్తి అవుతున్నాయో గమనించడం లేదని, పది లీటర్లు ఇచ్చే ఆవులు, బర్రెలు అదనంగా యాభై లీటర్లు ఇస్తున్నాయంటే, ఆ జంతువులకు ఏవో రసాయనాలు అందిస్తున్నట్లే లెక్క అని మనం అర్థం చేసుకోవడం లేదన్నారు. మాంసాహారం అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదన్నారు.

> ఈ కాలంలో చాలా మంది బ్రౌన్ రైస్ తినడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కానీ వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులు అనుసరించడం లేదు. రసాయనిక ఎరువల కారణంగా భూమి సారం కోల్పోవడంతో పాటు విషతుల్యంగా మారింది. ఆ కారణంగా బ్రౌన్‌రైస్‌లోనూ అత్యధిక శాతంలో ఆర్సెనిక్ ఉంది. వరి అన్నం, బ్రౌన్ రైస్ బదులుగా కొర్ర అన్నం తినడం మంచిది. ఇందులో ఉన్న థయామిన్ షుగర్ వ్యాధిని నియంత్రిస్తుంది. ఆరోగ్యానికి మంచి చేసే ఈ అన్నంతో ఎన్నో వ్యాధులను నివారించవచ్చు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
బుధవారం, మార్చి 7




## మంచిమాట



'నాకు సాయం చేయడానికి రానివారందరికీ కృతజ్ఞతలు... ఎందుకంటే వారివల్లనే సొంతంగా పనిచేయటం నేర్చుకున్నాను.'

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

# మూడో రాకడ..

ప్రత్యామ్నాయం ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా నిలుస్తుంది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. స్వాతంత్ర్య అనంతరం కాలం నుంచి కాంగ్రెస్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా సుదీర్ఘకాలం నడిస్తే, సంకీర్ణ రాజకీయాల యుగంలో కాంగ్రెస్, బీజేపీల ప్రత్యర్థి కేంద్రాలుగా రెండు కూటములు నడుస్తున్నాయి. మూడవ ప్రత్యామ్నాయం కోసం గతం నుంచి అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ సఫలం కాలేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి చతికిలబడి స్థిరమైన ప్రతిపక్షంగా లేకపోవడం, దేశవ్యాప్తంగా అభివృద్ధి నినాదంతో 'ఏకీకృత హిందూ అస్తిత్వా'న్ని (యూనిఫైడ్ హిందూ ఐడెంటిటీ) సంఘటితం చేసే రహస్య అజెండాతో బీజేపీ సాగిస్తున్న రాజకీయ జైత్రయాత్రలో ప్రాంతీయ పార్టీలు బలహీనపడుతున్నాయి. ఉత్తర, దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారతదేశమంతటా బీజేపీ సాగిస్తున్న కార్యకలాపాలు ప్రాంతీయపార్టీలను కలవరపెడుతూ ప్రత్యామ్నాయం కోసం ఎదరుచూస్తున్నాయి. కాంగ్రెస్ బలమైన ప్రతిపక్షంగా బీజేపీకి గట్టిపోటీ ఇవ్వగలదన్న నమ్మకం కొరవడిన నేపథ్యంలో మూడవ ప్రత్యామ్నాయం కోసం దేశంలోని విభిన్న రాజకీయ పక్షాలు ఎదురుచూస్తున్న పరిస్థితి. కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు పిలుపునకు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత హేమంత్ సోరెన్ తదితరులు మద్దతు ప్రకటించారు. కేసీఆర్ ఈ ప్రకటనను రెండు జాతీయ పార్టీల పట్ల లేదా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై గుడ్డి వ్యతిరేకతతో చేయలేదు. దేశంలో నెలకొన్న రాజకీయ ప్రత్యామ్నాయ శూన్యతకు, రాష్ట్రాల ఆకాంక్షల పరిపూర్తికి ఒక తార్కిక పరిష్కారంగా ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

'ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది. దేశంలో అసహనం నెలకొంది. మార్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. దేశం కొత్తదిశలో సాగాల్సి ఉంది. ప్రబలమైన గుణాత్మక మార్పు రావాల్సి ఉంది' అని ఇటీవల థర్డ్ ఫ్రంట్ ప్రకటన సమయంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యానం సమకాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. అధికార కేంద్రీకరణ మూలంగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయి. విదేశీ వ్యవహారాలు, సరిహద్దులు, అంతర్గత భద్రత వంటి అంశాలు కేంద్రం చేతిలో ఉండడం సమంజసమే. అదే సమయంలో దేశవ్యాప్త సమస్యలు, సవాళ్లు, లక్ష్యాలు, కర్తవ్యాలపై కేంద్రం స్థూల దిశానిర్దేశం చేయవచ్చుగానీ, రాష్ట్రాలు నిర్వహించుకోగలిగిన రోజువారీ అంశాల్లో జోక్యం చేసుకోవడం వల్ల సాధారణ పాలన కుంటుపడిపోతోందని రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీలను పట్టించుకోకపోవడం సహా తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపుల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం, కొందరు ముఖ్యమంత్రులు ఢిల్లీ వెళ్లినా ప్రధాని కలిసే అవకాశం లేకపోవడం వగైరా ఉదంతాలు రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దన్న వైఖరికి తార్కాణాలుగా నిలుస్తాయి. నదీజలాల అంతరాష్ట్ర వివాదాల పరిష్కారంలో కాలయాపన కారణంగా అవి సంక్లిష్టంగా మారుతుండడం కేంద్రం వైఫల్యమే. దాంతో పాలనావ్యవస్థ నిర్వీర్యమై, విశ్వసనీయతను కోల్పోవడంతో అనేక ప్రజా ఉద్యమాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రాల నుంచి దేశపాలన సహకార సమాఖ్యగా మారాలనే ఆకాంక్ష బలంగా ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలు ఒక జాతీయ ప్రత్యామ్నాయంగా ఏకం కావాలని కేసీఆర్ చేసిన ప్రతిపాదన చారిత్రకమైనది.

1973లోను 1979లోను సంభవించిన రెండు చమురు సంక్షోభాల నేపథ్యంలో ప్రపంచ దేశాల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలోనే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ, దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయ రాజకీయాల, హక్కుల ఉద్యమాలు వెల్లువెత్తాయి. అనేక ప్రాంతీయ పార్టీలు వివిధ రాష్ట్రాల్లో బలమైన రాజకీయ శక్తులుగా అవతరించాయి. ఎమర్జెన్సీ అనంతరం కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బలమైన జాతీయ పార్టీ లేకపోయినా, అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈనేపథ్యంలో రాజకీయ శూన్యతను ఛేదిస్తూ 'కేంద్రం మిథ్య' అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్‌టీ రామారావు చొరవతో 1989లో మొదటి ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి (థర్డ్ ఫ్రంట్)గా 'నేష నల్ ఫ్రంట్ ' ఉనికిలోకి వచ్చి 1991 దాకా కొనసాగింది. ఆ తర్వాత 1996లో ఏర్పడిన దేశవ్యాప్త రాజకీయ అస్థిరత నేపథ్యంలోనూ ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రెండవసారి ప్రాంతీయ పార్టీల భాగస్వామ్యంతో 'యునైటెడ్ ఫ్రంట్' పేరుతో ప్రత్యామ్నాయ రాజకీయ కూట మి ఏర్పడి రెండేళ్లకే విచ్ఛిన్నమై పోయింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూట మి, కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగడం మూలాన రెండవసారి ఏర్పడిన థర్డ్‌ఫ్రంట్ స్వల్పకాలం మాత్రమే నిలబడింది. అయితే ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో ఉత్తరాదిన బీజేపీకి వ్యతిరేకంగా సమాజ్‌వాది పార్టీతో మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్‌వాది పార్టీకి మధ్య సయోధ్య కుదరడం, దక్షిణాదిలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ స్థాయిలో థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటుకు మరొకసారి చొరవ చూపడం అనే రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతీయ పార్టీలు కలిస్తేనే జాతీయ స్థాయిలో థర్డ్‌ఫ్రంట్ మూడో రాకడ సాకారమవుతుంది.

సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయే దశకు చేరుకోవడంతో ఆర్థిక, సాంకేతిక సహకారం దెబ్బతిని భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి జారుకోవడంతో నెలకొన్న రాజకీయ, ఆర్థిక అస్తవ్యస్తత కారణంగా దేశంలో అనేక ప్రజా ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి. పర్యవసానంగా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతీయ ప్రజా ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చిన ప్రాంతీయ పార్టీల చొరవతో ఏర్పడిన థర్డ్‌ఫ్రంట్ దేశ రాజకీయాల్లో బలమైన మూడవ ప్రత్యామ్నాయంగా అవతరించగలిగింది. అదే 1996లో ఏర్పడిన థర్డ్‌ఫ్రంట్ ప్రజా ఉద్యమాల పునాదిపై కాక, రాజకీయ సమీకరణల ప్రాతిపదికన ఉనికిలోకి రావడంతో నామ మాత్ర అవశేషమైన థర్డ్‌ఫ్రంట్ ప్రత్యామ్నాయం కొద్దిరోజుల్లోనే విచ్ఛిన్నమైంది. ఈ రెండు థర్డ్‌ఫ్రంట్‌ల స్వభావాల్లోని తేడాను గుర్తించాలి. మొదటి థర్డ్ ఫ్రంట్‌కు పునాది ప్రజా ఉద్యమాలైతే, రెండవసారి థర్డ్‌ఫ్రంట్‌కు పునాది ఉనికి కోసం పోరాడుతున్న ప్రాంతీయ రాజకీయ పార్టీలు మాత్రమే. ఈ చారిత్రక అనుభవం రీత్యా కేసీఆర్ పిలుపునిచ్చిన థర్డ్ ఫ్రంట్ ప్రజా ఉద్యమాల పునాదిగా రూపొందిన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఏర్పడితేనే జాతీయ స్థాయి నిజమైన ప్రత్యామ్నాయంగా బీజేపీకి గట్టి పోటీనిస్తుంది. లేకపోతే మిథ్యా ప్రత్యామ్నాయంగా, నామ మాత్రావసిష్టంగా, ధీర గంభీర ప్రకటనల, కాగితాల వరకే పరిమితమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రహసనంగా మారుతుంది. అభివృద్ధి ముఖమల్ గుడ్డ చుట్టిన 'ఏకీకృత హిందూ అస్తిత్వం' అనే ఎజెండాతో సాగుతున్న బీజేపీ దూకుడుకు ఉనికి కోల్పోతున్న ప్రాంతీయ పార్టీలు తప్ప నేడు ప్రజా ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చిన పార్టీలేవీ ఉనికిలో లేని పరిస్థితుల్లో కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్ మూడో రాకడ ఏ మేరకు విజయవంతం కాగలదో వేచి చూడాలి!

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily,
D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor,
Green lands, opp. Green park Hotel,
Hyderabad, 500016, Telangana.

## స్వేచ్ఛారావం



జి. హరగోపాల్

# నేరము- శిక్ష

గుజరాత్ మారణకాండకు కారకులేమో స్వేచ్ఛగా తిరుగుతుంటే ఏ నేరం చేయని సాయిబాబాకు జీవిత ఖైదును ఎలా చూడాలి? చూసే పద్ధతి మారాలి. మన సమాజంలో నేరానికి శిక్షకు సంబంధం లేదు. వందల సంవత్సరాలుగా అమలు లో ఉన్న మను శిక్షాస్మృతే ఇంకా అమలులో ఉంది. భారత రాజ్యాంగంలో చేర్చబడిన చట్టం ముందు అందరు సమానులే అనే సుదూర లక్ష్యాన్ని చేరడానికి సమాజ చైతన్యమే కాక రాజీలేని పోరాటాలు జరగాలి. పోరాటాలే నేరం అంటే సమాజం మరింత చారిత్రక, లౌకిక, తాత్విక పునాదుల్లోకి వెళ్లి ఆలోచించాలి.

మనదేశంలో అన్నిటికంటే అన్యాయమైన భావన మనుషులు పుట్టుకతోనే అసమానులుగా పుడతారని. పుట్టుకతో అసమానులు ఎలా అవుతారు అన్న మౌలిక ప్రశ్నకు ఇంకా మనం సమానం సమాధానం బాకీ పడిఉన్నది. ఈ 'నమ్మకం' తరతరాలుగా పేదవర్గాలను అమాయకమైన దోపిడీకి గురిచేసింది. ఈ సమాజం వివక్షను పాటించడమే కాక వివక్షను వ్యవస్థీకృతం చేసి దానిని చాలా పకడ్బందీగా అమలు పరుస్తూ వస్తున్నది. ఆర్థిక అసమానతలో అన్ని దేశాల్లో ఏదో మేరకున్నవి. అవునూ అవకాశాలను బట్టి క్రింది వర్గాలకు చెందిన వ్యక్తులు ఆర్థిక నిచ్చెన మెట్లెక్కే అవకాశముంటుంది, కానీ సామాజిక సాంస్కృతిక జీవనంలో ఎక్కడానికి నిచ్చెనే లేదు. డా.అంబేద్కర్ మన సామాజిక వ్యవస్థ ముఖ్యంగా కులవ్యవస్థ గురించి విశ్లేషిస్తూ ''ఇది నిచ్చెన లేదా మెట్లు లేని బహుళ అంతస్థుల బంగళాలాంటిది'' అన్నాడు. క్రింది అంతస్థుల వారు పైకి వెళ్లడానికి ఏ అవకాశం లేదు. ఇలా అంతరాలతో, అంతస్థులతో సమాజం వందల సంవత్సరాలుగా తన జీవనయానం కొనసాగిస్తూ ఉంది. పరిణామక్రమంలో ఈ వ్యవస్థను మార్చడానికి చేసిన ఏ ప్రయత్నం కూడా పూర్తిగా సఫలం కాలేదు. బౌద్ధం, హిందూమత సాలెగూడులో నుండి మను షులను బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేసినా బౌద్ధమే సాలెగూడులో చిక్కుకుంది. భక్తి ఉద్యమం సంస్కరణోద్యమంగా ముందు కు వచ్చినా, మతం దాన్ని తనలో కలుపుకుని నిర్వీర్యం చేసింది. తర్వాత చాలామంది సంస్కర్తలు ఉద్యమకారులు ఎంత కృషిచేసినా వ్యవస్థ మూలాలను కదిలించలేకపోయారు. అంతస్థుల అంతరాల వ్యవస్థ నిరాఘాటంగా కొనసాగుతున్నది.

స్వాతంత్రోద్యమ కాలంలో పాశ్చాత్య విప్ల వాలతో ప్రభావితమై, ప్రజాస్వామ్య భావ జాలం కొంచెం దేశంలోకి ప్రవేశించింది. లిఖి త రాజ్యాంగం, చట్టబద్ధ పాలన, స్వేచ్ఛ, లౌకిక విలువలు, సౌభ్రాతృత్వంలాంటి కొన్ని ఉదాత్త విలువల ప్రభావం దేశంలోని చదువు కున్న మధ్యతరగతి మీద కొంత ఉంది. అలాగే సోవియట్ యూనియన్‌లో వచ్చిన విప్లవ ప్రభావం కూడా మన జాతీయో ద్యమంపై ఒకవైపు, విప్లవోద్యమాలపై వైపు గణనీయ మైన ప్రభావం వేసింది. ఈ దేశంలో ఆదివాసీలు తమ అడవిని కాపాడుకోవడానికి చేయని పోరాటం లేదు. అలాగే డాక్టర్ అంబేద్కర్, అంతకుముందు పూలే దంపతుల స్ఫూర్తితో పెరిగిన దళాలు, మహిళా చైతన్యం తక్కువేమీ కాదు. వీటన్నింటి సమాహారంగా భారత రాజ్యాంగం లిఖించబడింది. దేశ చరిత్రలో మొదటిసారి చట్టంముందు అందరూ సమానులే అనే విప్లవాత్మకమైన విలువ ముందుకు వచ్చింది. అవును, రాజ్యాంగానికి, బహుళ అంతస్థుల సమాజానికి మధ్య నిరంతరంగా ఒక ఘర్షణ నెలకొని ఉంది. సమాజంలోని నిజమైన ఆర్థిక, రాజకీయ సమానత్వం లేకుండా చట్టం ముందు అందరు సమానులే అనే విలువ ఎలా నిలుస్తుందని మార్క్స్ ఒక మౌలిక ప్రశ్న తన రాజకీయ ఆర్థిక (Political economy) విశ్లేషణలో భాగంగా ముందుకు తెచ్చాడు. అందుకే మన రాజ్యాంగానికి ఏడు దశాబ్దాల వయసు వచ్చినా, ఏడు దశాబ్దాల తర్వాత చట్టం ముందు అందరూ సమానులే అనే భావన ఎక్కడైనా ఆచరణలో, నిజ జీవితంలో అగుపిస్తున్నదా అనేది పెద్ద సవాలు.

కొన్ని వందల సంవత్సరాల క్రితం 'మను' తాను రూపొందించిన 'ధర్మశాస్త్రం'లో చాలా స్పష్టంగా చట్టం ముందు అందరు సమానులు కారని చాలా బలంగా వాదించాడు. అందరు సమానులే అంటే చట్టప్రకారం ఎవరు నేరం చేసినా శిక్ష దానికి సరిపడేలా ఉండాలి. మను ఈ సూత్రాన్ని పూర్తిగా తిరస్కరించి, నేరము ఒకటే ఐనా శిక్ష భిన్న స్థాయిల్లో ఉంటుంది. ఏ నేరం చేసినా చాతుర్వర్ణ వ్యవస్థలో కింది మూడు వర్గాలకి శిక్ష చాలా తీవ్రంగా, పై వర్గమైన బ్రాహ్మలకు నామమాత్రమైన శిక్ష ఉండాలి అని వ్రాస్తూ, ఏ నేరమైనా కింది వర్గాలకు శిక్ష విధించేప్పుడు భౌతికంగా శరీరంలోని ఏది సున్నితమైన ప్రాంతాల్లో కొట్టాలి అని నిర్ధారిస్తూ, బ్రాహ్మలకు మాత్రం అదే నేరం చేసినా ఎలాంటి భౌతికపర శిక్ష విధించకూడదు అని రాశారు. ఇవ్వాళ మన న్యాయ వ్యవస్థలో ఈ వర్గ, వర్ణ అసమానతలే కొనసాగుతున్నవే తప్ప అందరూ సమానులే అనే భావన ఎక్కడా కనిపించడంలేదు.


Rajesh

ఈ వివక్ష స్పష్టంగా ఏ జైలుకు వెళ్ళినా చూడవచ్చు. దేశవ్యాప్తంగా జైళ్ళల్లో దళితులు, పేదలు, ఆదివాసీలున్నారే తప్ప ఉన్నత వర్గాలు వర్గాల సంఖ్య చాలా తక్కువ. నేరాలు పేదలే చేస్తారా అని అడిగితే శిక్ష నేరం వల్లే కాదు తాము చేయని నేరానికి కూడా చాలామంది శిక్ష అనుభవిస్తున్నారు. ఈ మధ్యే నాగపూర్ జైళ్ళో జి.ఎన్.సాయిబాబాతో ములాఖత్‌కు వెళితే బయట తమ వారిని కలవడానికి నిరీక్షిస్తున్న అందరి ముఖాల్లో పేదరికమూ, వెనుకబాటుతనం కొట్టవచ్చినట్లుగా చూడవచ్చు. ఈ పేదవాళ్ళకు కూడా హక్కులు ఉంటాయని, వాళ్ళు మనుషులేనని వాళ్లెవరు పుట్టుకతో నేరస్తులు కారని, నేరాలు లేని సమాజ నిర్మాణం జరగాలని సంపూర్ణంగా విశ్వసించి పేదల పక్షాన మాట్లాడిన సాయిబాబాకు గడ్చిరోలి న్యాయస్థానం 'జీవిత ఖైదు' విధించింది. సాయిబాబా ప్రఖ్యాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాష బోధిస్తున్న ప్రొఫెసర్, 90 శాతం అగవైకల్యంతో అనారోగ్యంగా ఉన్నావాడు. ఆయన ఏ సాయుధ చర్య చేయలేదు, ఆయుధాన్ని కూడా పట్టకోలేదు. న్యాయమూర్తి దృష్టిలో ఆయనకు అంగవైకల్యం ఉన్నా చురుకైన మేధస్సు (strong mind) ఉన్నాడన్నది నేరమైంది. ఆ మేధస్సుతో తన వ్యక్తిగత ప్రయోజనం కొరకు కాక మొత్తం సమాజాన్ని గురించి ఆలోచించడం, పేదలందరి జీవితాలు మారడానికి వ్యవస్థ మౌలికంగా మారాలని విశ్వసించడమే సాయిబాబా నేరమైంది. నేరము-శిక్ష అన్నవి ఎవ్వరు నిర్ణయిస్తారు, ఏ ప్రమాణాల మీద నిర్వచిస్తారన్నది మౌలికమైన ప్రశ్న. సమాజంలో నేరమెందుకున్నదని ఆ రోజు 'మను' అడగలేదు. ఇవ్వాళ న్యాయస్థానం అడగడం లేదు. న్యాయం శిక్ష వేస్తేనే రాదు, న్యాయ వ్యవస్థ నేర సమాజ లోతులకు కూడా వెళ్ల గలగాలి. అది మా బాధ్యత కాదు అంటే న్యాయమైన సమాజ నిర్మాణం ఎలా జరుగుతుంది? న్యాయం కొరకు పోరాడితే అది నేరమౌతుంది. మరి ఇతర మార్గాలేమిటో..

నేరము-శిక్ష అన్నవి చాలా తాత్విక విషయాలు అని కొట్టిపారేయడానికి వీలులేనిది. అవి మన చుట్టూ సమాజంలో ఎలా అల్లుకొని పోయాయో ఎక్కడో దూరం కాదు హైద్రాబాదు విశ్వవిద్యాలయంలో శిక్షా విధానాన్ని చూస్తే బోధపడుతుంది. ఈ మధ్యే జాతీ య స్థాయిలో అధికార పార్టీకి అనుబంధ సంస్థ అయిన ఎ.బి.వి.పి. విద్యార్థి ఒక ప్రొఫెసర్ పట్ల ఉపయోగించిన అభ్యంతరకర భాష ఏ నాగరిక సమాజం సహించదు. విద్యార్థిని శిక్షించాలని చాలా పెద్ద ఎత్తున ఉద్యమం జరిగి జాతీయ స్థాయి నుంచి ఒత్తిడి రావడంతో విద్యార్థిని ఒక సంవత్సరం విశ్వవిద్యాలయం నుంచి సస్పెండ్ చేసి 30 వేల రూపాయలు ఫైన్ వేశారు. విద్యా ర్థులకు ఇలాంటి శిక్ష వేయవచ్చునా అనే చర్చ చాలా లోతుగా జరగాలి. సమస్య అది కాదు. గతంలో దళిత విద్యార్థులు ఇలాంటి తప్పే చేస్తే ఏళ్ల తరబడి వాళ్ళను సస్పెండ్ చేశారు. పేద వర్గాల నుంచి వచ్చిన మొదటితరం పిల్లలు అని వాదించినా విశ్వవిద్యాలయం శిక్షను తగ్గించడానికి ఏ మాత్రం అంగీకరించలేదు. దానికి భిన్నంగా ఈ విద్యార్థి శిక్షను ఒక ఆరువారాలలో ఎమర్జెన్సీ పాలకమండలి (emergency executive) మీటింగ్ పెట్టి ఒక సంవత్సరం శిక్షను మూడు నెలలకు కుదించి 30 వేల జరిమానాను వెనక్కు తీసు కున్నారు. అధికార పార్టీకి చెందిన విద్యార్థికి తక్కువ శిక్ష, దళితులకు ఎక్కువ శిక్షను సమాజం ఎలా చూడాలి? గుజరాత్ మారణకాండకు కారకు లేమో స్వేచ్ఛగా తిరుగుతుంటే ఏ నేరం చేయని సాయి బాబాకు జీవిత ఖైదును ఎలా చూడాలి? చూసే పద్ధతి మారాలి.

స్పష్టంగా మన సమాజంలో నేరానికి శిక్షకు సంబంధం లేదు. వందల సంవత్సరాలుగా అమలు లో ఉన్న మను శిక్షాస్మృతే ఇంకా అమలులో ఉంది. భారత రాజ్యాంగంలో చేర్చబడిన చట్టం ముందు అందరు సమానులే అనే సుదూర లక్ష్యాన్ని చేరడానికి సమాజ చైతన్యమే కాక రాజీలేని పోరాటాలు జరగాలి. పోరాటాలే నేరం అంటే సమాజం మరింత చారిత్రక, లౌకిక, తాత్విక పునాదుల్లోకి వెళ్లి ఆలోచించాలి.

# పగిడిద్దరాజు జాతర

ఆదివాసీల ప్రతిఘటనకూ సింహస్వప్నం. ఆదివాసీల తిరుబాటుకు తిరుగులేని సాక్ష్యం సమ్మక్క సారక్కలు. మేడారంలో జరిగే సమ్మక్క – సారక్క మహాజాతరకూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని వేపలగడ్డకూ అవినాభావ సంబంధం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన అరెం వంశీయుల పగిడిద్దరాజు మేడారం చేరుకుంటేనే జాతర ప్రారంభమవుతుంది. అందుకు చారిత్రక నేపథ్యం ఉంది. పగిడిద్దరాజును అరెం వంశీయులు పెళ్లికొడుకుగా ముస్తాబు చేస్తారు. అందులో భాగంగానే మార్చి ఏడో తేదీ బుధవారం సాయంత్రం పగిడిద్దరాజును గుట్ట నుంచి తీసుకొని వస్తారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు పగిడిద్దరాజు – సమ్మక్కలకు ఎదిరిల్లు ఇస్తారు. ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహిస్తారు. 8న గురువారం ఉదయం వనదేవతలను గుడికి తీసుకొస్తారు. సాయంత్రం జోగుకు తీసుకొని వస్తారు. ఆరోజు రాత్రి 12 గంటలకు దేవతలను గంగాస్నానానికి తీసుకొని వెళతారు. తెల్లవారు జామున 3 గంటలకు గుడిలో ప్రతిష్ఠిస్తారు. 4 గంటలకు దేవతలకు హారతిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. 10 శనివారం ఉదయం 10 గంటలకు




దేవతలు వనప్రవేశం చేయిస్తారు. అత్యంత వైభవంగా వడ్డెలు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పగిడిద్దరాజును ఒక పోరాటయోధుడిగా స్మరిస్తున్నదే దైవంగా ఆదివాసీలు కొలుస్తారు. వీరత్వంలో నుంచే దైవత్వం పుట్టిందని భావిస్తారు. ఈ పగిడిద్దరాజు జాతరకూ ఆదివాసీలు, ఆదివాసేతరులు వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి అధికసంఖ్యలో హాజరవుతారు.

కోయరాజుగా కోయరాజ్యాలకు ప్రతినిధిగా ఆదివాసీ స్వయంపాలనకు మార్గదర్శిగా ఆదివాసీ చరిత్రలో నిలిచిపోయాడు. అలాంటి కోయరాజు పగిడిద్దరాజును అరెం వంశానికి చెందిన వాడు కావడం వలన వేపలగడ్డ అరెం వంశీయులు ప్రతి సంవత్సరం మాఘపున్నమి మాసంలో పాదయాత్రగా మేడారం వెళ్ళి అక్కడ సమ్మక్క సారలమ్మకు మొక్కులు చెల్లించి అనంతరం గుండాల మండలం వేపలగడ్డలో జాతర నిర్వహిస్తారు. ఆదివాసీ స్వయంపాలన కోసం పోరాడి అమరుడైన పగిడిద్దరాజు స్ఫూర్తితో నేడు ఆదివాసీలు ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేయాలి. కార్పొరేట్ల కీలుబొమ్మ పాలకులు జమిలిగా సాగిస్తున్న అటవి వనరుల దోపిడిని సంస్కృతిపై ఆదివాసీ సమాజం ఇకనైనా ఐక్యంగా తిప్పికొట్టాలి. సంస్కృతి పరిరక్షణకు నడుంకట్టాలి. మూలవాసీ అస్థిత్వాన్ని చాటుకోవాలి. కంకవనం చేజారకుండా పొదివిపట్టుకోవాలి. ఆదివాసీ ఆరాటాలకూ పోరాటాలకూ ప్రజాతంత్ర శక్తులన్నీ బాసటగా నిలవాలి.

◆ వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం అధ్యక్షులు
(ఈనెల 7, 8, 9, 10 తేదీలలో పగడిద్దరాజు జాతర సందర్భంగా)

# నమ్మినవారికి భంగపాటు

మొదట 13 నెలలు అధికారంలో కొనసాగిన వాజపేయి సర్కారు రెండోసారి అధికారంలో పూర్తికాలం కొనసాగింది. ఆ తర్వాత దశాబ్ధం తర్వాత నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీని ఒక విశిష్టమైన పార్టీగా భావించిన దేశ ప్రజలు, దాని నుంచి భిన్నమైన పరిపాలన ఆశించి భంగపడ్డారంటే తప్పు కాదు. సాధారణ ఎన్నికల్లో ఆదర్శవంతమైన ఉపన్యాసాలతో


Rajesh

ఆకట్టుకున్న నరేంద్రమోదీని దేశ ప్రజలు సమర్థ నాయకుడిగా భావించి గెలిపించారు. కానీ అప్పుడలా భావించి భ్రమపడ్డామంటున్న ప్రజల సంఖ్య ఇప్పుడు పెరిగిపోతోంది. నరేంద్రమోదీ వైఫల్య పాలనకు ఇది అద్దం పడుతోంది. ఏ రాజకీయ పార్టీకైనా అధికారంలోకి రావాలనే లక్ష్యం ఉండటం తప్పు కాదు. కాని అది ఏకైక లక్ష్యంగా మారినప్పుడే పాలనలో అసమర్థత, వైఫల్యాలు వరుసగా చోటు చేసుకుంటాయి. దాంతో ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పవు. 2014 సాధారణ ఎన్నికలలో మెజారిటీ సీట్లు సాధించి కేంద్రంలో ఆసీనులైన తర్వాత ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణలు ఫలితాలను ఇవ్వటం లేదు. పెద్దనోట్ల రద్దుతో సామాన్యుల బాధలు ఇప్పటికీ తీరటం లేదు. ఆ చర్యతో బడా పారిశ్రామికవేత్తలు మాత్రం లబ్ధిపొందుతున్నారు. జీఎస్టీ దెబ్బకు సామాన్యులు విలవిల్లాడుతున్నారు. జీఎస్టీ వల్ల సామాన్యులు చెల్లించే పన్నులు తగ్గుతాయని లోక్‌సభలో ప్రధానమంత్రి చెప్పుకొచ్చారు. కానీ వాస్తవం వేరుగా ఉంది. పన్నులు ఎన్నో రెట్లు పెరిగాయి. బ్యాంకుల్లో దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా జీఎస్టీ బాదుతున్నారు. చిన్న మొత్తాల పొదుపు, జీవిత భీమా కిస్తీలపై సేవా పన్ను పేరిట 2.25 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా ఎవరిని ఉద్ధరించడానికి? ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఇందుకేనా?

తాజాగా నీరవ్ మోదీ, విక్రమ్ కొఠారి లాంటి ఘరానా ఆర్థిక మోసగాళ్ళు బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు కుచ్చుటోపీ పెట్టి దేశం విడిచి వెళ్ళిపోతున్నారు. దేశానికి కాపలా కుక్కలా ఉంటానని 2014 సాధారణ ఎన్నికల్లో వాగ్దానం చేసిన నరేంద్ర మోదీ ప్రస్తుతం నోరు మెదపటం లేదు. లలిత్‌మోదీ, నీరవ్ మోదీ, విక్రమ్ కొఠారి లాంటి వైట్ కాలర్ నేరస్థులు బ్యాంకుల్లో పెద్ద ఎత్తున అప్పులు తీసుకొని దర్జాగా ఎగ్గొడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. బ్యాంకులకు 9 వేల కోట్లు టోపీ పెట్టిన కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా ప్రభుత్వంలోని వారి సహాయం లేకుండానే లండన్ చెక్కేశారా? ఇప్పుడు నీరవ్ మోదీ అనే వజ్రాల వ్యాపారి పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.11,400 కోట్లు టోపీపెట్టి కుటుంబ సభ్యులతో విదేశాల్లో మకాంపెట్టడం ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో నరేంద్రమోదీ ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం కాదా? ఇంత జరుగుతున్నా ఈ వ్యవహారాలపై ప్రభుత్వ పెద్దలు నోరు విప్పి మాట్లాడటం లేదు. కార్పొరేట్ సంస్థల పేరిట బ్యాంకుల్లో కోట్ల రూపాయలు అప్పులు ఎలా పుట్టించగలుగుతున్నారు. ప్రభుత్వ పెద్దలకు ఈ విషయాలు తెలియకుండా జరిగిపోవడం ఆశ్చర్యంగా ఉంది. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దేశంలోని బడా పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలుకుతూ పరోక్షంగా వారికి సహకార మందిస్తుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్‌లో వాళ్ళు ఈ ప్రభుత్వానికి ఎన్నికలలో లోపాయి కారీగా సహకారమందిస్తారని ఆశ కావచ్చు. చెరువుకు చినుకాశ, చినుకుకు చెరువాశ అంటే ఇదేనేమో! బీజేపీని నమ్మి ఓటేసిన దేశ ప్రజలకు మంచి గుణపాఠం చెప్తున్నారు. ఇప్పటికే మూడున్న రేండ్లు పూర్తి అయ్యాయి. ఇంకా మిగిలిన ఏడాదిన్నర నరేంద్రమోదీ పాలన ఇంత కన్నా మెరుగ్గా ఉంటుందనే నమ్మకం కూడా ప్రజల్లో లేకుండా పోయింది. ఇకనైనా బీజేపీ నాయకత్వం అధికారం ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా, తమపాలనలో సమర్థత చాటుకునేందుకు కృషి చేయాలి. కాంగ్రెస్ పాలనే నయమనే అభిప్రాయాలు రాకముందే అధికార బీజేపీ మేల్కొవాలి. లేకుంటే ఇటు దేశం బాగుపడదు, అటు జనాదరణ కోల్పోతున్న తమ పార్టీకి కూడా మకిలంటుకుంటుందని గుర్తించాలి.

◆ గూరుడు అశోక్

## 1840

**మొట్టమొదటి మహిళా హక్కుల సమావేశం**

అంతర్జాతీయ మహిళోద్యమ చరిత్రలో అత్యంత కీలక ఘట్టానికి 1848లో అమెరికా, న్యూయార్క్ లోని సెనెకా ఫాల్స్ వద్ద అంకురార్పణ జరిగింది. బానిసత్వ వ్యతిరేక తీర్మానానికి సంబంధించిన ప్రసంగంలో ఉపన్యసించేందుకు మహిళల్ని నిరాకరించారు. దీంతో ఎలిజబెత్ కాడీ స్టాంటన్, ల్యూక్రెషియా మోట్ అనే మహిళా నేతలు న్యూయార్క్‌లో కొన్ని వందల మంది సాక్షిగా మొట్టమొదటి మహిళా హక్కుల సాధన సమావేశాన్ని నిర్వహించారు. ప్రపంచ మహిళోద్యమ చరిత్రకు ఇదే నాంది పలికింది. 'పుట్టుకతో స్త్రీ, పురుషులందరూ సమానులేనన్న సత్యాన్ని మేమిక్కడ స్వానుభవంతో ప్రకటిస్తున్నాం' అన్న వాక్యంతో మొదలైన ఈ సభలో వాళ్ళు మహిళలకు సామాజిక, పౌర, రాజకీయ, మతపరమైన అన్ని హక్కుల కోసం డిమాండ్ చేశారు. మహిళలకు ఓటు హక్కు కోసం వాళ్ళు చేసిన ప్రతిపాదన ఆ రోజు అందరి పరిహాసానికి గురైనప్పటికీ, ఒక ఉద్యమానికి బీజం వేసింది.

## 32,000

న్యూజిలాండ్ పార్లమెంట్‌కు 1873లో మహిళలకు ఓటుహక్కును కల్పించాలంటూ 270 మీటర్ల విజ్ఞాపనా పత్రాన్ని సమర్పించారు. ఆ పత్రం మీద 32,000 మంది సంతకాలు చేశారు. మహిళలకు ఓటు హక్కును కల్పించిన మొట్టమొదటి దేశం స్విట్జర్లాండ్.

# మైలురాళ్లు

## నినాదం

పుట్టిన క్షణమే చరిత్ర పుడుతుంది, చరిత్ర పుట్టిన క్షణంలోనే సమైక్యత పుడుతుంది. సమైక్యత పుట్టిన క్షణంలోనే సంఘటిత పోరాటం పుడుతుంది. సంఘటిత పోరాటం పుట్టిన క్షణాన్నే దృక్పథాల్లో మార్పుకు అంకురార్పణ జరుగుతుంది. మార్పు కన్ను తెరిచిన క్షణాన్నే చరిత్ర కొత్తపుంతలు తొక్కుతుంది. అలా కొత్త పుంతలు తొక్కిన చరిత్ర ఘట్టాల్ని, చట్టాల్ని మారుస్తుంది. చట్టాలు మారినంత మాత్రాన పోరాట ప్రస్థానం ఆగదు... గమ్యానికి దారులు అనంతం, అసంఖ్యాకం. అలాంటి అనేకానేక దారుల వెంట ప్రపంచ మహిళలు, బాలికలు చేసిన ప్రయాణంలోని కొన్ని మైలురాళ్ళని గురించి తెలుసుకుందాం.

## 1911

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్‌ల నుంచి దాదాపు పది లక్షల మంది 1911లో మార్చి 8వ తారీఖున మహిళలకు ఓటు హక్కు, కార్మిక హక్కుల్ని కోరుతూ ప్రదర్శన చేశారు. తదనంతర కాలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మార్చి 8ని జరుపుకోవడం మొదలైంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో మార్చి 8ని యుద్ధ వ్యతిరేకదినంగా జరుపుకున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధాలు సంప్రదాయబద్ధమైన పనులకే కాక, ప్రపంచ మహిళలు పురుషులతో సమానంగా యుద్ధ బాధ్యతల్ని కూడా నిర్వర్తించగలరని నిరూపించాయి.

## 500

**భాషలకు పైగా...**

అంతర్జాతీయ మానవహక్కుల సార్వత్రిక ప్రకటన (1948) ప్రపంచవ్యాప్తంగా 500 పైగా భాషల్లోకి అనూదితమైంది. ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు సంబంధించి స్త్రీ, పురుషులందరూ సమానులేనని మానవచరిత్రలో మొట్టమొదటిసారిగా చాటిన తీర్మానమిది.

## 3.5 నుంచి 5.5 మిలియన్లు

ప్రపంచవ్యాప్తంగా 21, జనవరి, 2017న 3.5 నుంచి 5.5 మిలియన్ల మంది ప్రజలు మహిళల హక్కులకు సంఘీభావాన్ని వ్యక్తం చేస్తూ 'ఉమెన్స్ మార్చ్' చేశారు. దశాబ్దకాలంలో ఇంత భారీ సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలో పాల్గొనడం ఇదే తొలిసారి. భారతదేశంలో నిర్భయ సంఘటనలోను, లాటిన్ అమెరికాలో వరుసగా మహిళల్ని హతమార్చిన సంఘటనలోను, నైజీరియాలో 280 మంది పాఠశాల విద్యార్థినుల్ని అపహరించిన ఘటనలోను కూడా ప్రజలు ఇంతే తీవ్రంగా స్పందించారు.

**ఆడపిల్లలందరికీ**

## విద్య

పాకిస్తాన్‌లో మలాలా యూసఫ్‌జై చదువుకున్న నేరానికి, ఆడపిల్లలందరికీ చదువు అత్యవసరమంటూ వాదించిన నేరానికి భౌతికదాడికి గురైంది. కానీ ఆమె తన పట్టు వీడలేదు. ఈ దిశగా ఆమె 2013లో ఐక్యరాజ్య సమితిని ఉద్దేశించి తొలిసారిగా ప్రసంగించింది.

## 25,000

ఐస్‌ల్యాండ్ రాజధాని రీక్జావిక్‌లో 1975లో ఒక భారీ ప్రజా ప్రదర్శన జరిగింది. దేశ జనాభాలో పదోవంతుగా ఉన్న మహిళలందరూ ఆర్థిక అసమానత్వానికి వ్యతిరేకంగా ఈ ప్రదర్శనను నిర్వహించారు. మహిళలు ఇలా వీధుల్లోకి వచ్చి, గుమికూడి సమ్మె చేయడంతో నగరంలో ప్రజాజీవితం స్తంభించి పోయింది.

## సెడా

మహిళల హక్కుల బిల్లుగా పిలుచుకునే మహిళల మీద అన్నిరకాల వివక్షను నిరోధించడానికి ఉద్దేశించిన 'సెడా' బిల్లు 1979లో ఆమోదం పొందింది. ఇది మహిళల హక్కులన్నీ మానవహక్కులేనని ఉద్ఘాటించింది.

## 9.8 శాతం

ఓటు హక్కు పొంది వందేళ్ళు గడిచినప్పటికీ, దశాబ్దాల తరబడి ఉద్యమాల్ని నడిపినప్పటికీ, 1980ల నాటికి గానీ అత్యధిక దేశాల్లో మహిళలు తమ ఓటు హక్కును పూర్తిగా వినియోగించుకునే దశ రాలేదు. అయితే ఇప్పటికీ పాలనా వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం ఇంకా ఆశించినంతగా లేదు. 1955 నాటికి పాలనా వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం శూన్యం, 2018 నాటికి ఇది 9.8 శాతానికి మాత్రమే పెరిగింది.

## ఇవాళ

ఇవాళ ప్రపంచంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు తమ జీవితకాలంలో ఏదో ఒక దశలో హింసకు గురవుతూనే ఉన్నారు. భూమ్మీద గర్భధారణ, ప్రసవ సమయాల్లో ప్రతిరోజూ 830 మంది మహిళలు కన్నుమూస్తున్నారు. సరైన చర్యలు తీసుకుంటే ఈ మరణాల్ని ఆపగలిగి ఉండవచ్చు. కానీ అలా జరగడం లేదు. ప్రపంచంలో ప్రతి నలుగురు ప్రజాప్రతినిధుల్లో ఒక్కరు మాత్రమే మహిళ. వేతనాల చెల్లింపుల్లో లైంగిక వివక్షను తుదముట్టించాలంటే మనం 2086 వరకు వేచి చూడాల్సిందే!

# వివక్షనెరిగి వాత!

మనం సాధారణంగా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో జోకులు, కార్టూన్లు చూస్తుంటాం. వాటిలో చాలా మటుకు మహిళల్ని కించపరిచేవే ఉంటాయి. ఆడవాళ్ళ స్వభావం ముఖ్యంగా 'భార్య' అనే పదం చుట్టూ ఉచితానుచితాలు మరచి దిగజారుడు వ్యాఖ్యలలో కూడిన పరిహాసం కనబడుతుంది. అది హాస్యం కాదు, వ్యక్తులుగా మన సంస్కారాన్ని మనమే గిరాటేసి, మనల్ని మనమే అపహాస్యం చేసుకుంటుంటాం. అంతెందుకు తెలుగునాట పేరెన్నికగన్న కార్టూనిస్టులు సైతం స్త్రీల పట్ల ఎలాంటి చులకన భావాన్ని కలిగి ఉన్నారో చెప్పడానికి 'అప్పడాల కర్ర' కార్టూన్లే సాక్ష్యం. మనసారా నవ్వుకోవడానికి ఉపయోగపడాల్సిన వ్యంగ్య చిత్రాలు అవహేళన చేయడానికి మాత్రమే ఉపయోగపడడం విషాదకరం. అయితే కార్టూన్ కళ కేవలం నవ్వడానికో, అవహేళన చేయడానికో మాత్రమే కాదు, అది వ్యవస్థను 'నిలదీయడానికి' కూడా ఉపయోగపడాలని కొందరు విజ్ఞులు భావించారు. ప్రపంచవ్యాప్తంగా అలాంటి విజ్ఞత కలిగిన కార్టూనిస్టులు తమ వ్యంగ్యచిత్రాలతో లైంగిక వివక్ష మీద కుంచెను దూశారు. ఐక్యరాజ్యసమితి, 'కార్టూనింగ్ ఫర్ పీస్' అనే మరో స్వచ్ఛంద సంస్థతో కలిసి ఈ దిశగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. కార్టూనింగ్ ఫర్ పీస్‌లో 59 దేశాలకు చెందిన 162 మంది కార్టూనిస్టులు ఈ ఏడాది మహిళా దినోత్సవ సందర్భంగా మహిళల సమస్యల మీద కార్టూన్లను చిత్రించారు. ఈ కార్టూన్లన్నింటినీ కలిపి 'మేక్ ప్లేస్ ఫర్ ఉమెన్' అనే పుస్తకరూపంలో ప్రచురించారు. ఒక మహిళ తన జీవితంలో విద్య, లైంగికత, పని, మతం వంటి అంశాల్లో ఎలాంటి వివక్షను ఎదుర్కొంటోందో ఈ కార్టూన్లు కళ్ళకు కట్టాయి. ఆ పుస్తకం నుంచి కొన్ని కార్టూన్లు మీకోసం.



ఇరానియన్ కార్టూనిస్టు ఫిరూజె మొజఫ్ఫారి పలు పత్రికలకు కార్టూనిస్టుగా వ్యవహరిస్తున్నారు. ఈమె కార్టూనింగ్ ఫర్ పీస్ మొట్టమొదటి అంతర్జాతీయ అవార్డును 2012లో అందుకున్నారు.



ఇటాలియన్ కార్టూనిస్టు మరిలీనా నర్డి దాదాపు యాభైకి పైగా అంతర్జాతీయ అవార్డులను పొందారు.



వెనిజులాకు చెందిన రైమా సుప్రర్థి పందొమ్మిదేళ్ళుగా పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పత్రికలకు కార్టూనిస్టుగా పని చేశారు.

## రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## పక్షపాతం కూడదు!

**చిత్ర, ప్రఖ్యాత ఆర్టిస్టు, 'మనం' ఎడిటోరియల్ కార్టూనిస్టు**



**ముద్ర:** 'అప్పడాల కర్ర' లేదా 'గంటల కొద్దీ షాపింగ్' అంటూ మహిళల్ని కించపరుస్తూ చిత్రించిన కార్టూన్లని మనం పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో చాలానే చూశాం, చూస్తున్నాం. దీనిపై ఒక కార్టూనిస్టుగా మీ అభిప్రాయం ఏమిటి?

**చిత్ర:** నిజమే, మహిళల్ని కించపరుస్తూ బాపూగారి దగ్గర్నుంచీ ఎందరో కార్టూన్లని చిత్రించడమన్నది మనకు తెలిసిందే! అయితే నిజమేమిటంటే, ఇలాంటివన్నీ సహజత్వానికి దూరమైన పోకడలే! లింగ వివక్ష పట్ల అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయి. కార్టూన్ ద్వారా నవ్వించడం మాత్రమే ప్రధానం కాదు. అది సహజత్వానికి దగ్గరగా ఉండాలి. మహిళల్ని కించపరుస్తూ పురుష పక్షపాతంతో కార్టూన్లు వేయకూడదు. కార్టూనిస్టులు ఈ విషయంలో మరింత సున్నితంగా వ్యవహరించాలి. లింగ వివక్ష అన్నది కార్టూన్ ప్రక్రియ నుంచి తొలగి పోవాలి.

# పసితనానికి పలుపుతాడు

భారతదేశంలో 2017 నాటికి 18 శాతం మంది బాలికలకు పదిహేనేళ్ళ వయసులోనే వివాహాలు జరిగి పోయాయి. మరో 47 శాతం మంది బాలికలకు 18 ఏళ్ళు నిండకుండానే పెళ్ళిళ్ళు చేసేశారు. బాల్యవివాహాల్లో ప్రపంచంలోనే భారతదేశం పదవ స్థానంలో ఉంది. దేశంలో బీహార్ రాష్ట్రంలో 69 శాతం, రాజస్థాన్‌లో 65 శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయి. తెలంగాణలో బాల్యవివాహాల సమస్య తీవ్రత పెరుగుతున్నట్టు ఎంవి ఫౌండేషన్ ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో ఎంవి ఫౌండేషన్ బాల్యవివాహాలు చేసుకున్న, బాల్య వివాహాల బారి నుంచి తప్పించుకున్న బాలికలతో మాట్లాడింది. వీరిలో 89 శాతం మంది తమ భర్తలు నిత్యం తాగి తమ మీద అఘాయిత్యాలు చేస్తుంటారని తెలిపారు. విచిత్రం ఏమిటంటే వీరిలో 70 శాతం మంది బాలికలకు బాల్యవివాహం చట్టప్రకారం నేరం అనే విషయం తెలుసు. అయితే కుటుంబాల ఒత్తిడికి వీరంతా తలొగ్గారు. మహబూబ్ నగర్ జిల్లాలో 26.2 శాతం మంది బాలికలు, రంగారెడ్డి జిల్లాలో 21.1 శాతం బాలికలు, నల్లగొండలో 21.5 శాతం మంది, ఖమ్మం, మెదక్‌లలో 21 శాతం మంది బాలికలు బాల్యవివాహాలకు బలైనట్టు ఎంవి ఫౌండేషన్ నివేదిక చెబుతోంది. అయితే బాల్య వివాహం అన్నది కేవలం భారతదేశానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. ఈ సమస్య మరికొన్ని ప్రపంచదేశాల్లో కూడా ఆడపిల్లల జీవితంతో చెలగాటమాడుతూనే ఉంది. బాల్య వివాహాలు ఆడపిల్లల జీవితంపై చాలా ప్రతికూల ప్రభావాన్ని కలిగి ఉంటాయి. అవి వారి ఆరోగ్యం, విద్య, వైవాహిక హక్కుల్ని సైతం హరించి వేస్తాయి. ప్రపంచంలో ఏటా 15,000,000 మంది బాలికలకు18 ఏళ్ళు నిండకుండానే వివాహాలు జరిగిపోతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రతి ముగ్గురిలో ఒక బాలిక 18 ఏళ్ళ కన్నా ముందే వైవాహిక జీవితంలోకి అడుగు పెడుతోంది. ప్రతి తొమ్మిది మందిలో ఒక బాలిక 15 ఏళ్ళు నిండకుండానే పెళ్లి ఉచ్చులో చిక్కుకుంటోంది.



## చదువు తప్పనిసరి

**- దేవి, సామాజిక కార్యకర్త**



**ముద్ర:** తెలంగాణలో కూడా ఈ సమస్య తీవ్రంగానే ఉన్నట్టు ఇటీవలి ఎంవి ఫౌండేషన్ వారి అధ్యయనంలో వెల్లడైంది. బాల్య వివాహాల నిరోధానికి ఎలాంటి చర్యలు చేపట్టాల్సి ఉందని మీరు భావిస్తున్నారు?

**దేవి:** ముందుగా ఆడపిల్లలకు కెజి నుంచి పిజి దాకా విద్యావకాశాల్ని అందించాలి. వాళ్ళు కచ్చితంగా పాఠశాలల్లో ఉండేలా చూడాలి. ఆడపిల్లలందర్నీ గుర్తించి, వాళ్ళందరూ కచ్చితంగా గ్రాడ్యుయేషన్ కానీ, లేదా కనీసం ఇంటర్ విద్యనైనా తప్పనిసరిగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. ఆడపిల్లలు పాఠశాలకు హాజరైనందుకు వారి తల్లిదండ్రులకు ఎంతో కొంత మొత్తం వేతనంలాగా అందివ్వాలి. ఇందుకోసం ప్రభుత్వం అదనంగా పెట్టుబడి పెట్టాలి. వరకట్న సమస్యల మీద గట్టి వేటు వేయాలి. అంతేగాక బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కలిగేలా ప్రచారాన్ని చేపట్టాలి. బాల్యవివాహాలకు పాల్పడితే కఠినమైన శిక్షలుంటాయని ప్రజలకు తెలియజెప్పాలి. ఇంటర్ లేదా పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన బాలికలకు ఉద్యోగావకాశాల్ని కల్పించాలి.

# గులాబీ గ్యాంగ్

భారతదేశంలోని ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో2006లో మేదర వర్గానికి చెందిన కొంతమంది మహిళలు గృహహింసకు వ్యతిరేకంగా ఉద్యమించారు. గ్రామంలో పొరుగు వ్యక్తి భార్యను హింసించిన ఘటనను వ్యతిరేకిస్తూ మహిళలు ప్రారంభించిన ఈ ఉద్యమం అనతికాలంలోనే రాష్ట్రమంతటా వ్యాపించింది. భార్యను హింసించిన భర్త తన నేరాన్ని అంగీకరించేలా చేసిన ఆ మహిళల కూటమి 'గులాబీ గ్యాంగ్' పేరిట ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. వేలాది మంది మహిళలు గులాబీ రంగు బట్టలు ధరించి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

# వ్యథాభరితం

భారతీయ మహిళల స్థితిగతుల్ని 1974లో వెలువడిన జాతీయ నివేదిక మొదటిసారిగా ప్రస్తావించింది. భారతీయ గ్రామీణ వ్యవసాయరంగమే దేశంలో అతిపెద్ద ఉపాధి రంగం అని ఆ నివేదిక అప్పట్లోనే కుండబద్ధలు కొట్టి మరీ చెప్పింది. గ్రామాల్లో పురుషులు వ్యవసాయ కార్మికులుగా, రైతులుగా ఉన్నప్పటికీ, వ్యవసాయ రంగంలో శ్రమాధిక్యత మాత్రం మహిళలదే! అయితే అప్పటి సామాజిక పరిస్థితులను బట్టి ఒక మహిళ పిల్లల్ని కనడం ఎంత సహజమో, కుటుంబం కోసం పొలంలో వంచిన నడుం ఎత్తకుండా పని చేయడం కూడా అంతే సహజం. నాటి మహిళల ఈ పరిస్థితికి ఆ నివేదిక అద్దం పట్టింది. కానీ రెండు దశాబ్దాల తరువాత 'శ్రమశక్తి' (భారతదేశంలో అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళల గురించిన మొట్టమొదటి నివేదిక) కూడా ఇదే నిజాన్ని మళ్ళీ ఎలుగెత్తి చాటింది. అంటే ఇరవయ్యేళ్ళ తరువాత కూడా ఎలాంటి మార్పు లేదన్నమాట. వ్యవసాయ రంగంలో 1989 నాటికి కూడా మహిళలే అటు రైతులుగాను, ఇటు వ్యవసాయ కార్మికులుగాను పెద్ద సంఖ్యలో పని చేస్తున్నట్టు అధ్యయనాల్లో వెల్లడైంది. విషాదం ఏమిటంటే వ్యవసాయ రంగంలో పెద్దసంఖ్యలో పని చేస్తున్న మహిళల్ని 'కార్మికులు'గా గుర్తించడం లేదు. అయితే 21 వ శతాబ్దానికి వస్తే, తాజా జనాభా అంచనాల ప్రకారం వ్యవసాయరంగంలో ప్రాథమికంగా మహిళా కార్మికులు 32.8 శాతంగాను, పురుష కార్మికులు 81.1 శాతంగాను కనబడుతోంది. ఏ అంచనాలు ఎలా ఉన్నప్పటికీ కాదనలేని సత్యం ఏమిటంటే, భారతీయ వ్యవసాయరంగంలో 80 నుంచి వంద మిలియన్ల మంది మహిళలు రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. వీరి శ్రమ లేనిదే వ్యవసాయమే లేదు. అయినప్పటికీ ఈ శ్రమకు ఏ అధ్యయనాల్లోను, అంచనాల్లోను తగిన స్థానం లభించడం లేదు. భూమిని చదును చేయడం దగ్గర్నుంచీ, విత్తనాల్ని పరిరక్షించడం, కలుపు తీయడం, ఎరువుల్ని తయారు చేయడం, చల్లడం, పంటల్ని పండించడం, పంటనూర్పిళ్ళు వంటి అన్ని పనుల్లోనూ భారతీయ వ్యవసాయంలో మహిళలదే ప్రధాన పాత్ర. అయినప్పటికీ పురుషాధిక్య విలువల ధాటికి మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం దుర్లభంగా మారిపోయింది. ప్రపంచంలో వ్యవసాయ కార్మికుల్లో 43 శాతం మంది మహిళలే!

## కనిపించని శ్రమ

**- కె.సజయ, సామాజిక విశ్లేషకులు, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్**



**ముద్ర:** మహిళలకు పిల్లల్ని కనడం ఎంత సహజ బాధ్యతో, వ్యవసాయం కూడా అంతే సహజ బాధ్యతగా పరిగణిస్తున్న పురుషాధిక్య సమాజంలో మహిళా వ్యవసాయ కార్మికుల స్థితిగతులు ఎలా ఉన్నాయి?

**కె.సజయ:** తమ పేరు మీద పట్టాలు ఉన్నప్పటికీ మహిళల్ని రైతులుగా కాకుండా వ్యవసాయ కార్మికులుగానే గుర్తిస్తుంటారు. వ్యవసాయంలో మహిళలు చేసే పని అప్రధానమైందిగా భావిస్తారు. పొలాల్లో మహిళా కార్మికులు కంప, విత్తనాలు ఏరడం వంటివి కూలికి సంబంధించిన పనిగా భావించరు. ఇంట్లో అంట్లుతోమడం లాగానే ఈ పనులు కూడా ఇంటి ఆడవాళ్ళు చేసి తీరాల్సిన బాధ్యతలుగా ఉంటాయి. ఇది భావజాల పరమైంది. పొలం బాగు చేయడం, సాగుకు అనువుగా దాన్ని తీర్చిదిద్దడం వంటి కీలకమైన పని 'కనిపించని శ్రమ'గానే ఉండిపోతోంది. కోతలు, నూర్పిళ్ళు వంటి అనేకానేక పనులన్నీ వ్యవసాయంలో ఆడవాళ్ళే చేస్తారు. అయినా వాళ్ళని రైతులుగా గుర్తించరు. వ్యవసాయంలో ఎక్కువ శాతం పనిని స్త్రీలే చేస్తారు. భారతదేశంలో 63 శాతం మంది మహిళా కార్మికులున్నట్టు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ 63 శాతంలో కూడా 74 శాతం గ్రామీణ వ్యవసాయ కార్మికులే ఉన్నారు.

**- ఇంటర్వ్యూలు: పసుపులేటి గీత**

# హోదా నై కటీఫ్‌కు సై!

## కుండ బద్దలుకొట్టిన కేంద్రప్రభుత్వం

- సెంటిమెంటు చూసి హోదా ఇవ్వలేం
- పారిశ్రామిక రాయితీలూ కుదరవు
- ప్యాకేజిలో చెప్పినవి మాత్రమే ఇస్తాం
- రూ. 12,500 కోట్లిచ్చాం.. లెక్కేది?
- ఏపీ బృందానికి జైట్లీ స్పష్టీకరణ




న్యూఢిల్లీ, మార్చి 6:

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రసక్తే లేదని కేంద్రం కుండ బద్దలుకొట్టింది. ఎంతమంది ఎన్ని పోరాటాలు చేసినా.. ఎన్ని రకాలుగా నిరసనలు వ్యక్తం చేసినా.. తాము గతంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి మాత్రమే అమలుచేస్తామని చెప్పేసింది. సెంటిమెంటు ఆధారంగా హోదా ఇవ్వలేమని.. ఎవరెన్ని పోరాటాలు చేసి నా, ఉద్యమించినా కుదరదని స్పష్టం చేసింది. పరిశ్రమలకు రాయితీలు ఇవ్వడం కూడా ఇప్పట్లో కుదరదని తేల్చేసింది. రాష్ట్రానికి చెందిన ప్రతినిధి బృందంతో సోమవారం రాత్రి సమావేశమైన తర్వాత.. అప్పుడే దాదాపుగా హోదా ఉండబోదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పేశారు. అసలు హోదా మాటెత్తితే కనీసం వినడానికి కూడా ఆయన ఇష్టపడలేదని విశ్వసనీయ సమాచారం. ఎంతసేపటికీ లెక్కలు అడగడం, హోదాతో సమానమైన ప్యాకేజి ఇస్తామన్నాం కదా.. ఇస్తాంలే అని చెప్పడం తప్ప అసలు ప్రత్యేక హోదా ప్రస్తావని కూడా రానివ్వలేదు. హోదా గురించి ఆశలు పెట్టుకోవాల్సిన అవసరం లేద ని ఏపీ ప్రతినిధి బృందంతో జైట్లీ అన్నారు. ప్రత్యేక సాయం కింద వచ్చేది ఏముంటుందో అంతా ఇస్తామ ని, రెవెన్యూ లోటు తీరుస్తామని చెప్పారు. అదే సమ యంలో పరిశ్రమల రాయితీలకు మాత్రం కుదరద న్నారు. ఈశాన్య రాష్ట్రాలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు వాణిజ్యశాఖ సిద్ధంచేసిన సర్క్యులర్ కేబినెట్ సెక్రటేరియట్‌కు వెళ్లిందని, అందులో తమ రాష్ట్రం పేరు కూడా చేర్చాలని యనమల కోరారు. అందుకు జైట్లీ స్పందిస్తూ తాను సురేష్ ప్రభుతో మాట్లాడి దీనిపై ఒక స్పష్టత ఇస్తానని చెప్పారు. మంగళవారం ఉదయం ఏదో ఒక సమా చారం పంపుతామని చెప్పి.. సాయంత్రం దాటినా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దాంతో కేవలం తప్పించుకోడానికి మాత్రమే అప్పటికప్పుడు ఆయ నలా అన్నారు తప్ప హోదా విషయంలో నిర్ణయం తీసుకునే ఆలోచనే లేదన్న విషయం తేలిపోయింది.

### ఏ ప్యాకేజి ఇచ్చినా..

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలోని ఏపీ ప్రతినిధి బృందం సోమవారం రాత్రి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని కలిసింది. ఈశాన్య రాష్ట్రాలు, హిమా లయ రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్‌లకు ఇచ్చిన మూడు ప్యాకేజీలలో దేంట్లో ఏపీని చేర్చినా పర్వాలేదని బృంద సభ్యులు జైట్లీకి తెలిపారు. దాంతోపాటు పన్ను రాయితీలు కూడా కల్పించాలని కోరారు. కానీ, ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన రాయితీలను ఏపీకి ఇవ్వటం కుదరదని కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు స్పష్టం చేశాయి. ఏపీ కంటే వెనుకబడిన రాష్ట్రాలు చాలా ఉన్నాయని, రాయితీలు ఇస్తే ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాలు కూడా డిమాండ్ చేస్తాయని కేంద్రం తెలిపింది. దీనిపై వాణిజ్యశాఖ మంత్రి సురేశ్ ప్రభుతో చర్చిస్తామని, మంగళవారం ఉదయం చెబుతామని అన్నారు. కానీ మంగళవారం రాష్ట్రానికి ఎలాంటి సమాచారం రాలేదు. సెంటిమెంటు పేరుతో హోదా కావాలంటూ ఎన్ని ఉద్యమాలు చే సినా ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కానే కాదని కేంద్రం తేల్చిచెప్పేసింది. ఇప్పుడు తెలుగు సెంటి మెంటు అంటున్నారని.. రేపు ఇలాగే తమిళ, మలయాళ సెంటిమెంట్లు కూడా వస్తాయని ఢిల్లీ వర్గాలు వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఇక.. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు తాము రూ. 12,500 కోట్లు ఇచ్చామని, వాటిలో ఒక్క రూపాయికి కూడా లెక్క చెప్పలేదని కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు మండిపడినట్లు తెలిసింది. కానీ ఈ వాదనను ఏపీ బృందం తిప్పికొ డుతోంది. వాళ్లిచ్చిన లెక్కలన్నీ తాము ఇచ్చామని.. రె వెన్యూలోటు, పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభి వృద్ధి నిధులు అన్నీ చూపించామని బృంద సభ్యులు అన్నారు. రెవెన్యూ లోటుకు లెక్కలు ఏముంటాయని ప్రశ్నించారు. కేంద్ర అధికారులు అవాస్తవాలు చెబుతు న్నారని, కేంద్రం నుంచి మీరు ఎందుకు నిధులు వాడ లేదంటూ ఒక్కటంటే ఒక్క లేఖ కూడా రాలేదని చెప్పారు. రాజధాని నిర్మాణానికి పెట్టిన ఖర్చు అంతా లెక్కలు ఇచ్చామని తెలిపారు. యూసీజి వివరాలు సమర్పించకపోవడం అన్నది లేనే లేదని, అలా వివరా లివ్వడంలో ఏపీ దేశంలోనే టాప్ 3 లో ఉందని స్పష్టం చేశారు. ఈ వివరాలు సీఎం డాష్‌బోర్డులో కూడా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక హోదా గురించి పోరాటం ఉధృతం అవుతుండటంతో.. చంద్రబాబును ఢిల్లీ రావాలని ఆహ్వానించిన బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా ఈ చర్చలకు రానేలేదు. ఆయన స్థానంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, మరికొందరు ఆర్థిక శాఖ అధికారులు మాత్రమే పాల్గొన్నారు.

## తెగదెంపులకు ఏపీ టీడీపీ నేతలు రెడీ



### కొంత ఆగుదామన్న చంద్రబాబు

### బీజేపీ మనల్ని మోసం చేసింది

### పోలవరం కడతామని అననే లేదు

### నీతిఆయోగ్ చెబితేనే తీసుకున్నాం

- అభివృద్ధి.. హోదా పోరు.. రెండు కళ్లు
- ఢిల్లీతో ఫైట్ చేయాలనే నాకూ ఉంది
- ఏదైనా స్పష్టత వచ్చిన తర్వాతే నిర్ణయం
- టీడీఎల్పీ భేటీలో నేతలతో చంద్రబాబు

అమరావతి, మార్చి 6 (మనం ప్రతినిధి):

బీజేపీతో తెగదెంపులు చేసుకోడానికి టీడీపీ నేతలు సై అంటు న్నారు. అధినేత కాస్త ఆగుదామని చెబుతున్నా.. కటీఫ్ చేసుకోవడమే మేలని చెబుతున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని ఇతర హామీల అమలు విషయంలో మిగతా 5లో..

ఏపీని బీజేపీ మోసం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరో పించారు. ''ఆ రోజు కాంగ్రె స్ పార్టీ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించింది. విభజన చట్టంలో అనేక లోపాలున్నాయి. కనీ సం బీజేపీ అయినా న్యాయం చేస్తుందని నమ్మి పొత్తుపెట్టుకున్నాం. కానీ మోసపోయాం. నాలు గేళ్ల తర్వాత ఇప్పుడు కేంద్రం ఇవ్వాల్సిన వాటిపై పోరాటం చేసే పరిస్థితి వచ్చింది'' అని ఆ యన అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జె ట్ సమావేశాల నేపథ్యంలో, చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం టీడీపీ శాసనసభా పక్ష (టీడీఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులంతా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని అ నేక అంశాలపై నేతలకు చంద్రబాబు క్లారిటీ ఇ చ్చారు. ''అసలు పోలవరం కడతామని మేము అనలేదు. జాతీయ ప్రాజెక్టు కాబట్టి దాన్ని కేంద్రమే కట్టాలి. కానీ.. ఢిల్లీ నుంచి పనుల నిర్వహణ సాధ్యం కాదు. అందునా ఆంధ్రప్రదేశ్ కు పోల వరం జీవనాడి కాబట్టి... రాష్ట్ర ప్రభు త్వమైతేనే ప్రత్యేక శ్రద్ధతో నిర్మించగలదని నీతి ఆయోగ్ చెప్పింది. అందుకే నిర్మాణ బాధ్యతల ను రాష్ట్రం తీసుకుంది'' అని చెప్పారు. పోలవరా నికి ఖర్చు చేసిన రూ. 3,200 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రా నికి కేటాయింపులు లేకపోవడం వల్లే కేంద్రాన్ని నిలదీశామని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే కేంద్రంపై పోరాడుతున్నామని స్పష్టం చేశారు.

### అభివృద్ధి, హోదా రెండు కళ్లు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం పోరాడుతూనే, మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ''ఢిల్లీ నుంచి కేంద్రంపై ఫైట్ చేయాలని కొంతమంది సూచిస్తున్నారు. ముందు పరి స్థితిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజలకు అన్ని అంశాల పట్ల స్పష్ట త కల్పించాలి. అలా కాకుండా ముందుకు పో తే.. రాష్ట్రానికి లేనిపోని సమస్యలు వస్తాయి. అదే సమయంలో ప్రజల మనోభావాలను కాపా డుకోవాలి. మరోవైపు రాష్ట్రంలో శాంతి భ ద్రతలను కాపాడుకుంటూ, అభివృద్ధి దిశలో ప యనించాలి''అని చంద్రబాబు స్పష్టం చేశారు.

### సభ్యుల హాజరు తప్పనిసరి...

పార్టీ ఎమ్మెల్యేలంతా తప్పనిసరిగా అసెంబ్లీ సమావేశాలకు రావా లని చంద్రబాబు స్పష్టం చేశారు. సభలో చర్చ జరిగేటప్పుడు సభలో కూర్చొకుండా లాబీల్లో తిరగొద్దని, ప్రతి ఒక్క అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక హోదా అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. సోమవారం ఢిల్లీ సమావేశ వివరాలను టీడీపీ ఎమ్మెల్యేలకు సీఎం వివరించారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో, మన వాళ్లు కూర్చుని విభజన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారని... అయినా కేంద్రం నుంచి ఎలాంటి సానుకూలత రాలేదన్నారు. నాడు ప్రధానమంత్రి రాజ్యసభలో ఇచ్చిన హామీలను నిలెట్టుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. ఏపీ ప్రయోజనాల విషయంలో కేంద్రంతో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో బాధ్యతలేని ప్రతిపక్షాన్ని తాను ఎప్పుడూ చూడలేదని వైసీపీపై చంద్ర బాబు ధ్వజమెత్తారు ''యుద్ధం లేదు కదాని సైన్యం నిధులు ఇమ్మని అడుగుతారా? అని కేంద్రం అనడం కరెక్ట్ కాదు. రాష్ట్రాన్ని ఆదుకోవడానికి, యుద్ధానికి సంబంధం ఉందా..? అసలా పోలికేమిటి..? అప్పుడు కూడా కాంగ్రెస్ ఇలాగే వార్ రూమ్ సమావే శాలు పెట్టి, యుద్ధవిమానంలో బిల్లు పంపితే ఏమైంది? ప్రజల మనసుల ఉన్నదీ, మీ మనసులో ఉన్నదీ నాకు తెలుసు. మన హక్కులు కాపాడుకోవడంలో రాజీలేదు. నాకు ఎవరి మీద ద్వేషం లేదు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందాం. కష్టం వచ్చినా, నష్టం వచ్చినా భరిద్దాం. వ్యక్తిగత దూషణలు వద్దు. మన పోరాటం హుందాగా ఉండాలి'' అని చంద్రబాబు నేతలకు హితవు పలి కారు. కేంద్రం కూడా ఐదు కోట్ల మందిని వ్యతిరేకగా తెచ్చుకోవడం మంచిది కాదన్నారు. ''పంజాబ్ ఫలితాల నూ బీజేపీ గుర్తుంచుకోవాలి. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఓర్పు పట్టాం. నా జీవి తంలో ఎప్పుడూ,ఎవరికీ భయపడలేదు. ఎవరు రెచ్చగొట్టినా రెచ్చిపోవ ద్దు'' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## విమానం కూలి 32 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

కారణమని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపినట్లు రష్యా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఈ విమానంలో 26 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ఈ విమానం పై ఎలాంటి దాడి జరగలేదని, స్థావరంలో దిగుతుండగా నేలకు 500 మీటర్ల ఎత్తున ఉన్న సమయంలో సాంకేతిక లోపం ఏర్పడటంతో ప్రమాదం సంభవించిందని తెలిపింది. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణకు అధ్యక్షుడు పుతిన్ ఆదేశించగా ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పా టు చేసింది. కాగా, సిరియా అంతర్యుద్ధం నేపథ్యంలో ప్రభుత్వ దళాలకు మద్దతుగా రష్యా 2015 సెప్టెంబరులో యుద్ధ విమా నాలను రంగంలోకి దింపింది. రష్యా జోక్యం తో ఏడేళ్లుగా సాగుతున్న అంతర్గత ఘర్షణల్లో ప్రభుత్వ దళాలు పైచేయి సాధించాయి. ప్రస్తుత విమాన దుర్ఘటనకు ముందు రష్యా ప్రకటించిన సైనిక నష్టం సంఖ్య 45 కాగా, 2016 డిసెంబరులో సైనిక వాద్యబృందాన్ని తీసుకెళ్తున్న విమానం నల్ల సముద్రంలో కూలిపోయింది. ఈ సంఘటనలో అందులో ప్రయా ణిస్తున్న మొత్తం 92 మందీ ప్రాణాలు కోల్పోయారు. ఇక గతనెలలో తూర్పు సిరియా ప్రాంతంలో ఐదుగురు పౌరులు మరణించారు. అయితే, వీరంతా తమ సైన్యంతో అధికారికంగా సంబంధం లేనివారేనని రష్యా ప్రకటించింది. మరోవైపు సిరియా నుంచి తమ సైనిక సిబ్బందిలో గణనీయ శాతాన్ని ఉపసంహరించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పటికే ఆదేశాలిచ్చారు. అక్కడ తమ లక్ష్యం దాదాపు నెరవేరినట్టేనని, అందువల్ల సైనికుల సంఖ్యను వీలైనంతగా తగ్గించేందుకు నిర్ణయించామని ఆయన ప్రకటించారు.

## పట్టపగలే భారీ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

జరిపి.. 5 కిలోల బంగారు ఆభరణాలు ఎతు క్కెళ్లారు. నింపాదిగా తమ పనిపూర్తిచేసుకెళ్లడం చూస్తుంటే ఇది పాతనేరస్థుల పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే వారు అక్కడికి చేరుకుని దుకాణాన్ని పరిశీలించారు. వివరాలు.. పాతబస్తీలోని సిటీ ఆర్మ్‌డ్ రిజ ర్వుడు హెడ్ క్వార్టర్స్ కార్యాలయం వెనుక కొంతమంది నగల వ్యాపారులు చిన్నచిన్న కార్ఖానాలు పెట్టుకుని బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటారు. రోజూలాగే మంగళవారం ఓ నగల తయారీ కేంద్రంలో కార్మికులు పనిచేసుకుంటున్నారు. ఇంతలో కొన్ని బైకులు, ఓ కారు ఆ ప్రాంతంలోకి వేగంగా దూసుకొచ్చాయి. అందులోంచి పదిమందికి పైగా యువకులు దిగి నగల తయారీ కేంద్రంలోకి దూసుకొచ్చారు. వెంట తెచ్చుకున్న కత్తులతో పనివాళ్లను, యజ మానిని బెదిరించి బంగారం దొంగిలించారు. వెళ్లే ముందు సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి, వాటిని వెంట తీసుకెళ్లారు. అంతా పక్కాగా.. ఓ ప్రణాళిక ప్రకారం దోపిడీ ప్రక్రియను పూర్తిచేశారు. దుండగులు వెళ్లిన తర్వాత తేరుకున్న యజమాని పోలీసులకు సమా చారం అందించాడు. దీంతో అక్కడికి చేరు కున్న పోలీసులు అక్కడి కార్మికులను, యజ మానిని ప్రశ్నించారు. దుండగులు హిందీ మాట్లాడారని, హైదరాబాద్‌కు చెందినవారు కాదని కార్మికులు చెప్పడంతో.. ముంబైకి చెందిన పాత నేరస్థులు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. దోపిడీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాలను కూడా దొంగలు ఎత్తుకెళ్లడంతో చుట్టుపక్కల అమర్చిన సీసీ కెమెరాల పుటేజీలను సేకరించారు. చుట్టుప్రక్క ప్రాంతాల, సరిహద్దు పోలీసులకు సమాచారం అందించి నాకాబంది చేస్తున్నారు. దోపిడీకి పాల్పడిన రెండు బైకులు సంఘటనా ప్రదేశంలో వదిలి వెళ్లారు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

### విచారణ జరుపుతున్నాం.. డీసీపీ

ఈ దొంగతనానికి సంబంధించి అను మానితులు ఐదుగురిని ఇప్పటికే అదుపులోకి తీసుకుకున్నట్టు డీసీపీ సత్యనారాయణ తెలి పారు. కేసు వివరాలను మీడియాకు వెల్ల డిస్తూ.. 'మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 10 నుంచి 12 మంది వ్యక్తులు దుకాణంలోకి చొరబడ్డారు. ఆ సమయంలో 21 మంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు.

వారికి కత్తి చూపించి బెదిరించారు. కొందరిని కాళ్లు, చేతులు కట్టేసి సుమారు 5 కిలోల బంగారం తీసుకెళ్లినట్టు ఫిర్యాదు వచ్చింది. వెంటనే మేం అప్రమత్తమయ్యాం. సీసీ కెమెరాలు తీసు కెళ్లాం. గతంలో ఇక్కడ పనిచేసినవారు, ఇప్పు డు చేస్తున్నవారి హస్తం ఉన్నట్టు ప్రాథ మికంగా అనుమానిస్తున్నాం. మీడియాలో వస్తున్నట్టు కాల్పులు జరగడంగానీ గానీ, ఎవరికీ గాయాలు కావడం గానీ జరగలేదు. బెదిరించి బంగారం తీసుకెళ్తుంటే అక్కడ 25 మంది ఉన్నా కనీసం ఎందుకు అడ్డుకోలేదనే కోణంలో విచారిస్తున్నాం. ఇప్పటికీ కొన్ని ఆధారాలు దొరికాయి. అతి త్వరలోనే మేం ఈ కేసును ఛేదిస్తాం. దుండగులను పట్టు కుంటాం. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల్లో పరిశీలించాం. సాధ్యమైనంత త్వరగా నింది తులను అరెస్టు చేస్తా'మని వివరించారు.

## ఉద్యమ రాష్ట్రంలో రాచరిక పాలన

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. పరాయిపాలన మాకొద్దం టూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రజల ఆకాంక్షలు తెలంగాణ ఏర్పడినా నెరవేరడంలేదని పేర్కొన్నారు. ప్రజల ఆశ లు అడియాసలయ్యేలా చట్టవిరుద్దంగా, అప్రజాస్వామికంగా ఈ సర్కారు కుటుంబ పాలన చేస్తోందని మండిపడ్డారు. ఈ పరి స్థితులలో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీ య శక్తిని కోరుకుంటున్నారని తెలిపారు. అమరుల త్యాగలతో అధికారం చేపట్టిన కేసీఆర్ ఉద్యమాకారులను, ఇతర రాజకీ య పార్టీల నాయకులను, ప్రజలను ఒక్క సారి కూడా కలిసిన సందర్భంలేదని చెప్పా రు. తెలంగాణ కోసం ప్రాణాలను సైతం అర్పించిన వారి కుటుంబాలను పట్టించు కోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యమాలతో సిద్ధించిన రాష్ట్రంలో పోరాడే గొంతును నొక్కేస్తున్నాడని విమర్శించారు. కేవలం పోలీస్ శాఖలో మాత్రమే నియా మకాలు చేపడుతూ సీఎం కేసీఆర్ తన భద్రతా ఏర్పాట్లను పెంచుకుం టున్నాడని విమర్శించారు. జిల్లాలో ఏ ఒక్క చిన్న పరిశ్రమకూడా లేదని, వ్యవ సాయ అధా రిత కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు దొరక్క రోడ్డున పడుతు న్నారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, సంకెళ్ళు వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వా నికే దక్కుతుందని విమ ర్శించారు. గిట్టుబాటు ధరలు ప్రభుత్వాలు కల్పిస్తే రైతులు బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపా రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఎందుకు వస్తుందని కోదండరాం ప్రశ్నిం చారు. తెలంగాణ వస్తే తగ్గుతాయనుకున్న రైతు ఆత్మహత్యలు మరింత పెరిగాయని ఆరోపించారు. ఒక్క మహబూబాబాద్ జి ల్లాలోనే 81 మంది రైతులు ఆత్మహత్య లకు పాల్పడ్డారని, ఏ ఒక్క రైతు కుటుం బాన్ని సీఎం ఓదార్చిన, ఆదుకున్న దాఖ లాల్లేవని అన్నారు. రైతులకు కావా ల్సిన విత్తనాలు, ఎరువులను సబ్సిడి ద్వారా కల్తి లేని వాటిని ప్రభుత్వమే అందిం చాలని, రైతులకు బ్యాంకుల ద్వారా పెట్టు బ డులను ముందే ఇవ్వాలని, గిట్టుబాటు ధ ర, ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతే పరిహారం అందించి ఆదుకోవాలని డి మాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తామం టున్న ఎకరాకు 4 వేలు పెట్టుబడులకు సరిపో వని, రైతులకు లాభసాటి గిట్టుబాటు ధర లు కల్పిస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కోదండరాం పేర్కొన్నారు. వేల కోట్ల ప్ర జా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ మిషన్ కాకతీయ, భగీరథ పనులతో కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

## కేసీఆర్‌కు కొత్తబుల్లెట్‌ప్రూఫ్ బస్!

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తున్నారు. మూడేళ్ల క్రితం రూ. 4 కోట్లతో బుల్లెట్ ప్రూఫ్ మెర్సిడెస్ బెంజ్ బస్సును సీఎం పర్యటనలకు కోసం కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ బస్సునే సీఎం తన పర్యటన సమయంలో వినియోగిస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో.. సీఎం భద్రతా దృష్ట్యా అదనంగా అత్యాధునిక సదుపాయాలతో రెండో బస్సును కొనుగోలు చేయనున్నారు. దీనికి సంబంధించి చర్చించేందుకు సోమవారం సచివాలయంలో రోడ్డు రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మరో కొత్త బుల్లెట్ ప్రూఫ్ బస్సు కొనుగోలుకు టెండర్లు పిలిచే విషయమై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం ఓ కమిటీని కూడా నియమించారు. కొత్త బస్సులోని అత్యాధునిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలపై విశ్లేషించి తుది ఆమోదం కోసం జీఏడీకి ప్రతిపాదనను ఈ కమిటీ పంపుతుంది. టెండర్లను ఖరారు చేసిన తరువాత బస్సు సిద్ధమయ్యేందుకు కనీసం రెండు మూడు నెలల సమయం పడుతుందని రవాణాశాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

## థర్డ్ ఫ్రంట్..డ్రామా

(మొదటిపేజీ తరువాయి)

ఆరో పించారు. టీఆర్ఎస్ హయాంలో ఇప్పటి వరకు 4 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే జరగబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య బస్సు యాత్ర మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను సీఎం కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రజలను, రైతాంగాన్ని పట్టించుకోని కేసీఆర్ కేంద్ర స్థాయిలో మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను మాటల గారడితో మాయచేస్తున్న సీఎం కెసిఆర్ దేశ వ్యాప్తంగా ఎలా రాణిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ కోటకు గండిపడటం ఖాయమన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తనకు మద్దతు పలుకుతున్నారని కేసీఆర్, ఆ పార్టీ నేతలు సొంత డబ్బా కొట్టుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పంటల మద్దతు ధరకు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం బడ్జెట్‌లో ఎలాంటి బోనస్ ప్రకటించలేదని అన్నారు.వరి, మిర్చి, కందులకు బోనస్ ధర ఇవ్వని ప్రభుత్వం... నాలుగు దఫాలుగా రుణమాఫీ చేసి వడ్డీ భారం భరించకుండా రైతులపై మోపారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి 2 లక్షల రుణమాఫీ చేస్తామని, పంటల బీమా భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలకు క్వింటాలకు రూ.2 వేలు తగ్గకుండా, పత్తికి రూ. 6 వేలుల, ఎర్రజొన్నలు, సోయాకు రూ.3 వేలు, మిర్చి, పసుపు పంటలకు రూ. 10 వేలకు తగ్గకుండా మద్దతు ధర నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు. 2019లో జరగబోయే ఎన్నికలలో రాష్ట్ర, దేశ రాజకీయాల్లో అధికారం కాంగ్రెస్ హస్తగతం చేసుకోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నేత రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చదంటూ విమర్శన అస్త్రాలు కురిపించారు. కార్యక్రమంలో జానారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, శ్రీధర్ బాబు, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ అజహరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## 'లైఫ్'సైన్సెస్

(మొదటిపేజీ తరువాయి)

అడ్వజయిజరీ కమిటీ సమావేశం జరిగింది. కొద్ది రోజుల క్రితం నిర్వహించిన బయో ఏషియా సదస్సులో రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధిపై జరిగిన చర్చలు, సల హాల మేరకు ఈ సమావేశం నిర్వహించారు.

### మౌలిక వసతులు భేష్

తొలుత కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి ఈ రంగంలో ఉన్న అభివృ ద్ధి, అవకాశాలను వివరించారు. అంతర్జాతీయ స్థా యిలో ఉన్న ఇక్కడి మౌలిక వసతులు పరిశ్రమకు మరింత వృద్ధినిస్తాయని తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందుకు పోయేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సంద ర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతోపాటు అంతర్జాతీయ కంపెనీలను ఇక్కడికి వచ్చేలా చూస్తామని తెలిపారు. దీంతోపాటు లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న డిజిటల్ మెడిసిన్, ఫార్మారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాల ద్వారా రానున్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టంను మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనికోసం పరిశోధన, శిక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వం మరింత చురుగ్గా పనిచేస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలోని పరిశోధనలకు ఊతం ఇచ్చేందుకు టీ-హబ్ లాంటి ఒక ఇంక్యుబేటర్‌ను జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### పాఠశాల స్థాయి నుంచే కౌన్సెలింగ్

ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరిశోధనలు చేసే స్టార్టప్స్, హైరిస్క్ రీసెర్చ్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఒక ఫండ్ ఏర్పాటు చేస్తామ న్నారు. ఇందుకోసం రానున్న బడ్జెట్ లో కేటా యింపులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయ నున్నట్లు అడ్వయిజరీ కమిటీకి తెలిపారు.

### ఐదు వ్యాధుల కట్టడి

ఐదు వ్యాధులను ఎంచుకుని వాటిని కట్టడి చేయడం కోసం అవసరమైన పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫార్మా కంపెనీలు, విద్యాసంస్థలు, సీసీఎంబీ వం టి పరిశోధన సంస్థల మధ్య పరిశోధనల విషయంలో మరింత సమన్వయాన్ని పెంచేందుకు రిచ్ (రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హై దరాబాద్) ప్రయత్నిస్తుందని ఆయన తెలిపారు.


లైఫ్ సైన్సెస్ రంగంలోని కంపెనీల భాగస్వామ్యంతో పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడు తుందని తెలిపారు. నూతన పరిశ్రమలను తెలం గాణకు రప్పించడంతో పాటు ఇప్పటికే కార్య కలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమల విస్తరణపై దృష్టి సారిస్తుందన్నారు. ఈ మేరకు త్వరలోనే సంబంధిత కంపెనీలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చ ర్చిస్తామని తెలిపారు. ఫార్మారంగంలో మరిన్ని పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం ఒక ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బాడీని ఏర్పాటు చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

# విరుచుకుపడిన విపక్షాలు

## పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో గందరగోళం.. నేటికి వాయిదాపడిన లోక్‌సభ... రాజ్యసభ

- పలు డిమాండ్లతో పలువురు ఎంపీల నిరసన
- నినాదాల హోరుతో ఉభయసభల్లో అంతరాయం
- పీఎన్‌బీ మోసంపై ప్రధాని ప్రకటనకోసం పట్టు

న్యూఢిల్లీ, మార్చి 6: పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాల రెండోరోజు మంగళవారం కూడా విపక్షాల గందరగోళం నడుమ ఉభయసభలు బుధవారానికి వాయిదాపడ్డాయి. బ్యాంకింగ్ రంగంలో మోసాలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కావేరీ జలవివాదం, తెలంగాణలో రిజర్వేషన్లు, మరాఠీకి ప్రాచీన భాష హోదా తదితర అంశాలపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.12,700 కోట్ల మేర వజ్రవ్యాపారి నీరవ్‌మోదీ కుచ్చుటోపీ పెట్టడంపై ప్రధాని ప్రకటన కోసం సభ్యులు పట్టుబట్టారు. మరోవైపు రాష్ట్రానికి ప్రత్యేక హోదాకోసం ఏపీ ఎంపీలు గట్టిగా గళమెత్తారు. ఈ పరిణామాల నడుమ ఉభయసభల కార్యకలాపాలు స్తంభించడంతో వాయిదావేయక తప్పలేదు. మంగళవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే, శివసేన పార్టీల సభ్యులు ప్లకార్డులు చేతబట్టి సభామధ్యంలోకి దూసుకొచ్చారు. తమతమ డిమాండ్లతో వారంతా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ సభను హోరెత్తించారు. ఈ గందరగోళం నడుమనే ప్రశ్నోత్తరాలు చేపడుతున్నట్లు స్పీకర్ సుమిత్ర మహాజన్ ప్రకటించారు. దీంతో విపక్ష సభ్యులు నినాదాలను మరింత ఉధృతం చేయగా తొలుత మధ్యాహ్నం 12:00 గంటలదాకా సభ వాయిదాపడింది. ఆ తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. నీరవ్ మోదీ ఉదంతంపై ప్రధాని ప్రకటన చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు 'చోటా మోదీ ఎక్కడున్నాడు? ప్రధానమంత్రీ..! జవాబివ్వండి.. నీరవ్ మోదీని వెనక్కు రప్పించండి' అంటూ నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళనపై సభా వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ స్పందిస్తూ- బ్యాంకింగ్ రంగంలో మోసాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమేనని ప్రకటించారు. అనంతరం ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చర్చకు జవాబిస్తారని తెలిపారు. ద్రవ్యబిల్లుతోపాటు వివిధ శాఖలకు నిధుల మంజూరు ప్రతిపాదనలను ఆమోదించాల్సి ఉందని గుర్తుచేశారు. సభ సజావుగా సాగితే ప్రతి ఒక్కరూ తాము లేవనెత్తదలచిన సమస్యను ప్రస్తావించవచ్చునని సూచించారు. పీఎన్‌బీ మోసంసహా బ్యాంకింగ్ రంగంలో వ్యవస్థీకృత అవకతవకలు-ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం మీద చర్చ కోరుతూ ఇద్దరు సభ్యులు నోటీసులిచ్చారని తెలిపారు. ఈ అంశాన్ని సభా కార్యకలాపాల జాబితాలో చేర్చామని కూడా వివరించారు. అసలు యూపీఏ హయాంలోనూ ఇలాంటి మోసాలు చోటుచేసుకున్నాయని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యులు చర్చనుంచి ఎందుకు పారిపోతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అయితే, కోట్లు కొల్లగొట్టిన బడా మోసగాళ్లు దేశం వదిలిపోయేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తున్నదని కాంగ్రెస్ సభాపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. దీనిపై చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. మరోవైపు విపక్ష సభ్యుల నినాదాలు కొనసాగుతూనే ఉండటంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.


లోక్‌సభలో విపక్షాల ఆందోళన

### ఎగువ సభలోనూ ఎడతెగని హోరు

రాజ్యసభలో కూడా మంగళవారం అదే డిమాండ్లతో ప్రతిపక్షాల ఆందోళన, నినాదాలు, గందరగోళం కొనసాగాయి. ఫలితంగా సభా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. ఉదయం సభ మొదలవగానే వివిధ పార్టీల ఎంపీలు తమ డిమాండ్లతో నినాదాలు అందుకున్నారు. తొలుత చైర్మన్ వెంకయ్యనాయుడు, ఆ తర్వాత డిప్యూటీ చైర్మన్ పి.జె.కురియన్ పలుమార్లు సభ్యులను సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో దఫదఫాలుగా మూడుసార్లు సభను వాయిదా వేశారు. నాలుగోసారి తిరిగి సమావేశం మొదలయ్యాక విపక్ష ఎంపీలు సభామధ్యంలోకి దూసుకొచ్చి ఆందోళన కొనసాగించడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు మధ్యాహ్నం 3:35 గంటలకు కురియన్ ప్రకటించారు. అంతకుముందు సభ్యుల తీరుపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ఇదెంతమాత్రం సమంజసం కాదు... సభను విచ్ఛిన్నం చేసే ఇలాంటి ఎత్తుగడలను నేను అనుమతించను. ఇది బజారు కాదు... మిమ్మల్ని మీరే అవమానించుకుంటున్నారు. పార్లమెంటు పనితీరులో హుందాతనం లోపించిందన్న ప్రజాభిప్రాయం మీ చర్యలవల్ల బలపడుతోందని గమనించండి'' అని హెచ్చరించారు. సభాధ్యక్ష స్థానంలోకి వచ్చిన కురియన్- ''అన్ని అంశాలపైనా అందరూ మాట్లాడేందుకు అవకాశం ఇస్తాను. శాంతియుతంగా చర్చిద్దాం'' అన్నారు. అయినా విపక్ష సభ్యులు ఖాతరు చేయకపోవడంతో ''మీరిలా చేయడంద్వారా గూండాల స్థాయికి దిగజారుతున్నారు'' అంటూ తీవ్ర వ్యాఖ్య చేశారు.

## పార్లమెంటు ప్రాంగణంలో కాంగ్రెస్ నిరసన

పీఎన్‌బీకి నీరవ్ మోదీ మోసంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాబివ్వనందుకు నిరసనగా పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఎంపీలు ప్రదర్శన నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ నిరసన కార్యక్రమానికి సారథ్యం వహించారు. నీరవ్ మోదీ పీఎన్‌బీని దోచుకోవడంపై ప్రధానమంత్రి మౌనం వీడాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ''దేశానికి కాపలాదారు ఎటు పోయారు? నిద్రపోయారు... నిద్రపోయారు'' అంటూ నినదించారు. నీరవ్ మోదీని ప్రభుత్వం రక్షించేందుకు యత్నించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డులు చేతబట్టి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆ తర్వాత కొంతసేపటికి వామపక్షాల సభ్యులు కూడా నిరసనలో పాలుపంచుకున్నారు. పీఎన్‌బీ మోసంపై సంబంధిత అధికారులకు, ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదులు అందజేసినా నీరవ్ తప్పించుకునేందుకు సాయపడ్డారని ఆరోపించారు. అయితే, బీజేపీ ఈ ఆరోపణలను ఖండించింది. ఈ మోసం కాంగ్రెస్ హయాంలోనే చోటు చేసుకున్నదని ప్రత్యారోపణ చేసింది.


గాంధీ విగ్రహం వద్ద నినాదాలు



## పెళ్లి లారీ బోల్తా.. 26 మంది దుర్మరణం

- మృతుల్లో పదిమంది మహిళలు
- ఐదుగురు చిన్నారులు కూడా
- గుజరాత్‌లో ఘోర ప్రమాదం

భావ్‌నగర్(గుజరాత్), మార్చి 6: గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఓ పెళ్లి బృందం ప్రయాణిస్తున్న లారీ బోల్తా పడడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వివాహ వేడుకకు హాజరయ్యేందుకు లారీలో ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని సమాచారం. మంగళవారం ఉదయం రందోరా గ్రామ సమీపంలోని ఓ బ్రిడ్జిపై ఈ దారుణం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోటాడ్ జిల్లాలో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు భావ్‌నగర్ జిల్లా అనిదా గ్రామానికి చెందిన 60మంది లారీలో మంగళవారం తెల్లవారుజామున బయలుదేరారు. ఈ క్రమంలో రందోరా సమీపంలో లారీ డ్రైవర్ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బ్రిడ్జిపైనున్న గుంతల్లో పడి లారీ అదుపుతప్పి వంతెనపైనుంచి కిందపడింది. ఈ ఘటనలో 25 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారని భావ్‌నగర్ కలెక్టర్ హర్షద్ పటేల్ తెలిపారు. మృతుల్లో పదిమంది మహిళలు కాగా మరో ఐదుగురు చిన్నారులని వివరించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.



## త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేత

- మా పార్టీ నేతలపై దాడులు చేస్తున్నారు
- కమ్యూనిస్టు ఫోబియాకు ఇది నిదర్శనం: సీపీఎం
- అణచివేతతో విసిగిపోయిన ప్రజలే కూల్చేశారు
- లెనిన్ విగ్రహం కూల్చివేతపై బీజేపీ నేతలు

బెలోనియా(త్రిపుర), మార్చి 6: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత త్రిపురలో కొంతమంది దుండగులు లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు. బెలోనియా పట్టణంలో లెనిన్‌గా ప్రసిద్ధుడైన వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యానోవ్ విగ్రహాన్ని వామపక్షాల నేతలు ఏర్పాటు చేశారు. త్రిపురలో సీపీఎం 21 ఏళ్ల పాలనకు చిహ్నంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే, తాజా ఎన్నికలలో బీజేపీ కూటమి గెలుపొందిన విషయం తెలిసిందే! ఈ నేపథ్యంలో కాషాయ దుస్తులు, టోపీలు ధరించిన యువకులు 'భారత్ మతాకీ' జై నినాదాలు చేస్తూ జేసీబీతో లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను తాజాగా ఏఎన్ఐ ట్వీట్ చేసింది. దీనిపై స్పందిస్తూ.. కొందరిలో ఉన్న 'కమ్యూనిస్టు ఫోబియా'కు ఇదే నిదర్శనమని సీపీఎం విమర్శించింది. అయితే, వామపక్ష పాలనలో అణచివేయబడ్డ ప్రజలే ఆ విగ్రహాన్ని కూల్చేశారని బీజేపీ కౌంటర్ ఇచ్చింది. మరోవైపు త్రిపురలో విజయం సాధించిన ఉత్సాహంలో బీజేపీ శ్రేణులు సీపీఎం కార్యాల యాలపై దాడులు చేసి విధ్వంసానికి దిగుతున్నట్టు తెలుస్తోంది. బీజేపీ నేతల సహకారంతో ఆ పార్టీ శ్రేణులు సీపీఎం కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారని వామపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. కాగా, అల్లర్లపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిపుర గవర్నర్ తతగత రాయ్, డీజీపీ ఏకే శుక్లాతో మాట్లాడి, హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు పరిస్థితులను అదుపు చేయాలని సూచించారు. ఇక ఈ అల్లర్లకు కారకులనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం ఆరోపణలపై బీజేపీ స్పందిస్తూ.. బీజేపీ మద్దతుదారులని చెప్పుకుంటూ కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఈ దాడులు చేస్తున్నారని ఆరోపించింది. సీపీఎం నుంచి బీజేపీలోకి వచ్చిన వారే ఇలా చేస్తున్నారని ప్రత్యారోపణలు చేసింది. ఎవరైనా ఘర్షణలకు పాల్పడినట్లు తెలిస్తే బహిష్కరణ వేటు తప్పదని బీజేపీ ఉపాధ్యక్షుడు సుబల్ తమ పార్టీ శ్రేణులను హెచ్చరించారు.

## సుప్రీంలో కార్తీకి చుక్కెదురు

- ఈడీ అరెస్టుపై స్టేకు నిరాకరణ
- మరో మూడు రోజుల సీబీఐ కస్టడీ
- కోర్టుకు హాజరైన చిదంబరం దంపతులు



న్యూఢిల్లీ, మార్చి 6: కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మనీలాండరింగ్ ఆరోపణ లు ఎదుర్కొంటున్న కార్తీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనను అరెస్ట్ చేయకుండా అడ్డుకునేందుకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని చేసిన విన్నపాన్ని కోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ.ఎం ఖాన్‌విల్కర్, డి.వై చంద్రచూడ్‌తో కూడిన ధర్మా సనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే అరెస్ట్ చేయకుండా రక్షించాలని కార్తీ వేసిన పిటిషన్‌పై ఈడీ స్పందనను కోర్టు కోరింది.8కి కోర్టు వాయిదా వేసింది.

### కార్తీకి మరో 3 రోజుల సీబీఐ కస్టడీ

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అదపులోకి తీసుకు న్నా కార్తీ చిదంబరానికి ఢిల్లీ కోర్టు మరో మూడు రోజులు సీబీఐ కస్టడీకి అను మతించింది. ఈ కేసులో సీబీఐ కస్టడీ మంగళవారంతో ముగిసి నందున కార్తీ చిదంబరంను సీబీఐ అధికారులు కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణకు కార్తీ ఏమాత్రం సహకరించట్లేదని, ఫోన్ పాస్‌వర్డ్స్ వెల్లడించడానికి నిరాకరిస్తున్నారని కోర్టు ఎదుట సీబీఐ అధికారులు వాదించారు. ఈ కేసులో మరింత లోతైన విచారణ జరగాల్సి ఉన్నందున మరో తొమ్మిది రోజుల కస్టడీకి ఇవ్వాలని వాదించారు. అయితే.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నాని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనను ఈ కేసులో ఇరికించారని కార్తీ చిదంబరం పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. కార్తీకి మరో మూడు రోజులు సీబీఐ కస్టడీ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఈ విచారణకు కార్తీ తల్లిదండ్రులు చిదంబరం ,నళినీ చిదంబరం కూడా స్వయంగా హాజరయ్యారు. విచారణ సమయంలో వారు కోర్టులోనే ఉన్నారు.

### చిదంబరానికి సీబీఐ పిలుపు?

న్యూఢిల్లీ, మార్చి 6: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరానికి సీబీఐ సమన్లు పంపనుంది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆయన కుమారుడు కార్తీని ఇప్పటికే అరెస్టు చేసి, ప్రశ్నిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సదరు మీడియా సంస్థ యాజమాన్యంలోని ఇంద్రాణి ముఖర్జియా సమక్షంలోనూ ఆయనను ప్రశ్నించింది. ఈ సందర్భంగా అప్పటి ఆర్థికశాఖ మంత్రి చిదంబరంతో మాట్లాడిన తర్వాతే తాను కార్తీతో భేటీ అయ్యానని, ఆయన కోరిన మేర లంచం ముట్టజెప్పానని ఆమె వెల్లడించింది. దీంతో చిదంబరాన్ని కూడా ప్రశ్నించాల్సి ఉందని సీబీఐ వర్గాలు భావిస్తున్నాయి. ఆ మేరకు తమ ఎదుట హాజరు కావాల్సిందిగా ఆయనకు సమన్లు పంపే అవకాశాలున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. ఐఎన్ఎక్స్ మీడియా విషయంలో ఆనాడు కొన్ని 'విధివిధానాలు' పాటించలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు కొందరు ఆరోపించినట్లు సీబీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే చిదంబరాన్ని కూడా ప్రశ్నించాలని భావిస్తున్నట్లు తెలిపాయి.

## చందాకొచ్చర్, శిఖా శర్మలకు నోటీసులు

- పీఎన్‌బీ స్కాం కేసులో ఎస్ఎఫ్ఐవో జారీ
- గీతాంజలి ఉపాధ్యక్షుడు విపుల్ అరెస్టు


న్యూఢిల్లీ, మార్చి 6:పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో ఐసీఐసీఐ బ్యాంకు చీఫ్ చందా కొచ్చర్, యాక్సిస్ బ్యాంకు చీఫ్ శిఖా శర్మలకు తీవ్ర అవినీతి విచారణ సంస్థ (ఎస్ఎఫ్ఐవో) నోటీసులు జారీ చేసింది. ముకుల్ చోక్సీకి చెందిన గీతాంజలి నగల సంస్థకు రుణాలు మంజూరు చేయడంపై విచారణ జరిపేందుకు ఈ ఇరువురు టాప్ బ్యాంకర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఐసీఐసీఐ బ్యాంకు సారథ్యంలోని 31 బ్యాంకుల కన్సార్షియం గీతాంజలి సంస్థకు రుణాలు మంజూరు చేసింది. కాగా ఈ కేసులో బ్యాంకు పెద్దలను నిందితులుగా కాకుండా కేవలం వివరాలు తెలుసుకునేందుకే ప్రశ్నిస్తున్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి. విచారణలో భాగంగా సీబీఐ ఇప్పటికే ఐసీఐసీఐ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ కనన్‌ను కూడా ప్రశ్నించింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి మేనమామ ముకుల్ ఛోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంకును 12 వేల కోట్ల మేర మోసగించి విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంపై దాఖలైన పలు కేసుల్లో సీబీఐ అధికారులు ఇప్పటి వరకు దాదాపు 20 మందిని అరెస్టు చేశారు.

### గీతాంజలి ఉపాధ్యక్షుడి అరెస్టు

వేల కోట్ల రూపాయల పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి గీతాంజలి గ్రూప్ కంపెనీల ఉపాధ్యక్షుడు విపుల్ చితాలియాను సీబీఐ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ముంబై విమానాశ్రయంలో చితాలియాను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం బాంద్రా-కుర్లాలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించినట్లుగా అధికారులు వెల్లడించారు.

## మేఘాలయ సీఎంగా కన్రాడ్ ప్రమాణం

- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్, అమిత్ షా హాజరు


సీఎంగా ప్రమాణం చేస్తున్న కన్రాడ్ సంగ్మా

షిల్లాంగ్, మార్చి 6: మేఘాలయ కొత్త ముఖ్యమంత్రిగా కన్రాడ్ సంగ్మా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ ఎన్నికలలో సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) సొంతంగా 19 స్థానాల్లో గెలుపొందింది. ఈ నేపథ్యం లో పాత మిత్రులను కలగలిపేసుకుని సంగ్మా మేజిక్ ఫిగర్‌ను కూడగట్టుకున్నారు. దీంతో మంగళవారం కన్రాడ్ సంగ్మాతో గవర్నర్ గంగాప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. సంగ్మా తో పాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశా రు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ చీఫ్ అమిత్ షా, మణిపూర్ సీఎం బైరేన్ సింగ్ తదితరులు హాజరయ్యారు. లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడు కన్రాడ్ సంగ్మా 2016లో తండ్రి మరణానంతరం ఎన్పీ పీ పగ్గాలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం తురా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్పీపీ 19 స్థానాల్లో గెలుపొందగా, ఆరుగురు యూడీపీ ఎమ్మెల్యేలు, నలుగురు పీడీఎఫ్ ఎమ్మె ల్యేలు, ఇద్దరేసి బీజేపీ, హెచ్ఎస్పీడీపీ ఎమ్మె ల్యేలు ఆ పార్టీకి మద్దతు తెలిపారు. మరికొంద రు ఇండిపెండెంట్ల చేరికతో ఎన్పీపీ బలం 34కు పెరిగింది. యూడీపీ చీఫ్ డోంకుపర్ రాయ్ ఎన్పీపీకి మద్దతు తెలపడంతో కన్రాడ్ సంగ్మా సర్కార్ కొలువుతీరేందుకు మార్గం సుగమ మైంది. కాంగ్రెసేతర ఫ్రంట్‌కు సంగ్మా నాయక త్వాన్ని బలపరుస్తామని రాయ్ ముందుకొచ్చా రు. కాగా, మేఘాలయలో పదేళ్లపాటు అధికారం లో ఉన్న కాంగ్రెస్ ఇటీవలి ఎన్నికల లో 21 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినా సంకీర్ణానికి అవసరమైన బలం కూడగట్టడంలో విఫలమైంది.

### నాగాలాండ్‌లో నైఫూ రియోకు మార్గం సుగమం

నాగాలాండ్ శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీకీ ఆధిక్యం లభించని నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) అతిపెద్ద పార్టీగా అవతరించినందున ప్రభుత్వ ఏర్పాటు అవకాశం తమకే ఇవ్వాలని ప్రస్తుత సీఎం, పార్టీ అధినేత టి.ఆర్.జెలియాంగ్ రాజీనామాకు తిరస్కరించారు. అయితే, మంగళవారం పరిణామాలు వేగంగా మారిపోయాయి. ఎన్డీఏ భాగస్వామి ఎన్డీపీపీకే తమ 12 మంది ఎమ్మెల్యేల మద్దతిస్తున్నట్లు రాష్ట్ర గవర్నర్‌కు బీజేపీ ఒక లేఖ అందజేసింది. ఎన్డీపీపీ అధినేత నైఫూ రియో ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు జేడీయూ ఏకైక ఎమ్మెల్యేతో పాటు మరో స్వతంత్ర శాసనసభ్యుడు మద్దతు పలకడంతో ఎన్డీపీపీకి 31 మంది సభ్యుల బలంతో సాధారణ ఆధిక్యం లభించినట్లయింది.

## త్రిపుర పీఠంపై విప్లవ్ కుమార్ దేవ్

### ఉప ముఖ్యమంత్రిగా బర్మన్: గడ్కరీ


త్రిపుర సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థులుగా ఎంపికైన విప్లవ్‌దేవ్, దేవ్ బర్మన్‌ను అభినందిస్తున్న నితిన్ గడ్కరీ

అగర్తల, మార్చి 6: త్రిపుర కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు విప్లవ్ కుమార్ దేవ్ పేరు ఖరారైంది. ఈ మేరకు అగర్తలలో మంగళవారం నిర్వహించిన బీజేఎల్పీ సమావేశంలో ఆయనను శాసన సభాపక్ష నేతగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. రాష్ట్రంలో బీజేపీని అధికారానికి చేరువ చేయడంలో విప్లవ్ కీలకపాత్ర పోషించడంతో ఆయనను సీఎం పదవి వరించింది. ఇక ఉప ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ బర్మన్ పేరు ఖరారైంది. విప్లవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతారని సమాచారం. బీజేపీకి 35 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇండిజనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్టీ)కి 8 మంది ఎమ్మెల్యేలున్నారు. త్రిపుర అసెంబ్లీలో 60 స్థానాలుండగా 59 స్థానాలకు ఫిబ్రవరి 18న ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సీపీఎం అభ్యర్థి మరణంతో ఒక నియోజకవర్గంలో ఎన్నిక వాయిదాపడింది. కాగా, గోమతి జిల్లా రాజ్‌ధర్ నగర్ గ్రామంలో 1971 నవంబరు 25న మధ్యతరగతి కటుంబంలో విప్లవ్ దేవ్ జన్మించారు. ఆయన తండ్రి హరధన్ దేవ్ అప్పట్లో జన్‌సంఘ్ స్థానిక నేతగా వ్యవహరించారు. 1999లో ఉదయ్‌పూర్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్‌లో చేరారు. దాదాపు పదహారేళ్ల పాటు సంఘ్ ప్రముఖ నేతలతో కలిసి పనిచేశారు. 2015లో త్రిపురకు తిరిగి వచ్చిన దేవ్ బీజేపీలో చురుగ్గా పనిచేశారు. ఆ మరుసటి ఏడాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో పార్టీ ఘన విజయం సాధించడానికి ప్రధాన కారణం దేవ్ కృషేనని పార్టీ వర్గాల అభిప్రాయం. కాగా, మంత్రివర్గంలో తమకు సరైన ప్రాధాన్యం దక్కకుంటే ప్రభుత్వంలో చేరవద్దని ఐపీఎఫ్టీ నేతలు నిర్ణయించారు.

## మనది సైద్ధాంతిక విజయం

- త్రిపుర గెలుపుపై ప్రధాని మోదీ
- కమ్యూనిస్టులది హింస.. విద్వేషం
- ప్రపంచవ్యాప్తంగా వాళ్లకు చుక్కెదురు
- అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలూ సమానం
- బీజేపీపీ సమావేశంలో ప్రసంగం వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 6: త్రిపురలో తమ పార్టీ విజయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైద్ధాంతిక విజయంగా అభివర్ణించారు. ఎన్నికల్లో వరుస విజయాలు కొనసాగాలంటే మరింత కష్టపడాల్సి ఉందని బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన సూచించారు. సమావేశానికి మోదీ రాగానే... అక్కడున్న నాయకులంతా 'జీత్ హమారీ జారీ హై, అబ్ కర్ణాటక కీ బారీ హై' (మన విజయం కొనసాగుతుంటుంది, ఇక కర్ణాటక వంతు) అంటూ నినాదాలతో ఆయన్ను స్వాగతించారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాలలో పార్టీ విజయాలపై ప్రధాని మాట్లాడారు. త్రిపురలో కేవలం రెండే లోక్‌సభ స్థానాలున్నాయంటూ కొందరు చేస్తున్న విమర్శలను కూడా ప్రస్తావించారు. సుదీర్ఘకాలంగా ఆ రాష్ట్రం మార్పు కోసం ఎదురు చూస్తోందని, పాతికేళ్లుగా అధికారంలో ఉన్న వామపక్షాలను పదవిలోంచి దించడమే గొప్పని చెప్పారు. కేరళలో ఒకే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో గెలిచి, ఆ తర్వాత ఏకంగా త్రిపురను కైవసం చేసుకున్నామని గుర్తుచేశారు. వామపక్షాల రాజకీయాలు హింస, విద్వేషంతో కూడుకున్నవని, అందుకే ప్రజలు అన్నిచోట్లా వాళ్లను తిరస్కరిస్తున్నారని మోదీ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా కమ్యూనిజం పోతోందని, దేశంలో కేవలం కేరళలోనే అధికారంలో ఉందని అన్నారు. ఈశాన్యంలో మూడు రాష్ట్రాలూ చాలా కీలకమని.. వాటి అభివృద్ధికి కేంద్రం తగిన ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. అభివృద్ధి విషయంలో అన్ని రాష్ట్రాలూ తమకు సమానమేనన్నారు.


ప్రధానికి పార్టీ ఎంపీల సత్కారం




• మహేష్

# 'ప్రతి ఒక్కళ్ళకీ భయం, బాధ్యత ఉండాలి'

## ఇదీ 'విజన్ ఆఫ్ భరత్'

మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రం ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించి 'ది విజన్ ఆఫ్ భరత్' పేరుతో మంగళవారం టీజర్ విడుదలైంది. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేష్ ముఖ్యమంత్రిగా కనిపిస్తారు. టీజర్‌లోని విశేషాల్లోకి వెళ్తే మహేష్ వాయిస్ ఓవర్‌తో ఈ టీజర్ మొదలవుతుంది. ''చిన్నప్పుడు మా అమ్మ నాకో మాట చెప్పింది.. 'ఒకసారి ప్రామిస్ చేసి, ఆ మాట తప్పితే యు ఆర్ నాట్ కాల్డ్ ఎ మ్యాన్' అని. ఎప్పటికీ ఆ మాట తప్పలేదు, మర్చిపోలేదు. నా జీవితంలోనే అతి పెద్ద ప్రామిస్ చెయ్యాల్సిన రోజు ఒకటొచ్చింది. పెద్దదే కాదు, కష్టమైంది కూడా. కానీ, ఎంత కష్టమైనా ఆ మాట కూడా తప్పలేదు. బికాజ్ ఐ యామ్ ఎ మ్యాన్. వియ్ ఆర్ లివింగ్ ఇన్ ఎ సొసైటీ. ప్రతి ఒక్కళ్ళకీ భయం, బాధ్యత ఉండాలి... ప్రామిస్'' అంటూ మహేష్ ఎమోషనల్‌గా చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది. ఈ టీజర్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఉన్న అంచనాలు భారీగా పెరిగాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'శ్రీమంతుడు' తరహాలోనే ఈ సినిమాలో కూడా మంచి సందేశం ఉండబోతోందన్నది అర్థమవుతోంది.




• శర్వానంద్



# 'కణం'కి బాగా కనెక్ట్ అయ్యాను

– సాయిపల్లవి

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమం మార్చి 5న హైదరాబాద్‌లో జరిగింది. ఎన్.వి.ఆర్. ప్రముఖ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ 'కణం' ఆడియో సీడీలను రిలీజ్ చేసి తొలి సీడిని హీరోయిన్ సాయిపల్లవికి అందించారు. ఎన్.వి.ఆర్. సినిమా అధినేత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ ''కణం' సినిమాను తెలుగులో మా ఎన్.వి.ఆర్. సినిమా బ్యానర్‌పై విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. నాగశౌర్య, సాయిపల్లవి ఇద్దరూ హ్యాట్రిక్ సక్సెస్‌లను ఈ సినిమాతో సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. జెమిని కిరణ్ మాట్లాడుతూ ''నాగశౌర్య, సాయిపల్లవి, వెరోనికా, డైరెక్టర్ విజయ్ సహా ఎంటైర్ టీంకు ఆల్ ది బెస్ట్'' అన్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ''సినిమాను తెలుగులో విడుదల చేస్తున్న నా మిత్రుడు ఎన్.వి.ప్రసాద్‌కు, సినిమాలో నటించిన అందరికీ అభినందనలు'' అన్నారు. దర్శకుడు విజయ్ మాట్లాడుతూ ''మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. కరు సినిమానే తెలుగులో కణంగా విడుదల చేస్తున్నాం. సాయిపల్లవి, వెరోనికా, నాగశౌర్యలు అద్భుతంగా నటించారు'' అన్నారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ ''తల్లికి, బిడ్డకు మధ్య ఉన్న అనుబంధం, తపనే ఈ సినిమా కథ. సినిమాకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చేశాను. సినిమాలో నటించడం వల్ల వెరోనికాతో మంచి అనుబంధం ఏర్పడింది. ఫిదా, ఎంసిఎ సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో ఈ సినిమాను కూడా అలాగే ఆదరిస్తారనే నమ్మకముంది'' అన్నారు.



# 'పడి పడి లేచె మనసు'

శర్వానంద్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'పడి పడి లేచె మనసు'. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శర్వానంద్ సరసన సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి మాట్లాడుతూ ''పడి పడి లేచె మనసు' ఒక క్రియేటివ్ లవ్ స్టోరీ. నేడు మా హీరో శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా మా సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం కోల్‌కతాలో హీరో శర్వానంద్, హీరోయిన్ సాయిపల్లవి, మురళీశర్మల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది'' అన్నారు. శర్వానంద్, సాయిపల్లవి, మురళీశర్మ, ప్రియారామన్, వెన్నెల కిషోర్, కళ్యాణి నటరాజన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఛాయాగ్రహణం: జయకృష్ణ గుమ్మడి, నిర్మాణం: శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్, నిర్మాతలు: సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి, దర్శకత్వం: హను రాఘవపూడి.

# తాప్సీ ముందు జాగ్రత్త

తెలుగు సినిమాతో హీరోయిన్‌గా ఎంటర్ అయి ఇప్పుడు బాలీవుడ్‌లో చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది ఢిల్లీ భామ తాప్సీ. తను ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొని హీరోయిన్‌గా ఈ స్థాయికి వచ్చిందనే విషయాల్ని తాప్సీ చాలా సార్లు ప్రస్తావించింది. కొన్ని విషయాల్లో ముక్కు సూటిగా వ్యవహరించే తాప్సీపై చాలా మంది చాలా రకాలుగా కామెంట్ కూడా చేశారు. ఆమె ఇవేవీ లెక్క చెయ్యలేదు. తన టాలెంట్‌తో టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వెళ్లింది. ఇప్పుడు తాప్సీ సోదరి షగున్ సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తోంది. ఈ విషయం గురించి తాప్సీ మాట్లాడుతూ ''నా సోదరి షగున్ సినిమాల్లోకి రావాలను కుంటోంది. నేను పడిన బాధలు నా చెల్లి పడకూడదు. ఆమె విషయంలో నేను చాలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాను. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్ళలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం, సినిమా పూర్తి చేయడం వరకే తెలిసేది. కానీ, ఇప్పుడలా కాదు. ఎలాంటి సినిమా చేయాలి, నా క్యారెక్టర్ ఎలా ఉంటే బాగుంటుంది వంటి విషయాల్లో స్వంతంగా నిర్ణయం తీసుకోగలుగుతున్నాను'' అంటోంది తాప్సీ. 'జుడ్వా 2'తో మంచి హిట్ అందుకున్న తాప్సీ 'దిల్ జంగ్లీ', 'తడ్కా', 'ముల్క్', 'సూర్మా', 'మన్‌మర్జియా' చిత్రాలు చేస్తోంది. ఈ సినిమాలు ప్రీ ప్రొడక్షన్, షూటింగ్ దశల్లో ఉన్నాయి.

# 1000 థియేటర్లలో 'ఏ మంత్రం వేసావె'



• మల్కాపురం శివకుమార్

విజయ్ దేవరకొండ హీరోగా శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఏ మంత్రం వేసావె'. ఈ చిత్రాన్ని సుర్క్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ మార్చి 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''ఈతరం మనోభావాల్ని ప్రతిబింబించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. థ్రిల్లర్ అంశాల కలబోతగా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి యువకుడికి ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కంప్యూటర్ గేమ్స్ అంటే చాలా ఇష్టం. అవే సర్వస్వంగా గడుపుతుంటాడు. ఒక అమ్మాయి పరిచయం అతడి జీవిత గమనాన్ని ఎలా మార్చివేసింది? అతడు ఎలా ప్రయోజకుడయ్యాడు? అన్నదే చిత్ర ఇతివృత్తం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1000 థియేటర్లలో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం. ఇక మా సంస్థలో నిర్మించే సినిమాల విషయానికి వస్తే మూడు చిత్రాలు పూర్వ నిర్మాణదశలో ఉన్నాయి. స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఏప్రిల్ నుంచి షూటింగ్ మొదలుపెడతాం. ద్రోణ చిత్రాన్ని రూపొందించిన కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. రవిచంద్ర దర్శకత్వంలో ఓ వినూత్న కథా చిత్రాన్ని తెరకెక్కించే సన్నాహాల్లో వున్నాం. వీటితో పాటు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఓ కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాన్ని తీయబోతున్నాం. దీనికి కన్నడలో మంచి పేరున్న రఘురాజ్ దర్శకత్వం వహిస్తారు. ఏకకాలంలో ఈ మూడు చిత్రాల నిర్మాణాల్ని చేపడతాం. ఈ చిత్రాలకు హీరోలు కూడా దాదాపు ఖరారయ్యారు. వారి పేర్లు త్వరలో వెల్లడిస్తాం. నిఖిల్‌తో తెలుగులో నిర్మించిన సూర్య వర్సెస్ సూర్య చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నాం. ఈ సినిమాకి సంబంధించిన వివరాలు కూడా త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు.

# కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి

– నిఖిల్



హీరో నిఖిల్ చేసిన తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 16న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో నిఖిల్ మాట్లాడుతూ ''ఇది నా 15వ సినిమా. ప్రతి సినిమా విడుదల దగ్గరపడే కొద్దీ నాలో కొంత కంగారు మొదలవుతుంది. ప్రతి సినిమా విడుదల నాకు మొదటి సినిమా విడుదలలానే ఉంటుంది. 'హ్యాపీ డేస్' తరవాత నేను చేసిన ఫుల్ లెంగ్త్ కాలేజ్ బ్యాక్ డ్రాప్ సినిమా ఇదే అవ్వడంతో నాకిది స్పెషల్ సినిమాగా మారింది. ఇందులో స్టూడెంట్ లీడర్‌గా నటించాను. నేను ఇప్పటివరకు చేసిన క్యారెక్టర్ల కంటే ఎక్కువ తృప్తినిచ్చిన క్యారెక్టర్ ఇది. నా కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన ఓ కుర్రాడు ఫైనల్ ఇయర్‌కి వచ్చేసరికి స్టూడెంట్ లీడర్ ఎలా అయ్యాడనేది కథ. ఒకప్పుడు ఇంజనీరింగ్ అంటే ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడది చాలా మామూలు విషయంగా మారిపోయింది. ఎంత మంచి మార్కులు వచ్చినా ఉద్యోగం అనేది రావడం లేదు. ఈ పాయింట్‌ని టచ్ చేస్తూనే ఒక అమ్మాయి గురించి చేసే చెడు కామెంట్స్ భవిష్యత్తులో ఆమెపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయి వంటి అంశాలని కూడా చూపడం జరిగింది. కన్నడలో పెద్ద హిట్ అయిన ఈ సినిమా మెయిన్ థీమ్‌లో ఎలాంటి తేడా లేదు. అయితే కన్నడలో మూడు గంటల సినిమా. తెలుగులో 2 గంటల 25 నిమిషాల వరకు చేశాం. సినిమాలోని కొన్ని అనవసరమైన సీన్స్ జోలికి వెళ్ళలేదు. చందు, సుధీర్... నాకు, శరణ్‌కి మంచి ఫ్రెండ్స్. వారు మాకు బాగా సపోర్ట్ చేశారు'' అని తెలిపారు.

# 'తారామణి' మొదటి పాట విడుదల



• డి.వెంకటేష్, శ్రీలేఖ

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో రామ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తారామణి'. ఈ చిత్రం తమిళ్‌లో విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగులో అదే పేరుతో జె.ఎస్.కె. ఫిలిం కార్పొరేషన్ సమర్పణలో డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ తెలుగులో అందిస్తున్నారు. 'చేతులు చాచి.. యుగములు వేచి, నీకై ఎదురుచూస్తుంటాలే.. నీ కనుమేరల దారులలోన.. నా ఎద లాంతర వెలుగయ్యాలే..' అంటూ సాగే మొదటి పాటను ప్రముఖ సంగీత దర్శకురాలు, సింగర్ యం.యం.శ్రీలేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా యం.యం.శ్రీలేఖ మాట్లాడుతూ ''ఈ సినిమా గురించి నేను ముందే విన్నాను. తమిళ్‌లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అయిన సినిమా. అన్ని ఎలిమెంట్స్ ఉంటూనే లేడీస్‌కి బాగా కనెక్ట్ అయ్యే సినిమా'' అన్నారు. నిర్మాత డి.వెంకటేశ్ మాట్లాడుతూ ''శ్రీలేఖగారు ఫస్ట్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. సినిమా గురించి కూడా చాలా బాగా చెప్పారు. ఇది ఖచ్చితంగా లేడీ ఆడియన్స్‌కి బాగా రీచ్ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు.



• మేఘున, అనిల్ నెమలి

# 'ప్రతిఘటన' తరహాలో..

తారానీలు కార్పొరేషన్ పతాకంపై అనురాగ్(ఎమ్.ఎస్.బాబు) స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అనిల్ నెమలి హీరోగా పరిచయమవుతున్నారు. మేఘున కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీరామ్ క్లాప్‌నివ్వగా, భూపతిరాజా కెమెరా స్విఛాన్ చేశారు. దాసరి కిరణ్‌కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. ప్రారంభోత్సవ వేడుకకు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ఎమ్.ఎస్ బాబు మాట్లాడుతూ ''ప్రతిఘటన, నేటిభారతం తరహాలో విప్లవభావాలతో సాగే చిత్రమిది. నలుగురు కుర్రాళ్లు సమాజంలో ఏ విధంగా మార్పు తీసుకొచ్చారనేది ఆసక్తిని పంచుతుంది. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తిచేస్తాం. కామెడీ, లవ్, పాలిటిక్స్, సెంటిమెంట్ వాణిజ్య హంగులన్నీ ఉన్న చిత్రమిది'' అన్నారు. నెమలి అనిల్ మాట్లాడుతూ ''స్వతహాగా దర్శకత్వ మంటే నాకు మక్కువ. ఫిలిం టెక్నాలజీలో ఏడాది కోర్సు పూర్తిచేశాను. బాబు చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నాను'' అన్నారు.

# 'యుద్ధభూమి' ట్రైలర్



ఇండో-పాక్ బోర్డర్‌లో 1971లో జరిగిన నిజ ఘటనల ఆధారంగా మలయాళంలో రూపొందిన చిత్రం '1971 బియాండ్ బోర్డర్స్'. మోహన్‌లాల్, అల్లు శిరీష్ హీరోలుగా నటించారు. మేజర్ రవి దర్శకుడు. ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకాలపై ఎ.యన్.బాలాజీ తెలుగులోకి 'యుద్ధభూమి' పేరుతో విడుదల చేస్తున్నారు. అనువాద కార్యక్రమాలు చివరి దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను కేరళలో మోహన్‌లాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ ''మేజర్ రవి, ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో పది సినిమాలు చేశారు. అందులో నేనే ఐదు సినిమాలు చేశాను. 'యుద్ధభూమి' నాకు చాలా సంతృప్తినిచ్చిన చిత్రం. సహజత్వానికి దగ్గరగా ఉండేలా బోర్డర్‌లో చిత్రీకరించారు. అల్లు శిరీష్ బాగా పెర్‌ఫార్మ్ చేశారు. మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నాను'' అన్నారు. దర్శకుడు మేజర్ రవి మాట్లాడుతూ ''ఇండియా, పాక్ సైనికుల భావోద్వేగాలు, బాధలు , బాధ్యతలు గురించి ఒక ఎమోషనల్ డ్రామాతో ఈ సినిమా తీశాం. ఈ చిత్రంలో మేజర్‌గా మోహన్‌లాల్, యంగ్ సోల్జర్‌గా అల్లు శిరీష్ నటించారు'' అన్నారు. నిర్మాత ఎ.యన్. బాలాజీ మాట్లాడుతూ ''ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు ఫైనల్ దశలో ఉన్నాయి. 1971లో భారత్-పాక్ బార్డర్‌లో జరిగిన యుద్ధ నేపథ్యంలో రూపొందించిన ఎమోషనల్ డ్రామా ఇది'' అన్నారు.

# రాజీపడే ప్రసక్తే లేదు!

- మిత్రపక్షం అని ఇన్నాళ్లు గమ్మున ఉన్నా
- లేదంటే గట్టిగా పోరాటం చేసేవాడిని: సీఎం
- హోదా కుదరదంటేనే ప్యాకేజీకి సరేనన్నాం
- ప్రజల మనోభావాలను గుర్తించాలి
- మీరు మాట్లాడాల్సింది ఇక్కడ కాదు
- ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని నిలదీయండి
- రాష్ట్ర బీజేపీ నేతలపై చంద్రబాబు ఫైర్
- కేంద్రం ఎంతో చేసింది: బీజేపీ ఎమ్మెల్యే ఆకుల
- సభను తప్పదోవ పట్టించొద్దన్న సీఎం
- కాంగ్రెస్ స్థితిని గుర్తించాలని సూచన
- వాదోపవాదాలతో వేడెక్కిన అసెంబ్లీ



పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలు

అమరావతి, మార్చి 6(మనం ప్రతినిధి): మిత్ర పక్షాలైన టీడీపీ, బీజేపీ పరస్పర వాదోపవాదాలతో అసెంబ్లీ వాతావరణం వేడెక్కింది. రాష్ట్రానికి ఎంతో చేశామని, విభజన చట్టంలో లేనివి కూడా ఇచ్చామని బీజేపీ సభ్యులు చెప్పుకొనే ప్రయత్నం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు అభ్యంతరం చెప్పారు. ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజల మనోభావాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంతో ఆడుకున్న కాంగ్రెస్ అడ్రస్ గల్లంతయిందని, ఆ విషయాన్ని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. గవర్నర్ ప్రసంగంపై మంగళవారం చర్చించే సమయంలో బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్రం విభజన చట్టంలో ఉన్నవే కాక చట్టంలో లేనివి కూడా రాష్ట్రానికి ఎన్నో ఇచ్చిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి చేయనంత మేలు ఏపీకి చేసిందని చెప్పారు. దీంతో ఆయన ప్రసంగానికి చంద్రబాబు అడ్డుతగిలారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని, ఇక ముందు ఎవరికీ కొనసాగించడం కుదరదని కేంద్రం స్పష్టం చేస్తేనే తాము ప్యాకేజీకి ఒప్పుకున్నామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సభను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం బీజేపీ నాయకులకు తగదన్నారు. తెలుగువారితో ఆడుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అడ్రస్ లేకుండా పోయిందని, దానిని బీజేపీ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌కు అది చేస్తాం.. ఇది చేస్తామంటున్నారు కానీ ఏదీ చేయడం లేదని కేంద్రం తీరును విమర్శించారు. ఆనాడు రాజ్యసభలో ప్రధానమంత్రి ఏ అంశాలైతే చెప్పారో వాటన్నింటిని తూచ తప్పకుండా అమలు చేయాలన్నారు. అందులో ప్రత్యేక హోదా అంశం కూడా ఉందని గుర్తుచేశారు.

### హామీల అమలు కేంద్రం బాధ్యత

మిత్రపక్షంగా ఉన్నాం కాబట్టే ఇన్నాళ్లూ గమ్మున ఉన్నానని, లేదంటే కేంద్రంపై గట్టిగా పోరాడి ఉండేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎలాంటి ప్రయోజనాలైతే కల్పించారో అవి ఏపీకి కూడా దక్కాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో పెట్టిన హామీల్లోని అన్ని అంశాలు నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విభజన హామీలపై ఇప్పటికీ 29 సార్లు ఢిల్లీ వెళ్లినా కేంద్రం నుంచి సరైన స్పందన లేదన్నారు. తెలుగువారి ఆత్మగౌరవానికి, మనోభావాలకు సంబంధించిన విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

### మీరు ఢిల్లీకి వెళ్లి పోరాడండి

సభను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం సరికాదని బీజేపీ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు హితవు చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి చేసిన మంచి పనులు గురించి తాను అనేక సార్లు చెప్పానని, ఇప్పుడు ప్రత్యేకంగా వాటి గురించి బీజేపీ ఎమ్మెల్యేలు చెప్పాల్సిన పని లేదని పేర్కొన్నారు. విభజన చట్టంపై మీరు మాట్లాడాల్సింది ఇక్కడ కాదని, ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని అడగాలని సూచించారు. 2014 ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే.. తాను ఢిల్లీ వెళ్లి ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని, లేకపోతే ప్రమాణం చేయబోనని కేంద్రాని తెగేసి చెప్పి సాధించుకున్నామని వెల్లడించారు. అలా పోలవరం ముంపు మండలాలను తెలంగాణ నుంచి ఏపీలోకి వచ్చేలా చేశానని గుర్తు చేశారు. కాగా ఉమ్మడి రాజధాని గురించి ప్రస్తావిస్తూ.. 60ఏళ్లు హైదరాబాద్‌లో ఉన్నామని, ప్రపంచ పటంలో హైదరాబాద్ ఉందంటే దాని వెనుక తన కృషిని ఎవరూ కాదనలేరని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాను ప్రజలవైపే ఉంటానని చంద్రబాబు స్పష్టం చేశారు.

## 'అమిత్ షా' ఆటలాడుతున్నారా?

- ఇష్టం లేకుంటే చర్చలకు ఎందుకు పిలిచారు?
- స్పష్టత వచ్చే వరకూ పోరాటం: బాబు
- టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో వెల్లడి

అమరావతి, మార్చి 6 (మనం ప్రతినిధి): విభజన హామీల అమలుపై చర్చించేందుకు ఢిల్లీకి రావాలని స్వయంగా కోరిన బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సమావేశానికి ఎందుకు రాలేదని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అమిత్‌షా మనతో ఆటలాడుతున్నారా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం చంద్రబాబు.. పార్లమెంట్‌లో ఉన్న టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సోమవారం నాడు జరిగిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో జరిగిన సమావేశానికి అమిత్‌షా గైర్హాజరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పుడు ఫోన్ చేసినా అమిత్‌షా రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెబుతున్నారని, బయటకొస్తే మాత్రం తప్పించుకుని తిరుగుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. కేంద్రంతో సోమవారం జరిగిన సమావేశాల వివరాలను ఎంపీ తోట నరసింహం చంద్రబాబుకు వివరించారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్ అంశాలు సమావేశంలో అసలు చర్చకే రాలేదని, కేవలం రెండు అంశాలు మాత్రమే ప్రస్తావించి, మిగతావి వాయిదా వేశారని తెలిపారు. కేంద్రం పరిస్థితి ఇలాగే ఉంటే కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు తాను వెనుకాడబోనని స్పష్టంచేశారు. కేంద్రం ప్రత్యేక హోదాపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, ప్యాకేజీ అన్ని అంశాల్లోనూ కేంద్రం అస్పష్టంగానే ఉందని చంద్రబాబు విమర్శించారు. స్పష్టత వచ్చే వరకూ పోరాటం ఆపవద్దని ఎంపీలకు ఆయన దిశానిర్దేశం చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్నీ అంశాలు సాధించేవరకూ టీడీపీ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని, ఈ విషయాన్ని నిరసనల ద్వారా కేంద్రానికి స్పష్టంగా తెలియజేయాలని చంద్రబాబు టీడీపీ ఎంపీలకు చెప్పారు.

## గూండాలకు టీడీపీలో పదవులు

- ప్రధానిని కించపరిచేలా నిరసనలా?
- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



అమరావతి, మార్చి 6 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో టీడీపీ నేతల నిరసన ప్రదర్శనలు శ్రుతిమించుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. గూండాలు, హత్యలు చేసేవారికి టీడీపీ పదవులు ఇస్తోందని, అటువంటి వారంతా ప్రధాని మోదీని కించపరిచేలా నిరసనలు చేపట్టడం దారుణమని అన్నారు. విశాఖ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ హుందాగా నిరసన చేపట్టాల్సిందని, ప్రధాని మెడలు వంచినట్లు ప్రదర్శనలకు దిగడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రధానిని కించపరిచిన వారిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని, చంద్రబాబు వెంటనే వాసుపల్లిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రత్యేక హోదా వస్తే నిధులు కేంద్రం నుంచి వరదలా వస్తాయని ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అది నిజం కాదని బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపేందుకు ఆయన ప్రసంగించారు.



## శ్రీలంకలో మతహింస..
## ఎమర్జెన్సీ విధింపు

- కాండీలో బుద్ధులు, ముస్లింల మధ్య ఘర్షణ
- నిలువరించేందుకు పదిరోజులు ఎమర్జెన్సీ: అధికారులు

కొలంబో, మార్చి 6: శ్రీలంకలోని కాండీలో బుద్ధులు, ముస్లిముల మధ్య తీవ్రమైన ఘర్షణ నేపథ్యంలో ఆ దేశం అత్యవసర పరిస్థితి విధించింది. అల్లర్లను అదుపులోకి తెచ్చేందుకు, అవి మరింత విస్తృతం కాకుండా ఉండేందుకు అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఈ అసాధారణ నిర్ణయం తీసుకున్నారని సామాజిక సాధికారత మంత్రి ఎస్‌బీ దిస్సనాయకే మంగళవారం మీడియాకు వెల్లడించారు. పది రోజుల అనంతరం పరిస్థితులను అనుగుణంగా ఎమర్జెన్సీ మరింత కాలం పొడిగించాలా? వద్దా? అనే అంశంపై అధ్యక్షుడు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. గత ఏడాదిగా కాండీ జిల్లాలో రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. స్థానిక ముస్లింలు బలవంతంగా మత మార్పిడులకు ప్రయత్నిస్తున్నారని అక్కడి బౌద్ధ మతస్థులు ఆరోపిస్తున్నారు. అక్కడి బౌద్ధులకు చెందిన ప్రాచీనాలయాలను ధ్వంసం చేస్తున్నట్లు కూడా వాళ్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణలు తీవస్థాయికి చేరాయి. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మరోవైపు, పెద్ద సంఖ్యలో మసీదులపై కూడా దాడులు జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. అక్కడ కర్ఫ్యూ విధించారు. అయితే.. ఉద్రిక్త పరిస్థితులు దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించకుండా నిలువరించేందుకు ఎమర్జెన్సీ విధించిక తప్పలేదని ప్రభుత్వ ప్రతినిధి దయసిరి జయశేఖర వెల్లడించారు. క్యాండీలో పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించామని, ముఖ్యంగా స్పెషల్ ఎలైట్ టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపామని తెలిపారు.

## బాల్యవివాహాలు తగ్గాయి: యునిసెఫ్

న్యూఢిల్లీ, మార్చి 6: ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఓ శుభవార్త చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా బాల్యవివాహాలు తగ్గుతున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. గత దశాబ్ధంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 18 ఏండ్లు వచ్చేలోపు ప్రతి అయిదుగురిలో ఒక అమ్మాయికి పెళ్లి జరుగుతోంది. అయితే ఓ దశాబ్దం క్రితం ప్రతి అయిదురిలో నలుగురు అమ్మాయిలు 18 ఏళ్ల లోపే పెళ్లి పీటలు ఎక్కేవారు. దక్షిణ ఆసియా దేశాల్లో బాల్య వివాహాలు చాలా తగ్గు ముఖం పట్టాయని యునిసెఫ్ తన నివేదికలో స్పష్టం చేసింది. బాలికలకు ఉత్తమ విద్యను అందించడం ద్వారా భారత్‌లో బాల్యవివాహాలు తగ్గినట్లు తెలుస్తోంది. బాల్యవివాహాల వల్ల కలిగే సమస్యల గురించి కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించడం కూడా ఇందుకు కారణంగా చెప్పింది. ప్రస్తుతం ఆఫ్రికాలో బాల్యవివాహాల సమస్య అధికంగా ఉందని యునిసెఫ్ వెల్లడించింది. ఇథియోపియాలో బాల్యవివాహాలను మూడవ వంతు తగ్గించారు. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో బాల్యవివాహాల సమస్య ఎక్కువవుతున్నదని, అక్కడ జనాభా విస్ఫోటనాన్ని కుదించాల్సిన అవసరం ఉందని యునిసెఫ్ అభిప్రాయపడింది. ఆఫ్రికాలోని ప్రతి ముగ్గురు బాలికల్లో ఒకరికి బాల్య వివాహం జరుగుతున్నది. యూఎన్ సమగ్ర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 లోగా బాల్య వివాహాలను అంతంచేయాలని ప్రపంచ నేతలు గతంలో తీర్మానం చేశారు.

## అణ్వస్త్ర సన్యాసానికి సుముఖం!

- భద్రతకు హామీ ఇస్తే.. ఉత్తర కొరియా పరిశీలన

సియోల్, మార్చి 6: అణ్వస్త్ర సన్యాసానికి ఉత్తర కొరియా సిద్ధంగా ఉన్నట్లు దక్షిణ కొరియా జాతీయ భద్రతపై అధ్యక్షుడు మూన్ జే-ఇన్ సలహాదారు చుంగ్-ఈ-యాంగ్ చెప్పారు. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశం అనంతరం ఆయన ఈ మేరకు వెల్లడించారు. ''మాకు సైనికదాడుల ముప్పు ఉండదన్న హామీతోపాటు తమ ప్రభుత్వానికి భద్రత లభించిన పక్షంలో అణ్వస్త్ర నిల్వల నిర్వహణకు స్వస్తి పలకే అంశాన్ని పరిశీలిస్తాం'' అని కిమ్ చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. రక్షణ, భద్రతలకు ఢోకాలేనట్లయితే అణ్వస్త్ర కార్యక్రమాన్ని నిలిపివేసే షరతులపై చర్చలకు సంసిద్ధత తెలిపినట్లు వివరించారు. మరోవైపు వచ్చే నెలలో ఉభయ కొరియాల అధినేతల మధ్య శిఖరాగ్ర సమావేశానికి రంగం సిద్ధమైంది. తదనుగుణంగా వారిమధ్య హాట్‌లైన్‌ను పునఃప్రారంభించేందుకు అంగీకారం కుదిరిందని చుంగ్ వెల్లడించారు. అనంతరం రెండు దేశాల సరిహద్దులోని పాన్‌ముంజోమ్‌లో మూన్, కిమ్‌లు భేటీ అవుతారని తెలిపారు. కొరియాల మధ్య 1950-53నాటి ఘర్షణల తర్వాత 2000, 2007లో రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన నేపథ్యంలో వచ్చేనెల మూడోసారి అధినేతలు భేటీ కానుండటం గమనార్హం.

## మేమొస్తే హోదా ఇస్తాం


- 2019లో తొలి సంతకం అదే
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రకటన
- కేంద్రంపై ఒత్తిడి తెద్దామని పిలుపు
- ప్రత్యేక హోదా సాధనకు కృషిచేయాలి
- ఢిల్లీలో ఏపీ ఆందోళనకు సంఘీభావం



న్యూఢిల్లీ, మార్చి 6: కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్‌లో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆత్మగౌరవ సభ'కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ నేతల ఆందోళనలకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ విషయంలో తమ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. 2019లో తాము అధికారంలోకి వస్తే తొలి సంతకం ప్రత్యేక హోదా అంశంపైనేనని రాహుల్ ప్రకటించారు. విభజన హామీల సాధనకు అందరం కలిసికట్టుగా పోరాడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామంటూ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా సాధించేందుకు కృషి చేయాలన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి, పల్లంరాజు, కేవీపీ రామచంద్రరావు, సీపీఐ నేత రామకృష్ణ, సీపీఎం నాయకుడు మధు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం అమలు చేయరా ?

- ఏపీ, టీఎస్ ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు




హైదరాబాద్, మార్చి 6(మనం లీగల్ ప్రతినిధి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యా హక్కు చట్టం నిబంధనలు అమలుకాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టాన్ని ఎందుకు అమలు చేయలేకపోయారో వివరణ ఇవ్వాలని ఏపీ/టీఎస్ ప్రభుత్వాలను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు జారీ చేసింది. రెండు రాష్ట్రాల విద్యా శాఖ కార్యదర్శులు/కమిషనర్లు, కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శిలకు బెంచ్ మంగళవారం నోటీసులిచ్చింది. విద్యా హక్కు చట్టం అమలు చేయడం లేదని న్యాయశాస్త్ర విద్యార్థి తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది. ఈ చట్టం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి జిల్లా ఆత్మకూరు నుంచి నుంచి తిప్పారెడ్డి రాసిన లేఖను కూడా హైకోర్టు పిల్‌గా పరిగణించి రెండు వ్యాజ్యాలపై బెంచ్ విచారణ చేపట్టింది. విద్యా హక్కు చట్టం వచ్చి పదేళ్లు అయినా నేటికీ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని బెంచ్ ఏపీ, తెలంగాణలను ఆదేశించింది. ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే చట్ట నిబంధన అమలు జరగడం లేదు. ప్రైవేటు పాఠశాలలు వసూలు చేసే ఫీజులు వివరాలు విద్యాధికారి వద్ద ఉండడం లేదు. పేదలకు ప్రాథమిక విద్యలో ఫీజు రీయింబ్స్‌మెంట్ ఇవ్వడం లేదు. ఉన్నత విద్యకు మాత్రమే ప్రభుత్వాలు ఇస్తున్నాయి. దీని వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతాయి. చట్టం అమలు జరిగేలా హైకోర్టు చర్యలు తీసుకోవాలి అని యోగేష్ వాదించారు. ఈ చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పడిపోయి, ప్రభుత్వ పాఠశాలలు మూతపడతాయని ఏపీ ప్రభుత్వ లాయర్ చెప్పారు. విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

## హోదా పోరు.. హోరు

- ఉభయసభలలో దద్దరిల్లిన నినాదాలు
- ప్రత్యేక హోదా కావాలన్న ఏపీ ఎంపీలు
- పార్లమెంటు లోపల.. వెలుపల నిరసన
- సమస్యలపై సభలో ప్లకార్డుల ప్రదర్శన
- రాజ్యసభ చైర్మన్ వెంకయ్య మండిపాటు
- వెల్‌లోకి రావద్దంటూ తీవ్ర అభ్యంతరం
- ఎన్టీఆర్ వేషంలో ఎంపీ శివప్రసాద్





న్యూఢిల్లీ, మార్చి 6: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రెండోరోజు మంగళవారం కూడా ఏపీకి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ ఉభయసభల్లో నిరసనలు హోరెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై టీడీపీ, కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల పోరు కొనసాగుతోంది. పార్లమెంట్ బయట, లోపల కూడా ఈ మూడు పార్టీలు తమ పోరాటాన్ని ఉధృతం చేశాయి. హోదాపై చర్చించాలంటూ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మంగళవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. మరోవైపు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద వైఎస్ఆర్ సీపీ ఎంపీలు, గాంధీ విగ్రహం వద్ద టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇక ఏపీకి చెందిన ఎంపీలంతా లోక్‌సభ, రాజ్యసభల్లో హోదా డిమాండ్‌ను ప్రస్తావిస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగిలారు. హోదాతో పాటు విభజన సమస్యల పరిష్కారం కోరుతూ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించారు.

### వెంకయ్య తీవ్ర ఆగ్రహం

రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు నిరసన తెలుపుతున్న సభ్యులపై మండిపడ్డారు. సభ్యులు వెల్‌లోకి రావద్దని, ప్లకార్డులు ప్రదర్శించవద్దని అభ్యంతరం తెలిపారు. పార్లమెంట్‌ను మీరు దేశప్రజల ముందు చులకన చేసేలా వ్యవహరిస్తున్నారని ఏపీ సభ్యులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. సభ్యుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మధ్యాహ్నం రెండు గంటల వరకు సభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత తిరిగి సమావేశమయ్యాక కూడా పరిస్థితి చక్కబడకపోవడంతో సభను బుధవారానికి వాయిదావేశారు. మరోవైపు లోక్‌సభలో హోదాతో పాటు పీఎన్‌బీ బ్యాంకింగ్ స్కాంపై కాంగ్రెస్ నేతృత్వంలో విపక్ష సభ్యుల ఆందోళనతో సభ హోరెత్తింది.

### ఎన్టీఆరే దిగి వచ్చారా?

ఎప్పుడూ వినూత్న వేషధారణలో నిరసన తెలిపే చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మంగళవారం దివంగత నేత ఎన్టీఆర్ వేషంతో ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ తన ఒంట్లోకి వచ్చినట్లుగా శివప్రసాద్ ఇలా మాట్లాడారు. ''చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి కలవోడా.. నా ఎంపీలంతా గాంధీ విగ్రహం దగ్గర నిరసనకు తెలియజేసే పరిస్థితికి తీసుకొచ్చారా మోదీగారూ..! ఎంత అక్రమం, ఎంత అధర్మం, ఎంత అన్యాయం, ఎంత అహంభావం. వెంకన్న సాక్షిగా ఇచ్చిన ప్రమాణాలు మరిచిపోయారా..!. బెజవాడ కనకదుర్గమ్మ సాక్షిగా ఢిల్లీ కంటే గొప్పగా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారే.. ఆ విషయాన్ని మరిచిపోయారా..! ఒక నాడు ఇందిరాగాంధీగారు పదవీచ్యుతుడ్ని చేసినప్పుడు ప్రజలంతా ఎలా ఆగ్రహించారో.. ఉద్యమించారో మీకు తెలియదా. తిరిగి నన్ను కుర్చీలో కూర్చోబెట్టే వరకు జనాలు ఊరుకోలేదు. తెలుగువాడి దెబ్బ మీరూ రుచిచూస్తారా మోదీ గారూ? మీకు అలా ఆశ ఉంటే నేనేమీ చేయలేను. తప్పులను సరిదిద్దుకుని వెంటనే విభజన హామీలు నెరవేర్చండి. లేకుంటే (హ..హ..హ..హ..) తెలుగువాడి దెబ్బ మీగు పడుతుంది.. జాగ్రత్త జాగ్రత్త!'' అని ఆయన చెప్పుకొచ్చారు.

## మా ప్రాణాలకు హాని

- పాలకులే కుట్రలు చేస్తున్నారు
- త్వరలో ఆధారాలు వెల్లడిస్తా: మంద కృష్ణ
- ఎస్సీ వర్గీకరణకు పూర్తి మద్దతు: చెరుకు

హైదరాబాద్, మార్చి 6(మనం ప్రతినిధి): ''మాకు ప్రాణహాని ఉంది. కంచె చేను మేసేవిధంగా ప్రాణాలు కాపాడే పాలకులే ప్రాణాలను హరించేందుకు కుట్ర పన్నుతున్నారు''అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్‌తో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎపిసోడ్‌ల మాదిరిగా ఆ కుట్రలు చేసిన వారిని ఆధారాలతో సహా బయటపెడతామన్నారు. ఎస్సీ వర్గీకరణకు 24 ఏండ్లుగా పోరాడుతున్నామని, మార్చి 13న తలపెట్టిన 24 గంటల బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. మేం నిరసన తెలిపిన ప్రతిసారి రాజకీయ పార్టీలు స్పందిస్తున్నాయని, కానీ ఎక్కడ సరమో అక్కడ మౌనంగా ఉంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు వర్గీకరణకు సహకరించలేదని, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి అధికార పార్టీపై ఒత్తిడి తేవడం లేదని తెలిపారు. చెరుకు సుధాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు థర్డ్ ఫ్రంట్ అంశాన్ని తెర పైకి తెచ్చారన్నారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం రాత్రికి రాత్రే ఇతర రాష్ట్రాల నేతలకు ఫోన్ చేసిన కేసీఆర్.. వర్గీకరణకు ఎందుకు చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే జరగబోయే అసెంబ్లీలో తీర్మానం చేసి వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయమైన ప్రగతి భవన్‌లో పీఎం అని ప్రకటించుకోవడం, జై కొట్టించుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ బంద్ బంద్‌ను విజయవంతం చేస్తామన్నారు.

## భారతీయ 'ఝూటా' పార్టీ

- ఆ పార్టీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు: కర్నె



హైదరాబాద్, మార్చి6 (మనం ప్రతినిధి): దేశాన్ని ఏలుతున్న బీజేపీ..ఇచ్చిన హామీలకు ఎగనామం పెడుతున్న తీరు చూస్తుంటే అది భారతీయ ఝూటా పార్టీగా మారిపోయిందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు స్వయంగా అబద్ధాలు చెప్పారని, వాటిని సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారని గుర్తు చేశారు. మంగళవారం టీఆర్ఎస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్..ప్రధాని మోదీని అనని పదాన్ని ఏదో అన్నట్టుగా బీజేపీ చిల్లర రాజకీయం చేస్తోందన్నారు. బీజేపీ నేతలు ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరి చిల్లర చేష్టలు చేశారన్నారు. బీజేపీ మతం పేరిట రాజకీయాలు చేసే పార్టీయని, మతం పేరిట మారణ హోమం చేసింది బీజేపీ కాదా ? అని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం మిగతా రాష్ట్రాల కంటే భిన్నంగా శరవేగంతో అభివృద్ధి చెందుతుండటంతో బీజేపీ కాళ్ల కింద భూమి కదలిపోతోందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠ అంతకంతకూ పెరిగుతుండటం బీజేపీకి కడుపుమంటగా ఉందని అన్నారు. మోదీ వస్తే 'అచ్చే దిన్' వస్తాయని అన్నారని, కానీ అందుందుకు విరుద్ధంగా రాష్ట్రానికి 'చచ్చే దిన్'లు వచ్చాయని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడంలేదని ఆయన ప్రశ్నించారు? బీజేపీ క్షుద్ర రాజకీయాలు తెలంగాణలో చెల్లబోవని పేర్కొన్నారు. మాయ మాటలు జిమ్మిక్కులు చేసి అధికారంలోకి రావాలని బీజేపీ పగటి కలలు కంటోందని ఎద్దేవా చేశారు. బాగా పనిచేస్తున్న తమ పార్టీతో సహా ఇతర సీఎంలను బీజేపీ బ్లాక్ మెయిల్ చేస్తోందన్నారు. బీసీ నేత దత్తాత్రేయను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించిమతెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీని ప్రజలు ఎలా మరిచిపోతారని ప్రశ్నించారు.

## సెన్సెక్స్ | మార్చి 6 2018




| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| ఇండస్ఇండ్ | 1.21 | సన్ ఫార్మా | -2.95 |
| టాటా స్టీల్ | 0.79 | ఎస్‌బీఐ | -2.77 |
| హీరో మోటార్ | 0.35 | ఐసీఐసీఐ బ్యాంకు | -2.64 |
| కోల్ ఇండియా | 0.31 | ఎం అండ్ ఎం | -2.52 |
| | | బీహెచ్ఈఎల్ | -2.27 |

## నిఫ్టీ | మార్చి 6 2018




| పెరిగినవి | % | తగ్గినవి | % |
|---|---|---|---|
| బీపీసీఎల్ | 2.51 | సన్ ఫార్మా | -3.06 |
| జీ ఎంటర్‌టైన్‌మెంట్ | 1.39 | ఐసీఐసీఐ బ్యాంకు | -2.74 |
| అల్ట్రాటెక్ | 1.34 | ఎం అండ్ ఎం | -2.66 |
| ఇండస్ఇండ్ | 1.25 | ఎస్‌బీఐ | -2.64 |
| అరబిందో | 0.91 | యు.పి.ఎల్ | -2.57 |


## టాప్ లూజర్స్ | 6 మార్చి

33,317.20

| పాయింట్లు | బి.ఎస్.ఇ సెన్సెక్స్ | % |
|---|---|---|
| 531.70 | సన్ ఫార్మా | -2.95% |
| 256.50 | ఎస్‌బీఐ | -2.77% |
| 295.10 | ఐసీఐసీఐ బ్యాంకు | -2.64% |
| 720.35 | ఎం అండ్ ఎం | -2.52% |
| 8618.65 | మారుతి సుజుకి | -2.05% |
| 3049.80 | టీసీఎస్ | -1.76% |
| 413.85 | భారతీ ఎయిర్‌టెల్ | -1.75% |
| 1762.05 | హెచ్‌డీఎఫ్‌సీ | -1.59% |
| 346.60 | టాటా మోటార్స్ | -1.58% |
| 1082.10 | కోటక్ మహీంద్రా | -1.53% |

-429.58

## బులియన్ | గత 7 రోజులు




## రూపాయి వర్సెస్ డాలర్






# బ్యాంకింగ్ దెబ్బకు కుదేలైన మార్కెట్లు

**సెన్సెక్స్ 430 పాయింట్లు కోల్పోగా, నిఫ్టీ 100కుపైగా పాయింట్లు నష్టపోయింది**

ముంబయి: భారతీయ ఈక్విటీలు మంగళవారం పేక మేడలా కుప్పకూలాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' సుమారు 430 పాయింట్లు కోల్పోయి దాదాపు మూడు వారాల కనిష్ఠ స్థాయి 33,317 వద్ద ముగిసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) మోసం వ్యవహారంలో ఇతర రుణ దాతలను కూడా వివరాలు ఇవ్వాలని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్.ఎఫ్.ఐ.ఓ) ఆదేశించిందని వార్తలు రావడంతో, ట్రేడింగ్ చివరలో బ్యాంకింగ్ రంగ షేర్లు అపారంగా అమ్మకానికి వచ్చాయి. 'సెన్సెక్స్' ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం డిసెంబరు 14 తర్వాత ఇదే మొదటిసారి. 'సెన్సెక్స్' డిసెంబరు 14న 33,246.70 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే, 'సెన్సెక్స్' ఒకే రోజున ఇంత పెద్ద సంఖ్యలో ఇన్ని పాయింట్లు కోల్పోవడం ఫిబ్రవరి 6 తర్వాత ఇదే మొదటిసారి. ఫిబ్రవరి 6న 'సెన్సెక్స్' 561.22 పాయింట్లు కోల్పోయింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు సూత్రధారులుగా ఉన్న రూ. 12,000 కోట్ల పి.ఎన్.బి కుంభకోణంపై జరుపుతున్న దర్యాప్తులో సాయపడేందుకు ఇతర బ్యాంకులను కూడా ఎస్.ఎఫ్.ఐ.ఓ వివరాలు కోరడంతో మదుపరుల సెంటిమెంట్ బలహీనపడింది. అది నీరవ్, మెహుల్ ప్రమోట్ చేసిన సంస్థలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించిన 31 బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను తన కార్యాలయానికి రావలసిందిగా ఆదేశించింది. వివిధ నియమాలు ఉల్లంఘించిన యాక్సిస్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులకు వరుసుగా రూ. 3 కోట్లు, రూ. 2 కోట్లు జరిమానా విధిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) సోమవారం వెల్లడించడంతో బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. 'సెన్సెక్స్' 34,047.43 పాయింట్ల వద్ద మంగళవారం బలమైన స్థితిలోనే మొదలైంది. ఆసియాలోని ఇతర మార్కెట్ల నుంచి వచ్చిన దృఢమైన ధోరణి సంకేతాలతో 34,060.13 పాయింట్ల అధిక స్థితికి వెళ్ళింది. మెరుగుపడిన స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో 33,209.76 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. చివరకు 429.58 పాయింట్ల నష్టంతో 33,317.20 పాయింట్ల వద్ద ముగిసింది. గత ఐదు సెషన్లలో 'సెన్సెక్స్' దాదాపు 1129 పాయింట్లు కోల్పోయింది.

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' ట్రేడింగ్ ఆరంభంలో 10,400 పాయింట్ల గౌరవ స్థాయిని తిరిగి అందుకుని 10,441.35 పాయింట్ల అధిక స్థితికి వెళ్ళింది. తర్వాత, ప్రతికూల మండలంలోకి జారుకుని 10,215.90 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. చివరకు గణనీయంగా 109.60 పాయింట్ల నష్టాన్ని చవి చూసి 10,249.25 పాయింట్ల వద్ద ముగిసింది.

## పెరుగుతున్న ముడి చమురు ధరలు

ముడి చమురు ధరలు వరుసగా ఐదవ రోజు కూడా పెరిగాయి. డిమాండ్ బలంగా ఉందనే ఊహాగానాలు ధరల పెరుగుదలకు కొంత ఊతమిచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణంగా భావించే బ్రెంట్ క్రూడ్ పీపా ధర ఫ్యూచర్లలో 65.60 డాలర్లకు పెరిగింది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర ఫ్యూచర్లలో పీపాకు 62.68 డాలర్లకు పెరిగింది.

## చమురు దిగుమతి
# చైనా-భారత్‌లదే పెద్ద వాటా



న్యూఢిల్లీ: చమురును అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో అమెరికా స్థానాన్ని చైనా, భారత్‌లు భర్తీ చేస్తూండడంతో ప్రపంచ చమురు వర్తక మార్గాలు తూర్పు దిశగా సాగుతున్నాయని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజన్సీ (ఐ.ఇ.ఎ) పేర్కొంది. ఈ సంస్థకు చెందిన ఆయిల్ 2018 నివేదిక ప్రకారం, ప్రపంచ చమురు వాణిజ్య మార్గాలు తూర్పు దిశగా కదులుతున్నాయి. ఐదేళ్ళ మార్కెట్ విశ్లేషణ, అంచనాతో కూడిన ఈ నివేదిక, అమెరికాలో ముడి చమురు ఉత్పాదన వేగంగా పెరిగిన నేపథ్యంలో ముడి చమురు నాణ్యతకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించింది. అమెరికాలో అధిక ఉత్పాదనతో వర్తక ప్రవాహాలు మారుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు శుద్ధి సామర్థ్య మిగులు పెరుగుతోంది. అమెరికా, బ్రెజిల్, కెనడా, నార్వేలలో ముడి చమురు ఉత్పాదనలో వృద్ధి వల్ల ప్రపంచంలో చమురు సరఫరాకు లోటు ఉండదని అంచనా. ప్రపంచంలో చమురు డిమాండ్‌ను 2020 ఏడాది పూర్తయ్యే వరకు తీర్చే శక్తి ఈ సరఫరాలకు ఉందని భావిస్తున్నారు. కానీ, ఆ తర్వాత ఉత్పాదనను పెంచుకునేందుకు ఎక్కువ పెట్టుబడి అవసరమవుతుంది. వచ్చే మూడేళ్ళలో ఒక్క అమెరికాలో పెరిగిన ఉత్పాదనతోనే, ప్రపంచ డిమాండ్ వృద్ధిలో 80 శాతం తీర్చవచ్చు. మిగిలిన ఇరవై శాతం డిమాండ్‌ను కెనడా, బ్రెజిల్, నార్వేలు తీరుస్తాయి. సరఫరాలో వృద్ధిని పెంచేందుకు 2020 తర్వాత అదనపు పెట్టుబడులు అవసరమవుతాయి. చమురు పరిశ్రమ 2015-16 సంవత్సరంలో పెట్టుబడుల్లో అసాధారణ లోటును చవి చూసింది. 2017లోను, 2018లోను కూడా అమెరికా బయట ముడి చమురు ఉత్పాదనపై వ్యయం ఉండకపోవచ్చని, ఉన్నా నామమాత్రమేనని ఐ.ఇ.ఎ అంచనా. ''వచ్చే ఐదేళ్ళలో గ్లోబల్ ఆయిల్ మార్కెట్లపై అమెరికా తన ముద్రను వేయనుంది'' అని ఐ.ఇ.ఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫెయిత్ బిరోల్ చెప్పారు. ''కానీ, మేం పదేపదే ప్రముఖంగా చెబుతూ వస్తున్నట్లుగా, అంతర్జాతీయంగా బలహీనంగా ఉన్న పెట్టుబడుల దృశ్యం ఆందోళన కారకంగానే ఉంది. తరిగిపోతున్న చమురు క్షేత్రాల లోటును భర్తీ చేసుకునేందుకు మరిన్ని పెట్టుబడులు అవసరమవుతాయి. ఏటా రోజుకు 30 లక్షల పీపాల చమురు (ఈ పరిమాణం ఉత్తర సముద్రంతో సమానం) తరిగిపోతోంది. ప్రపంచం దాన్ని భర్తీ చేసుకోవాలి. బలంగా ఉన్న డిమాండ్ వృద్ధిని తట్టుకునేందుకు కూడా సరఫరాలు చూసుకోవాలి'' అని ఆయన అన్నారు.

## పాస్‌పోర్ట్ వివరాలు సేకరించండి

న్యూఢిల్లీ: రూ. 50 కోట్లకు మించి రుణాలు తీసుకున్న వారందరి పాస్‌పోర్ట్ వివరాలను 45 రోజుల లోపు సేకరించవలసిందిగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదేశించింది. నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా మాదిరిగా మోసాలకు, ఆర్థిక నేరాలకు పాల్పడినవారు దేశం విడిచి పారిపోకుండా నివారించే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నారు. రుణగ్రస్తునికి పాస్‌పోర్ట్ లేకపోతే, లేదని వెల్లడిస్తున్న ప్రకటనను బ్యాంకులు సదరు రుణగ్రస్తుని నుంచి స్వీకరించవలసి ఉంటుంది. రుణగ్రస్తుల పాస్‌పోర్ట్ వివరాలు కూడా పొందుపరచే విధంగా రుణ దరఖాస్తు పత్రంలో తగిన మార్పులు చేయనున్నారు. సకాలంలో చర్య తీసుకునేందుకు, మోసగాళ్ళు దేశం నుంచి పరారవకుండా నివారించేందుకు పాస్‌పోర్ట్ వివరాలు బ్యాంకులకు సహాయపడతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలవారు తెలిపారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల బిల్లుకు కేంద్ర మంత్రివర్గం గత వారం ఆమోదం తెలిపింది. వారికి చెందిన ఆస్తులన్నింటినీ జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ బిల్లు అధికారులకు కట్టబెడుతోంది. రూ. 100 కోట్లు అంతకుమించి రుణం తీసుకుని దేశం నుంచి పరారైన ఎగవేతదార్లకు ఈ బిల్లు వర్తిస్తుంది. రూ. 250 కోట్లు మించిన రుణాలను పరిశీలిస్తూ, రుణ ఒప్పందంలోని అంశాల్లో ఏది ఉల్లంఘనకు గురైనా వెంటనే ఎర్ర జెండా ఊపవలసిందిగా ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులకు సూచించింది. ఆడిటర్లకు స్వతంత్ర నియంత్రణ సంస్థగా నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ ఏర్పాటుకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## అమెరికా నుంచి ఎల్.ఎన్.జి దిగుమతి



న్యూఢిల్లీ: అమెరికా నుంచి ముడి చమరు తర్వాత, లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్.ఎన్.జి)ని కూడా భారతదేశం దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. ఇరవై ఏళ్ళ ఒప్పందం కింద ఎల్.ఎన్.జి నింపుకొన్న మొదటి నౌక లూసియానా నుంచి బయలుదేరింది. ప్రభుత్వ యాజమాన్యంలోని గ్యాస్ ఉపయుక్తి సంస్థ గెయిల్ ఇండియా ఏడాదికి 3.5 మిలియన్ టన్నుల ఎల్.ఎన్.జి పొందేట్లుగా షినిరె ఎనర్జీ సంస్థతో కాంట్రాక్టు కుదుర్చుకుంది. షినిరె సంస్థకు లూసియానాలో శాబైన్ పాస్ లిక్విఫాక్షన్ సదుపాయం ఉంది. గెయిల్‌కు చెందిన మొదటి చార్టర్డ్ ఎల్.ఎన్.జి నౌక 'మెరిడియన్ స్పిరిట్' ఈ నెల 28కి భారతదేశం చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇది మహారాష్ట్రలోని దభోల్ టెర్మినల్‌కు చేరుతుంది. అమెరికా నుంచి ముడి చమురును మనం గత అక్టోబరులో దిగుమతి చేసుకున్నాం. భారతదేశానికి చమురు ఎగుమతులను అమెరికా 1975లో నిలిపివేసింది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా 2015లో ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. గెయిల్ అమెరికాకు చెందిన ఎల్.ఎన్.జి ఎగుమతి సంస్థ షినిరె ఎనర్జీతో కొనుగోలు ఒప్పందంపై 2011 డిసెంబరులో సంతకాలు చేసింది. ఈ ఒప్పందం 2018 మార్చి 1 నుంచి అమలులోకి వచ్చింది. షినిరె సి.ఇ.ఓ జాక్ ఫస్కో, గెయిల్ ఛైర్మన్ బి.సి. త్రిపాఠీల సమక్షంలో శాబైన్ కనుమ వద్ద ఎల్.ఎన్.జి నౌక పయనం మొదలైంది. షినిరె ఎనర్జీ సంస్థ టెక్సాస్ సమీపంలోని కార్పస్ క్రిస్టీ వద్ద రెండవ లిక్విఫ్యాక్షన్ సదుపాయాన్ని నిర్మిస్తోంది. లూసియానాలోని సదుపాయం కూడా కొంత నిర్మాణంలో ఉంది. ఆ రెండూ పూర్తయితే ప్రపంచంలోని 5 అగ్ర ఎల్.ఎన్.జి సరఫరా సంస్థల్లో షినిరె ఒకటిగా అవతరిస్తుంది.

## మార్కెట్లకు కొత్త పసుపు



ఈరోడ్: మార్కెట్లకు కొత్త పసుపు రాక పెరిగింది. కానీ, కొనుగోలుదార్లు తగ్గించిన ధరలు కోట్ చేస్తున్నారు. కొత్త పసుపు 2000 బస్తాలతో సహా మొత్తం 3,200 బస్తాలు అమ్మకానికి వచ్చాయని వర్తకుడొకరు చెప్పారు. పసుపు ఫ్యూచర్లలో పసుపు ధర తగ్గుతూ వస్తోంది. ఈ ధర సోమవారంనాడు నిలకడగా ఉంది. మేలిమి రకంగా చెప్పే సేలం పసుపు సుమారు 50 బస్తాలు సోమవారం మార్కెట్‌కు వచ్చింది. ఈరోడ్ పసుపు వర్తకుల సంఘం అమ్మకాల యార్డులో అది క్వింటాల్‌కు రూ. 8,999 పలికింది. స్థానిక పసుపు కొమ్ముల ధర క్వింటాల్‌కు రూ. 500, పసుపు గడ్డల ధర క్వింటాల్‌కు రూ. 200 తగ్గాయి. నియంత్రిత మార్కెటింగ్ కమిటీలో స్థానిక పసుపు ( కొమ్ముల రకం) ధర క్వింటాల్‌కు దాదాపు రూ. 900, గడ్డల రకం ధర క్వింటాల్‌కు రూ. 1000 తగ్గాయి. ఈరోడ్ పసుపు వర్తకుల సంఘం అమ్మకాల యార్డులో పసుపు కొమ్ములు క్వింటాల్ రూ. 5,566 నుంచి రూ. 8,999, గడ్డల రకం క్వింటాల్‌కు రూ. 5,050 నుంచి రూ. 8,023 వరకు అమ్ముడుపోయాయి. మార్కెట్‌కు వచ్చిన 2,960 బస్తాల్లో 1409 బస్తాలు అమ్ముడుపోయాయి. నియంత్రిత మార్కెటింగ్ కమిటీలో పసుపు కొమ్ములు క్వింటాల్ రూ. 5,369 నుంచి రూ. 6,455 వరకు అమ్ముడుపోయాయి. పసుపు గడ్డలు క్వింటాల్‌కు రూ. 5,229 నుంచి రూ. 6,299 వరకు ధర పలికాయి. అమ్మకానికి వచ్చిన 202 బస్తాల్లో 146 బస్తాలు అమ్ముడుపోయాయి. ఈరోడ్ సహకార మార్కెటింగ్ సొసైటీలో పసుపు కొమ్ములు క్వింటాల్ రూ. 6,499 నుంచి రూ. 8,469 ధర పలికాయి. పసుపు గడ్డలు క్వింటాల్‌కు రూ. 6,229 నుంచి రూ. 7,200 ధర పలికాయి. అమ్మకానికి వచ్చిన 308 బస్తాల్లో 230 బస్తాలు అమ్ముడయ్యాయి.

## నెలాఖరులోగా భూషణ్ స్టీల్
# పరిష్కారం ఖరారు

న్యూఢిల్లీ: దివాలా ప్రొసీడింగులు ఎదుర్కొంటున్న భూషణ్ పవర్ అండ్ స్టీల్ పరిష్కార ప్రణాళిక ఈ నెలలో తుది రూపు సంతరించుకునే అవకాశం ఉందని తాత్కాలిక పరిష్కార వృత్తినిపుణుడు (ఐ.ఆర్.పి) మహేందర్ కుమార్ ఖండేల్‌వాల్ చెప్పారు. బెల్జియం ప్రధాన కేంద్రంగా ఉన్న అకౌంటింగ్, సలహా సంస్థ బి.డి.ఓకి భారతీయ విభాగమైన బి.డి.ఓ ఇండియా నుంచి ఆయన జనవరిలో వైదొలగి దాని ప్రత్యర్థి సంస్థ ప్రైస్ వాటర్ కూపర్‌లో చేరారు. దీనికి సంబంధించి ఖండేల్‌వాల్‌పై మధ్యవర్తిత్వ ప్రొసీడింగులు చేపట్టేందుకు బి.డి.ఓ ఇండియా ఇటీవల బాంబే హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆయన నుంచి ఆ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ''భూషణ్ పబవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ పరిష్కార ప్రణాళికలు ఇప్పటికే ప్రక్రియలో ఉన్నాయి. అవి 2018 మార్చి లోపల ఖరారు కావచ్చు'' అని ఖండేల్‌వాల్ తెలిపారు. కంపెనీకి ఆయన ఐ.ఆర్.పిగా ఉన్నారు. ''మహేందర్ ఖండేల్‌వాల్‌ను నిలువరించవలసిందిగా మేం పెట్టుకున్న అభ్యర్థనకు సంబంధించిన అంశాలపై మాట్లాడడం కోర్టు ఉల్లంఘన కిందకు వస్తుంది. కానీ, మేం కోర్టుకెక్కడానికి ప్రధాన కారణాన్ని వివరిస్తాను. ఖండేల్‌వాల్ అభిలషించిన నిష్క్రమణ భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్, ఎడ్యుకాంప్ సొల్యూషన్స్ లిమిటెడ్‌ల పరిష్కార వృత్తి నిపుణునిగా ఆయన తీసుకోవలసిన నిర్ణయాలు ఎంతో తారుమారయ్యే అవకాశం ఉంది'' అని బి.డి.ఓ ఎల్ఎల్‌పి మేనేజింగ్ పార్ట్‌నర్ మిళింద్ కొఠారీ చెప్పారు. ''దివాలా (పరిష్కార) వృత్తినిపుణులుగా మాకున్న పేరును దెబ్బతీసేందుకే వారు కోర్టుకెక్కారు'' అని ఖండేల్‌వాల్ అన్నారు. ప్రత్యర్థి సంస్థలో చేరడం వల్ల అసూయతో పాత సంస్థ అలా చేసిందని ఆయన వ్యాఖ్యానించారు.

# భారత్‌పై దృష్టి పెట్టిన ఫెరీరో



ముంబయి: నెస్లేకు చెందిన అమెరికా తీపి సరుకుల వ్యాపారాన్ని ఇటీవల స్వాధీనం చేసుకున్న ఫెరీరో సంస్థ ఇండియాలో విలీనాలు, స్వాధీనాలకు ఉన్న అవకాశాన్ని తోసిపుచ్చడం లేదు. భారతదేశంలో ఫెరీరో ఇండియా 2008 నుంచి ఉన్నప్పటికీ, మాండిలెజ్‌తో పోలిస్తే గణనీయమైన వాటా చేజిక్కించుకోలేకపోయింది. దేశంలో చాకలేట్ల మార్కెట్‌లో 65 శాతం వాటాతో మాండిలెజ్ ప్రాబల్యం వహిస్తోంది. ''గతంలో వృద్ధి ఉత్పత్తుల ను పెంచుకోవడం, వినియోగదార్ల పునాదిని విస్తరించుకోవడం లేదా కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడం వంటివాటి ద్వారా ఉండేది. కానీ, గత రెండేళ్ళలో, ఫెరీరో గ్రూప్ వివిధ దేశాలలో కొన్ని కంపెనీలను స్వాధీనం చేసుకుంది. గ్రూప్ ప్రస్తుతం విలీనాలు, స్వాధీనాల ద్వారా వృద్ధిని సాధించేందుకు కూడా సిద్ధం గా ఉంది. ఇది మా భౌగోళిక ప్రాంతాలకు కూడా వర్తించవచ్చు '' అని ఫెరీరో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ స్టిఫానో పీలే చెప్పారు.

### భారతదేశంపై ప్రభావం

ఇటీవలి స్వాధీనంతో అంతర్జాతీయంగా 1200 కోట్ల డాలర్లకు పైగా అమ్మకాలతో ప్రపంచంలో చాకలేట్/బిళ్ళలు వంటి తీపి సరుకుల మార్కెట్‌లో ఫెరీరో మూడవ అతి పెద్ద కంపెనీగా ఉంది. కానీ, నెస్లే కన్ఫెక్షనరీ పోర్ట్‌ఫోలియోలో చాలా భాగం సరుకులు ఇండియాలో లేవు కనుక, ఇండియాలో ఫెరీరో ప్రభావం ఉపేక్షించతగినదిగానే ఉంటుందని భావిస్తున్నారు. ''అటువంటి స్వాధీనాల వల్ల భారతీయ వ్యాపారంపై ఉండగల నిర్దిష్ట ప్రభావం గురించి ఇప్పుడు ఏం మాట్లాడినా తొందరపాటు అవుతుంది. ప్రస్తుతం అమెరికన్ మార్కెట్ లోపల మాత్రమే నెస్లే కన్ఫెక్షనరీ వ్యాపారాన్ని ఫెరీరో స్వాధీనం చేసుకుంది. ఈ మార్కెట్‌లో మొత్తంమీద అడుగు జాడను పెంచుకునేందుకు ఇది సహాయపడుతుంది'' అని ఆయన అన్నారు.

### రిటైలింగ్

అయితే, సింగిల్ బ్రాండ్ రిటైలింగ్ విషయంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్.డి.ఐ)లకు సంబంధించి సడలించిన నిబంధనలను అవకాశంగా తీసుకునే పథకాలేవీ ప్రస్తుతానికి ఫెరీరోకు లేవు. ''ఇండియాలో రిటైలింగ్‌లోకి దిగాలనే తక్షణ ఆసక్తి మాకు ఏమీ లేదు. కొద్దిపాటి మినహాయింపులను తప్పిస్తే, భారతదేశంలో రిటైలింగ్‌కన్నా వస్తూత్పత్తి, అమ్మకాలకే మేం ప్రాధాన్యం ఇస్తాం'' అని ఆయన చెప్పారు.

కిండర్ జాయ్, టిక్ టాక్ వంటి కొన్ని ప్రసిద్ధ బ్రాండ్లను అది స్థానికంగానే తయారు చేస్తోంది. ప్రధాన ఉత్పత్తి అయిన ఫెరీరో రోషర్ ను మాత్రం సుంకాలు అధికంగా పడినా దిగుమతి చేసుకోవడాన్ని కొనసాగిస్తోంది. ''ఫెరీరో రోషర్‌ను దిగుమతి చేసుకుని ఇండియాలో రీ-ప్యాకేజ్ చేస్తున్నాం. దాన్ని స్థానికంగా ఉత్పత్తి చేసే పథకాలు తక్షణ భవిష్యత్తులో ఏమీ లేవు'' అని ఆయన అన్నారు.

ఇండియాలో అత్యధికంగా అమ్ముడవుతున్న దాని ఉత్పత్తులలో కిండర్ జాయ్, దాని బొమ్మలను పుణే సమీపంలోని బారామతి ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు. నిజానికి, కిండర్ జాయ్ బొమ్మల తయారీకి భారతదేశం రెండవ అతి పెద్ద కేంద్రంగా అవతరించింది. వాటిని ఇతర మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు కూడా బారామతిలో ఉన్న సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు.

చాకలేట్ స్ప్రెడ్ కేటగిరీలో 90 శాతం వాటాతో ప్రాబల్యం వహిస్తున్న మరో దిగుమతి బ్రాండ్ నుటెల్లా. కానీ, మరో బహుళ జాతి కంపెనీ హెర్షే కూడా రంగంలోకి దిగుతోంది. ఇంతవరకు ప్రీమియం సంస్థగా ఉన్న ఫెరీరో ఇప్పుడు తన పోర్ట్‌ఫోలియోను హేతుబద్ధీకరించుకునే అంశాన్ని పరిశీలిస్తోంది. ''ఇంతవరకు మేం నుటెల్లా, టిక్ టాక్ వంటి బ్రాండ్లతో ప్రీమియం విభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. కానీ, భవిష్యత్తులో మేం, తగిన ఉత్పత్తులు, ఫార్మాట్లతో మార్కెట్లోకి మరింతగా చొచ్చుకుపోయే వ్యూహాన్ని అనుసరించవచ్చు'' అని ఆయన చెప్పారు. చాకలేట్, బిళ్ళలు వంటి తీపి సరుకులకు ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఇండియా ఒకటి. ఇక్కడ నాయకత్వ స్థానంలో లేకపోయినప్పటికీ భారతీయ మార్కెట్ పట్ల ఫెరీరో ఆశాభావంతో ఉంది.

# మనం వికాస్

బుధవారం 7 మార్చి 2018

www.manamnews.com




# కెరియర్‌కు మెంటర్‌షిప్

కొండంత సిలబస్, పరీక్షలూ, అసైన్‌మెంట్లూ చూసి.. తగిని కోర్సు ఎంచుకున్నాం, దాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన అర్హతలు తమకు లేవేమోననీ కొందరు దిగాలు పడుతుం టారు. మరికొందరు... ఉద్యోగాన్వేషణ ఏ దిశలో సాగించాలో తెలియక తికమకపడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి పక్కన మెంటర్ ఉంటే.. సులువైన పరిష్కారాలు ఇట్టే లభిస్తాయి. భవితను మల్చుకోవటంలో అద్భుత సహకారం అందించే ఈ మెంటర్‌షిప్ గురించి తెలుసుకుందాం!

## ముందడుగు ఎలా వేయాలి?

కుటుంబ సభ్యులు, సీనియర్లు, కళాశాల అధ్యాపకులు.. ఇలా ఎవరైనా మెంటర్ కావొచ్చు. సాధారణంగా వీళ్లు విద్య, వృత్తిపరంగా పురోగతి సాధించడానికి కావాల్సిన విజ్ఞానంతోపాటు సూచనలు, సలహాలు ఇచ్చే స్థితిలో ఉండాలి. అందుకనే... విద్యార్థులు వీరిని ఎంచుకోవడం ముఖ్యమైన అంశం. కళాశాల సీనియర్ విద్యార్థులూ, ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులూ మెంటర్‌షిప్ విషయంలో సహకారం అందిస్తారు. క్రమం తప్పకుండా సెమినర్లకూ, కాన్ఫరెన్సు లకూ హాజరవుతుంటే అక్కడకు విశేష పరిజ్ఞానమున్నవారు వస్తుం టారు. వారిని పరిచయం చేసుకోవాలి. వారి సలహా, సూచనలను అడగాలి. మీరు ఎదుర్కొంటున్న సమస్యను చెప్పి, వాటికి ఇప్పటి వరకూ ప్రయత్నించిన పరిష్కారాల గురించి చెప్పాలి. మెంటర్‌గా ఉండమని నేరుగా వారిని అడగకుండా వారిని ఆసక్తికరమైన ప్రశ్నలు వేసి ఆకట్టుకోవాలి. వారే క్రమంగా మీపై ఆసక్తి చూపించవచ్చు. ఈరకంగా వారు మీ మెంటర్ అయ్యే అవకాశాలుంటాయి.


విభిన్నమైన కోర్సులూ, సరికొత్త స్పెషలైజేషన్లూ అందుబాటులోకి వస్తున్నాయి. మరోపక్క ఉద్యోగ సాధనలో పోటీ పెరుగుతోంది. వీటిని తట్టుకుని విద్యాభ్యాసంలో, ఉద్యోగాన్వేషణలో ముందువరసలో నిలబడాలంటే... అందుకు తగ్గ చేయూత తప్పనిసరి. దీన్ని వ్యక్తిగత శ్రద్ధతో అందించేదే మెంటర్‌షిప్. ఇంజినీరింగ్, సైన్స్ లాంటి వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులూ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సిద్ధమయ్యేవారూ మెంటర్ల తోడ్పాటును తీసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ చేసేవారు మెంటర్ల తాలూకు నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ లాంటి జాతీయ ప్రవేశపరీక్షలు రాసేవారికి మెంటర్‌షిప్ ద్వారా అందే సహాయం మెరుగైన ర్యాంకు సాధనకు దోహదపడుతుంది.



ఉన్నతవిద్య, కెరియర్ విషయాల్లో సాధారణంగా సహవిద్యార్థుల ప్రభావం ఉంటుంది. అది మంచిదే అయినప్పటికీ వారి స్వల్ప పరిజ్ఞానం వల్ల ఒక్కోసారి తప్పటడుగులకూ ఆస్కారం ఉంటుంది. అందుకే ఈ దశలో అనుభవం, పరిజ్ఞానం ఉన్న మెంటర్ల మార్గదర్శకత్వం ఉండటం మేలని నిపుణులు చెపుతున్నారు. వెనకబడుతున్నపుడు ఊతమిస్తూ.. చేరుకోవాలనుకునే గమ్యం దగ్గర్లోనే ఉందంటూ విద్యార్థిలో, ఉద్యోగార్థిలో ఆత్మవిశ్వాసాన్ని నింపటం, లక్ష్యాన్ని చేరేవరకూ వెన్నంటి ఉంటూ ప్రోత్సహించటం మెంటర్ల విధులు.

## ఇలాంటివారిని ఎంచుకోవాలి

మీరు ఏ స్థాయిలో ఉండాలనుకుంటున్నారో.. ఆ స్థాయిలో ఉన్నవారిని లేదా మీరు ఆ స్థానానికి చేరుకోవడానికి తోడ్పడతారని భావించినవారిని మెంటర్‌షిప్ కోసం ఎంచుకోవాలి. ఆ వ్యక్తి విజయాలు మీకు ప్రేరణ కలిగించేలా ఉండాలి. మెంటర్‌కు మీ కన్నా వేరే అభిరుచులు ఉన్నప్పటికీ వారు మీ దృష్టికోణంలో అవసరమైన మార్పులు తేగలరు. లింగ భేదం ఉండాల్సిన అవసరం లేదు. కానీ విద్యార్థినులకు స్త్రీలు, విద్యార్థులకు పురుషులూ మెంటర్లుగా ఉండటం ఎక్కువ ప్రయోజనకరం. నిజాయతీ.. మెంటర్‌షిప్‌లో కీలకం. మెంటర్, మెంటీ (విద్యార్థి) ఇద్దరికీ ఇది అవసరం. అయితే మీరు చేసిన తప్పులను మెంటర్ నిస్సం కోచంగా చెప్పగ లిగినప్పుడే మీకు వాటిని సరిదిద్దుకునే అవ కాశం లభిస్తుంది. ఎక్కువ అనుభవం, విస్తృత నెట్‌వర్క్ కలిగివున్నవారై ఉండాలి. ఉద్యోగాన్వేషణ సమయంలో వారి నెట్‌వర్క్ మీకు సాయపడే అవకాశముంది. ఒక స్థాయికి చేరినవారినే ఎంచుకుంటే ఉపయోగకరం. కానీ మెంటర్‌షిప్‌లో వారు మీకు వీలైనంత సమయం కేటాయించగలిగినవారై ఉండాలి.



## ఎలా సాయపడగలరు?

మెంటర్లకు విద్యార్థి కంటే ఎక్కువ అనుభవ ముంటుంది. విద్యార్థి ఇప్పుడు ఎదుర్కొంటున్న దశలు వారు ఇంతకుముందే దాటి ఉంటారు. విద్యార్థి తన శక్తి సామర్థ్యాలను ఏ దిశలో ఉపయోగించాలో తెలియజేస్తూ అనవసర విషయాలను పక్కన పెట్టడంలో మెంటర్లు సాయపడతారు.

## సమతూకం నేర్పుతారు

చాలామంది విద్యార్థులు విద్య, ప్రొఫెషనల్, సాంఘిక, వ్యక్తిగత వంటి వివిధ అంశాలను సమతూకంలో నిర్వహించడంలో తొట్రుపడుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవారికి మెంటర్ సాయపడతారు. సహనంతో ఎలా నడుచుకోవాలో సూచిస్తూ.. సమతూకంగా నిర్వహించేలా సాయపడతారు. స్థిర లక్ష్యం ఉండి, కష్టపడి పనిచేసే మనస్తత్వాన్ని కలిగివుంటే.. మెంటీ కెరియర్‌లో అభివృద్ధి చెందడానికి అవసరమైన పరిచయాలను అందించడంలో మెంటర్ ఎప్పుడూ ముందుంటారు. తనకు అందుబాటులో ఉన్న వనరులన్నీ ఉపయోగించి తన కెరియర్‌కు అవసరమైన బాటను చూపిస్తారు. ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశించే క్రమంలో మెంటర్లు ఎక్కువ ఉపయోగపడతారు. నిజానికి విద్యార్థి జీవితం నుంచి ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించడానికి చాలామంది ఎంతో కష్టపడుతుంటారు. ఒకరకంగా మెంటర్ విద్యార్థికి ఈ ప్రక్రియను సులభతరం చేస్తారు. ఆ రకంగా మెంటర్‌ను కలిగివున్నవారు ఉద్యోగ విషయంలో మిగతావారితో పోలిస్తే ఒక అడుగు ముందున్నట్లే.




## నాలుగు కీలకాంశాలు

విద్యార్థులకు ఈ కింది అంశాల్లో మెంటర్ తోడ్పడతారు.

**లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం:** విద్యార్థులు తమ కెరియర్ లక్ష్యాలను ఏర్పరచుకోవడంలో మెంటర్లు సహకరిస్తారు. వాటి సాధనలో ఇతరులతో కలిసి పనిచేసేలా ప్రోత్సహిస్తారు.


**నెట్‌వర్కింగ్:** విద్యార్థులు తాము ఎంచుకునే మెంటార్లు సంబంధిత రంగంలో నిపుణులు, గౌరవప్రదమైన స్థాయిలో ఉన్నవారైతే వారు తమ కమ్యూనిటీలోని ఇతర నిపుణులకు విద్యార్థులను ఇంటర్న్‌షిప్ ఉద్యోగాల నిమిత్తం పరిచయం చేసే అవకాశం ఉంటుంది.

**పరిజ్ఞానాన్ని విస్త తపరచడం:** ఎంచుకున్న రంగంలో నిపుణులను పరిచయం చేయడం, అవకాశాలను కల్పించడంతోపాటు విద్యార్థులకు ఇతర మార్గాలూ, సంస్థలను పరిచయం చేస్తాడు.

**ఇంటర్వ్యూ నైపుణ్యాలు:** ఉద్యోగాన్వేషణ, ఇంటర్వ్యూ విధానాలపై విద్యార్థులకు ఉండే అపోహలను తొలగించడంలో మెంటర్లు సాయపడతారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగార్థులుగా ప్రస్తుత గ్రాడ్యుయేట్లు ఎలా నిలబడవచ్చో సలహాలిస్తారు. కెరియర్ దీర్ఘకాలంపాటు ఎలా కొనసాగించవచ్చు.

## ఆలోచనలు పంచు కుంటారు

భవిష్యత్తును విజయవంతం చేసుకునే సుదీర్ఘమైన ఒడిదొడుకుల మార్గంలో కొన్నిసార్లు దారి తప్పడమో, తప్పు దారిలో ప్రయాణించడమో జరుగుతుంది. అలాంటప్పుడు భావోద్వేగాలు, భావనలు, భయాలను ధైర్యంగా పంచుకోవడానికి ఒకరుంటే బాగుంటుందనే భావన విద్యార్థి దశలో సాధారణమే. తను ఎదుర్కొంటున్నవన్నీ చాలా చిన్న విషయాలనీ, వాటిని సులువుగా ఎదుర్కోవచ్చనీ తెలియజేస్తూనే విద్యార్థికి సంబంధించిన క్లిష్టమైన విషయాల్లో మెంటర్ స్పష్టతను తీసుకువస్తారు. ప్రొఫెషనల్ లీడర్‌షిప్, ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచుకునే విషయంలో రోల్‌మోడల్‌గా నిలుస్తారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలోనూ, రిస్కలను ఎదుర్కొంటూ ఉన్నతస్థాయికి ఎదగడంలోనూ తోడ్పాటును అందిస్తారు. వైవిధ్యభరితమైన దృష్టికోణాలు, అనుభవాలపై విద్యార్థి అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడతారు.



## సానుకూల ప్రభావం

మెంటర్‌షిప్ చూపే ప్రభావం గురించి కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేసే ఒక పరిశోధన సంస్థ అధ్యయనం జరిపింది. 1000 మందికిపైగా ఉద్యోగులపై అయిదేళ్లపాటు దీన్ని నిర్వహించారు.

మెంటర్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్న బృందంలో 25% మంది (ఎలాంటి మెంటర్‌షిప్ అందుకోని 5% మందితో పోల్చినపుడు) మెరుగైన వేతనాలు అందుకున్నారు. 72% మంది తమ స్థానాలను (ఈ కార్యక్రమంలో పాల్గొనని 49% మందితో పోల్చినపుడు) నిలబెట్టుకున్నారు. పదోన్నతికి సంబంధించి మిగిలినవారితో పోల్చినపుడు మెంటర్‌షిప్ అందుకున్నవాళ్లు 5 రెట్లు ఎక్కువగా అవకాశాలు పొందారు.




## వ్యక్తిగత శ్రద్ధతో సలహాలు

కాలేజీ విద్యార్థులు తమ కెరియర్ విషయంలో సాధారణంగా ఎవరి సలహానూ తీసుకోరు. స్నేహితుల బృందం తమలో తాము ఏదో అనుకుని, ఆ నిర్ణయం ప్రకారమే ముందుకువెళ్తుంటారు. ఆ 'పియర్ డిస్కషన్' మంచిదే కానీ, దానికంటే మించి అనుభవం ఉన్న మెంటర్ల సలహాలతో తీసుకునే నిర్ణయమే మరింత ఉత్తమంగా ఉంటుంది. కెరియర్ కౌన్సెలర్, కెరియర్ అడ్వైజర్‌ల విధులే మెంటర్లకూ ఉన్నప్పటికీ వారికంటే మించి వ్యక్తిగత స్థాయిలో చేయూతనివ్వటం వీరి ప్రత్యే కత. మెంటర్లను విశ్వసించి, వారితో విద్యార్థులు నిస్సం కోచంగా మాట్లాడటం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. ఉన్నతవిద్య, ఉద్యోగం... రెంటిలో ఏది ఎంచుకోవాలనే సందిగ్ధత ఏర్పడినప్పుడూబీ ఒకవేళ ఉన్నత విద్యకు మొగ్గు చూపితే అందుకు ఉపయోగపడేలా ప్రాజె క్టులు ఏం చేస్తే బాగుంటుందో స్పష్టత లేనప్పుడూ అనుభ వజ్ఞులైన మెంటర్ల సూచనలు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి.







## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రాణించాలి

బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసుకున్న, ప్రస్తుతం ఆఖరి సంవత్సరం కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం) సంస్థలు అందిస్తున్నాయి. హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో అనుభవం ఉన్నవారు నేరుగా, ప్రస్తుత విద్యార్థులైతే పరీక్ష ద్వారా పీజీ కోర్సు లోకి చేరిపోవచ్చు. ఆతిథ్య రంగంలో మరింత నైపు ణ్యాన్ని పొంది, నిపుణులుగా రాణించాలని కోరుకునే వారికి, హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో ఫ్యాకల్టీగా సేవలందించాలనుకునేవారికి ఈ కోర్సు ఉపయోగ పడుతుంది. కోర్సును నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ ఎంసీటీ), ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) సంయుక్తంగా రూపొందించాయి. ఐహెచ్‌ఎం-నోయిడా, న్యూఢిల్లీ, బెంగళూరు, చెన్నై, లఖ్‌నవూ, కోల్‌కతా క్యాంపస్‌ల్లో ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మిని స్ట్రేషన్ కోర్సు బోధిస్తున్నారు. బీఎస్సీ హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులు పూర్తిచేసినవాళ్లు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం కోర్సు చదువుతున్నవారు ఎమ్మెస్సీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆతిథ్య రంగంలో అనుభవం ఉన్నవారికి నేరుగా ప్రవేశం కల్పిస్తారు. బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అనంతరం రెండేళ్లు ఆపైన కనీసం మూడు నక్షత్రాల హోటల్‌లో పని అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకుని పరీక్ష అవసరం లేకుండా ప్రవేశం పొందవచ్చు.



## లెక్కలంటే.. మక్కువ!

గణితం అనగానే కొంతమంది గడ గడ వణికిపోతే... ఇంకొందరు టక టకా స్టెప్పులేసుకుంటూ వెళ్లిపోతారు. ఇది ఒక సబ్జెక్టు మాత్రమే కాదు. విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించే వేదిక కూడా. ఇంజినీరింగ్, అకౌంటింగ్ మొదలు అంతరిక్షం వరకు గణితం అన్ని రంగాల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. బోధన, పరిశోధనలతోపాటు ఎన్నో రకాల ఉద్యోగాలకు ఈ నిపుణుల అవసరం ఉంది. గణితం అంటే కొంచెం భయంగా.. చాలా గౌరవంగా అనిపిస్తుంది. నూటికి నూరు మార్కులు తెచ్చుకోడానికి వీలున్న విభాగాల్లో ఎందరికో ఇష్టమైన సబ్జెక్టు ఇది. లెక్కలపై మక్కువ ఎక్కువగా ఉంటే, వాటినే జీవితంగా గడపడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఉన్నత విద్యపరంగా చూస్తే ఎన్నో ప్రఖ్యాత సంస్థలు రకరకాల కోర్సులను అందిస్తున్నాయి. ఉపాధిని పరిశీలిస్తే బోధన, పరిశో. దన రంగాల్లో పలు కొలువులు ఆహ్వానం పలుకు తున్నాయి. మ్యాథ్స్‌పై శ్రద్ధ, ఆసక్తి ఉంటే మొద టగా గుర్తుకొచ్చేది ఇంజినీరింగ్. అది వాస్తవమే. గణిత ంపై పట్టు వల్ల కచ్చితంగా ఇంజినీ రింగ్‌లో ఉన్నత స్థా నాన్ని చేరుకోవచ్చు. అప్లైడ్ మ్యాథమేటిక్స్ వంటి స్పెషలైజేషన్లతో ఉన్నత విద్యను, ఉపాధి మార్గాన్ని ఎం చుకుంటే లెక్కలే సర్వస్వంగా జీవనాన్ని సాగించవచ్చు.



## పదును పెడితేనే.. ఫలితం!

యాంత్రీకరణ మూలంగా నేడు చాలా ఉద్యోగాలకు గండిపడుతోంది. ఐటీ రంగంలో చాలా కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. ఇలాంటి అననుకూల పరిస్థితుల్లో ప్లాన్-ఎ విఫలమైతే నిరుత్సాహపడనక్కర్లేదు. ప్రత్యామ్నాయ మార్గంపై (ప్లాన్-బి) దృష్టిపెట్టాలి. ఒక్కసారి ఉద్యోగం దొరికితే జీవితానికి ఢోకా లేదనుకుంటాం. కానీ అలాంటి నిశ్చింతకు నేడు విఘాతం కలుగుతోంది. కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులు, ఆర్థిక నష్టాలు, పనిలో నూతన నైపుణ్యాల లేమి వంటి కారణాలతో చాలామంది కొలువులను కోల్పోతున్నారు. అమెరికా వంటి దేశాల్లో వీసా సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి ఫలితంగా అంకుర సంస్థలు మొదలుకొని కార్పొరేట్ సంస్థలూ సతమత మవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కెరియర్ కోసం ప్రత్యా మ్నాయం చూసుకోవడం అభ్యర్థులకు అనివార్యం. ఉద్యోగం చేస్తున్న సమయంలో రెజ్యూ మేను నవీకరించుకోవటానికి చాలామంది ఆసక్తి చూపించరు. దాన్ని కాలయాపనగా భావిస్తారు. ఇది సరైన ఆలోచన కాదు. దీని వల్ల ఉద్యోగ సంక్షోభ సమ యంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

## ఇక్కడ ఈసీఈ ప్రత్యేకం



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) పూర్తిచేస్తే ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉంటాయో అని మీరు అన్వేషిస్తుంటే.. ఒకసారి హైదరా బాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్‌ఐటీ) అందిస్తున్న ఈసీఈ కోర్సు గురించి కొంత సమాచారం తెలుసుకోవాలి. సంప్రదాయ కోర్సుతో పోలిస్తే కొన్ని ప్రత్యేక లక్షణాలతో దీన్ని రూపొందించారు. హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ లేదు. వాస్తవానికి ఏ విభాగానికీ డిపార్ట్‌మెంట్లు లేవు. అన్నీ రిసెర్చ్ సెంటర్లు లేదా ల్యాబ్‌లే. విద్యార్థి ఏ బ్రాంచిలో చేరినా తనకు నచ్చిన రిసెర్చ్ సెంటర్‌లో పేరు నమోదు చేసుకోవచ్చు. పరిశోధనలు చేయవచ్చు. అదే ఇక్కడి ప్రత్యేకత. ఈసీఈకి సంబంధించిన డిస్ట్రిబ్యూటెడ్ స్టోరేజ్, ఆర్టిఫిషియల్ న్యూట్రల్ నెట్‌వర్క్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ ఇన్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్ రిసెర్చ్ సెంటర్లలో కంప్యూటర్‌సైన్స్ బ్రాంచి విద్యార్థులు కూడా పరిశోధనలు చేస్తూ కనిపిస్తుంటారు. అలాగే సీఎస్ బ్రాంచి కి సంబంధించిన కంప్యూటర్ విజన్ లేదా మెషిన్ లెర్నింగ్ వంటి విభాగాలను ఈసీఈ అభ్యర్థులు అధ్యయనం చేయ డం కూడా చూడవచ్చు. ఇతర కాలేజీల్లో ఈసీఈ చేరిన విద్యార్థులు ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో సంప్రదా య ఇంజినీరింగ్ మెకానిక్స్ తదితర సబ్జెక్టులు చదువు తుంటే ట్రిపుల్‌ఐటీలో మాత్రం కంప్యూటర్ ప్రోగ్రామింగ్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ తదితరాలు నేర్చుకుంటారు.

## స్కిల్స్ పెంచుకోవాలి!




పట్టాలు, పరిజ్ఞానం కంటే నిర్వహణ నైపుణ్యాలకే కొన్ని సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇప్పటికిప్పుడు మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఎలా పెంచుకోవాలి, ఎంతో వ్యయంతో కూడుకున్న వ్యవ హారమని ఆవేదన చెందాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో ఎన్నో ప్రముఖ సంస్థలు తక్కువ ఖర్చుతో, స్వల్ప సమయానికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందిస్తున్నాయి. అందుకే అభ్యర్థులు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోడానికి ఈ ఆన్‌లైన్ వేదికలను ఆశ్రయించవచ్చు. మేనేజ్‌మెంట్ విద్యను కెరియర్‌గా ఎంచుకుంటున్న విద్యార్థులు, నిపుణుల సంఖ్య బాగా పెరుగుతోంది. గ్రాడ్యుయేట్లూ, వివిధ రంగాల్లో అనుభవ జ్ఞులైన నిపుణులు కూడా ఎంబీఏలోని మూడు మేజర్ మేనేజ్‌మెంట్ అంశాలైన ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్‌ల్లో ఏదో ఒకదానిలో నైపుణ్యాన్ని సాధించాలను కుంటు న్నారు. అందుకు మేనేజ్ మెంట్ విద్యను ఎంచు కుంటున్నారు.

మనం స్పోర్ట్స్
బుధవారం 7 మార్చి 2018
www.manamnews.com

# శ్రీలంక బోణీ

ధావన్ మెరుపులు వృథా
రాణించిన జయంత్ పెరీరా
**తొలి టీ20లో 5 వికెట్ల తేడాతో శ్రీలంక గెలుపు**





శిఖర్ ధావన్ 90

కొలంబో: నిధాస్ కప్ ముక్కోణపు టి20 తొలి మ్యాచ్‌లో శ్రీలంక బోణీ కొట్టింది. శిఖర్ ధావన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 174 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసి ఐదు వికెట్ల విజయం అందుకుంది. 175 రన్స్ భారీ టార్గెట్ ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్ మెండిస్ త్వరగా ఔటనప్పటికీ గుణతిలక ధాటిగా ఆడాడు. కుశాల్ పెరీరాతో కలసి రెండో వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. 19 పరుగులు చేసిన గుణతిక అవుటయ్యాక పెరీరా - చండీమాల్‌తో కలసి స్కోరు బోర్డును పరుగులెత్తించారు. పదిఓవర్లలోనే లంక స్కోరును 100 పరుగులు దాటించారు. కేవలం 37 బాల్స్‌లో 6 ఫోర్లు నాలుగు సిక్స్‌లతో 66 పరుగులు చేసి భారత జట్టులో గుబులురేపిన పెరీరా అవుటవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత లంక దూకుడు తగ్గింది. కెప్టెన్ చండీమాల్, తరంగ వికెట్లుత్వరత్వరగా కోల్పోయినా తిశరా పెరీరా, దుషాన్ శణకలు భారత బౌలర్లనుధీటుగా ఎదుర్కొని జట్టును విజయపధాన నడిపించారు.

## ధావన్ దంచెన్..

టాస్ గెలిచిన లంక బౌలింగ్ మొదలుపెట్టి భారత్‌కు ఆదిలోనే షాకిచ్చింది. ఇన్నింగ్స్ నాలుగో బంతికే కెప్టెన్ రోహిత్ శర్మ డకౌట్ అయ్యాడు. తన పేరిట ఉన్న డకౌట్ల రికార్డును రోహిత్ శర్మ కొనసాగించాడు. టి20ల్లో నాలుగు సార్లు డకౌట్ అయిన తొలి భారత బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ పేరిట రికార్డు ఉంది. ఆ తర్వాత ఓవర్లో సురేశ్‌రైనా కూడా పెవిలియన్ చేరాడు. దీంతో భారత జట్టు 9 పరుగులకే రెండు వికెట్లు నష్టపోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత ధావన్-పాండే కలసి స్కోరును పరుగులెత్తించారు. లంక బౌలర్లపై బౌండరీలు, ఫోర్లతో ధావన్ విరుచుకుపడ్డాడు. ధనంజయ డిసిల్వా వేసిన బంతికి ఫోర్ కొట్టి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ధావన్ 31 బంతుల్లో ఐదు ఫోర్లు రెండు సిక్స్‌లతో హాఫ్ సెంచరీ బాదేశాడు. 104 పరుగుల వద్ద మనీశ్ పాండే (37 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో 37 రన్స్ చేసి అవుటయ్యాడు. ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు 95 రన్స్ కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన రిషబ్ పంత్‌తో కలసి ధావన్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు.

ధావన్ దూకుడును అడ్డుకునేందుకు శ్రీలంక ఎన్ని గేమ్‌ప్లాన్లు వేసినా ఫలితం లేకపోయింది. అయితే సెంచరీకి కొట్టేస్తాడనుకున్న తరుణంలో జీవన్ మెండిస్ వేసిన ఓ బంతిని భారీ షాట్‌కొట్టబోయి అవుటయ్యాడు. విధ్వంసకర బ్యాటింగ్ చేసిన ధావన్ 49 బంతులో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో చెలరేగి 90 రన్స్ చేయడంతో భారత్ భారీ స్కోరు చేసింది. టి20ల్లో ధావన్‌కు ఇది హయ్యెస్ట్ స్కోరు. లంకపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగానూ ధావన్ రికార్డుల్లోకెక్కాడు. గతంలో ఈ రికార్డు కోహ్లీ పేరుతో ఉండేది. ధావన్ అవుటయ్యాక బరిలోకి దిగిన దినేశ్ కార్తీక్ కూడా మెరుపులు మెరిపించాడు. రిషబ్ పంత్ కూడా చివరి ఓవర్లో ధాటిగా ఆడాడు. దీంతో ఆరంభంలోనే రెండు కీలక వికెట్లు నష్టపోయినప్పటికీ ధావన్, మనీశ్‌ల ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరు సాధించింది.

### స్కోరుబోర్డు :

**ఇండియా ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (సి) జీవన్ మెండిస్ (బి) చమీర 0, శిఖర్ ధావన్ (సి) తిసారా పెరీరా (బి) గుణతిలక 90, సురేశ్ రైనా (బి) ఫెర్నాండో 1, మనీష్ పాండే (సి) దనుష్క గుణతిలక (బి) జీవన్ మెండిస్ 37, రిషబ్ పంత్ (సి) ఫెర్నాండో (బి) చమీర 23, దినేశ్ కార్తీక్ (నాటౌట్ ) 13, ఎక్స్‌ట్రాలు: 10, **మొత్తం 20 ఓవర్లలో 174/5,** వికెట్ల పతనం: 1-1, 2-9, 3-104, 4-153, 5-174, బౌలింగ్: డి. చమీర 4-0-33-2, ఫెర్నాండో 3-0-38-1, అఖిల దనంజయ 4-0-37-0, తిసారా పెరీరా 3-0-25-0, జీవన్ మెండిస్ 3-0-21-1, గుణతిలక 3-0-16-1.

**శ్రీలంక ఇన్నింగ్స్ :** గుణతిలక (సి) పంత్ (బి) ఉనద్కత్ 19, మెండిస్ (సి)ధావన్ (బి) సుందర్ 11, పెరీరా (స్టంప్) కార్తీక్ (బి) సుందర్ 66, చండీమాల్ (బి) చాహల్ 14, తరంగ (బి) చాహల్ 17, ధనంజయ షనక 15. (నాటౌట్) సి పెరీరా (నాటౌట్) 22, **మొత్తం 18.3 ఓవర్లలో 175/5,** వికెట్ల పతనం : 1-12, 2-70, 3-98, 4-127, 5-136, బౌలింగ్ : ఉనద్కత్ 3-0-35-1, సుందర్ 4-0-28-2, చాహల్ 4-0-37-2, ఠాకూర్ 3.3-0-42-0, శంకర్ 2-0-15-0, రైనా 20-0-14-0.



### ఆటగాళ్ల భద్రతపై
## ఆందోళన వద్దు

కొలంబో : నిదహస్ టి20 సిరీస్‌లో ఆడుతున్న క్రికెటర్ల భద్రతకు ఢోకా లేదని భారత ప్రభుత్వం ప్రకటించింది. శ్రీలంక 70 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ ముక్కోణపు టి ట్వంటీ టోర్నీని నిర్వహించాలని తలపెట్టింది. శ్రీలంక నగరం క్యాండీలో అల్లర్లు చెలరేగడంతో అక్కడి ప్రభు త్వం పది రోజుల అత్యవసర పరిస్థితిని విధించింది. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు గొడవలు జరగడం, ఎమర్జెన్సీ విధించాల్సిరావంతో టోర్నమెంట్ జరుగుతుందా లేదా అని సందేహాలు మొదలయ్యాయి. భారత క్రికెటర్ల భద్రతపైనా ఆందోళన వ్యక్తమైంది. దీంతో శ్రీలంకలో పరిస్థితిని భారత ప్రభుత్వం సమీక్షించింది. క్రికెటర్ల భద్రతకు ఢోకా లేదని ప్రకటించింది. క్రికెటర్ల భద్రతపై బీసీసీఐ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో శ్రీలంక ప్రభుత్వంతో చర్చించింది. ఈ టోర్నమెంట్ మ్యాచ్‌లన్నీ కొలంబోలో జరుగుతున్నాయని అక్కడ పరిస్థితి ప్రశాంతంగా ఉందని ప్రభుత్వం తెలిపింది. 'షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు జరుగుతాయని, క్రికెటర్ల భద్రతపై అక్కడి ప్రభుత్వంతో చర్చించాకే ఈ నిర్ణయం తీసుకున్నాం, ఆటగాళ్లకు పూర్తి భద్రత కల్పించినట్టు వారు చెప్పారు ' అని తెలిపింది. ఆదేశంలో పరిస్థితిని శ్రీలంక ప్రభుత్వంతో పాటు, శ్రీలంక క్రికెట్ బోర్డుతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని బీసీసీఐ తెలిపింది. శ్రీలంకలో పరిస్థితిపై రోజూ సమీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

## కోహ్లీ ర్యాంకు పదిలం



దుబాయ్ : ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) విడుదల చేసిన తాజా టెస్టు ర్యాంకుల్లో భారత స్టార్ విరాట్ కోహ్లీ 912 పాయింట్లతో రెండవ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఆస్ట్రేలియా సారథి స్టీవ్ స్మిత్ 947 పాయింట్లతో ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ ప్లేయర్ జో రూట్ 881 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. భారత ఆటగాళ్లలో కోహ్లీ తర్వాత ఛతేశ్వర్ పూజారా మాత్రమే ఈ టాప్ టెన్ ర్యాంకుల్లో చోటు దక్కించుకున్నాడు. పుజారా ఆరోస్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల జాబితాలో జేమ్స్ అండర్సన్ (ఇంగ్లండ్ 887 - పాయింట్లు) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. రబాడా (దక్షిణాఫ్రికా 873 పాయింట్లు), రవీంద్ర జడేజా (భారత్ 844 పాయింట్లు) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఓ ర్యాంకు దిగజారి ఆరో స్థానంలో ఉండగా, ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా, అశ్విన్‌లు రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

## సచిన్‌కు శ్రీలంక ఆహ్వానం



కొలంబో: మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌కు శ్రీలంక నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. 70 ఏళ్ల దేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జరిగే నిదహాస్ టి20 క్రికెట్ టోర్నీ చూసేందుకు రావాలని సచిన్‌కు శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు సుమపాల లేఖ రాశాడు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా తాను ఈ టోర్నీ చూసేందుకు రాలేకపోతున్నానని సచిన్ లంక క్రికెట్ బోర్డుకు తెలిపాడు. 70 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్న శ్రీలంకకు శుభాకాంక్షలు తెలిపాడు. గతంలో లంక 50 ఏళ్ల దేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జరిగిన ఇదే టోర్నీలో ఆడిన సచిన్ గంగూలీతో కలసి తొలి వికెట్‌కు 252 పరుగుల రికార్డు నెలకొల్పాడు.

## అరుణకు రైల్వే ఉద్యోగం



హైదరాబాద్ : ప్రపంచ కప్ జిమ్నాస్టిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన తెలుగమ్మాయి అరుణారెడ్డికి రైల్వే ఉద్యోగం దక్కింది. అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణించిన అరుణారెడ్డికి గ్రూప్ సి ఉద్యోగం ఇస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకుని సంచలనం సృష్టించిన అరుణకు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు కోట్ల నజరానా ప్రకటించారు. తెలంగాణ ఒలింపిక్స్ సంఘం 20 లక్షల రూపాయల బహుమతి ప్రకటించింది. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు రైల్వే శాఖ సిద్ధంగా ఉంటుందని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు.


# మనుకు మరో స్వర్ణం

### ప్రపంచకప్ షూటింగ్‌లో సంచలనం



ఢిల్లీ: భారత షూటర్ మనూ బాకర్ మెక్సికోలో జరుగుతున్న సీనియర్ ప్రపంచ కప్ షూటింగ్ పోటీల్లో సంచలనాలు సృష్టిస్తోంది. తొలి సారి ఈ పోటీల్లో పాల్గొంటున్న 16 ఏళ్ల హర్యానా షూటర్ మనూ మరో పసిడి పతకం సాధించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో రెండు సార్లు ప్రపంచ కప్ స్వర్ణపతక విజేత అలెగ్జాండ్రా జవాలను ఓడించి తొలి స్వర్ణం గెలుచుకున్న మనూ తాజాగా మరో గోల్డ్‌మెడల్‌ను తన ఖాతాలో వేసుకుంది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత ఆటగాడు ఓం ప్రకాశ్-మనూ బాకర్ జోడి 476.1 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచి స్వర్ణం గెలుచుకుంది. ఇదే ఈవెంట్‌లో భారత జంట దీపక్‌కుమార్, మెహూలి ఘోష్‌లు ఆరో స్థానంలో నిలిచారు. ఇప్పటి దాకా ఈ పోటీల్లో భారత షూటర్లు మూడు స్వర్ణాలు, నాలుగు కాంస్య పతకాలతో ఏడో స్థానంలో ఉన్నారు. డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన జాతీయ షూటింగ్ పోటీల్లో చాంపియన్ మీనా సిద్ధు రికార్డును బ్రేక్ చేసి సంచలనం సృష్టించిన మను మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో అసాధారణ ఆటతీరును ప్రదర్శించింది.

## నమ్మలేకపోతున్నా : మను



ప్రపంచ కప్ షూటింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించానంటే నమ్మలేకపోతున్నానని భారత సంచలనం మనూ బకర్ చెబుతోంది. మెక్సికోలో జరుగుతున్న ఈ పోటీల్లో రెండు పతకాలతో రికార్డు సృష్టించిన ఈ 16 ఏళ్ల యంగ్ షూటర్ ఆనందంతో ఉబ్బితబ్బిబవుతోంది. 'నమ్మలేకపోతున్నా.. ఈ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుస్తానని ఊహించలేదు' అని బకర్ తెలిపింది. తొలి సారి ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొంటున్న లెవెన్త్ స్టాండర్డ్ విద్యార్థిని మను ఈ టోర్నీలో దిగ్గజాలను సైతం ఓడించింది. రెండేళ్ల క్రితం షూటింగ్ ప్రాక్టీస్ మొదలుపెట్టి అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలు గెలుచుకున్న మను బకర్‌పై భారత రైఫిల్ షూటింగ్ సంఘం ప్రశంసలు జల్లు కురిపిస్తోంది. ప్రత్యర్థుల గురించి తానెప్పుడూ ఆలోచించనని, గురి తప్పకూడదన్న ఉద్దేశంతోనే బరిలోకి దిగుతానని మను రెండో స్వర్ణం గెలిచాక చెప్పింది. ఈ ఘనత కోచ్‌లకే చెందుతుందని వాళ్ల సలహాలు పాటించి రాణిస్తున్నానని అంటోంది. వ్యక్తిగత విభాగంలో పతకం కోసం జరిగిన పోటీలో మొదట్లో కాస్త ఒత్తిడికి లోనయ్యానని, అయితే ఆ తర్వాత ఆ ప్రభావం నుంచి కోలుకున్నానని వివరించింది. ఈవిజయాలతో వచ్చే నెల్లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలు, ఆ తర్వాత సిడ్నీలో జరిగే వరల్డ జూనియర్ చాంపియన్‌షిప్‌లోనూ మనూ భారత ఆశాకిరణంగా మారింది.

# తప్పని ఓటమి

### అజ్లాన్ షా హాకీ టోర్నీలో ఆస్ట్రేలియా విజయం



ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత్ మరో పరాజయాన్ని మూటగట్టకుంది. ఆస్ట్రేలియాతో జరిగిన కీలక మ్యాచ్‌లో 2-4 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది రెండో ఓటమి. తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో 2-3 గోల్స్ తేడాతో ఓడిన భారత్ ఇంగ్లండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌ను 1-1 గోల్స్‌తో డ్రా చేసుకుంది. ఈ టోర్నీలో తదుపరి మ్యాచ్‌ను భారత జట్టు బుధవారం మలేసియాతో ఆడుతుంది. కీలక మ్యాచ్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాకు పోటీ ఇవ్వలేకపోయింది. ఆద్యంతం ఆధిక్యత కనబరిచిన వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియా 28వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ సాధించింది. మార్క్ నోవెల్స్ చేసిన ఈ గోల్‌తో ఆసీస్ 1-0 ఆధిక్యత సంపాదించింది. ఆ తర్వాత 35 నిమిషంలో అర్న్ జలెస్కి చేసిన గోల్‌తో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 41వ నిమిషంలో డానియెల్ బెలె చేసిన మరో గోల్‌తో ఆసీస్ ఆధిక్యం 3-0కు పెరిగింది. చక్కటి గేమ్‌ప్లాన్‌తో ఆస్ట్రేలియా మ్యాచ్ ఆద్యంతం ఆసక్తి కనబరిచింది. ఆసీస్ దూకుడును అడ్డుకోవటంలో విఫలమైన భారత్ 43 వ నిమిషంలో మరో గోల్ సమర్పించుకుంది. బ్లాక్ గోవర్స్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో ఆసీస్ ఆధిక్యం 4-0కు పెరిగింది. అయితే మ్యాచ్ చివరల్లో భారత స్టార్ రమణ్‌దీప్ సింగ్ వరుసగా రెండు గోల్స్ చేసినా ఫలితం లేకపోయింది.

### కొరియాపై మహిళల జట్టుకు మరో గెలుపు

ఇంచియాన్ : దక్షిణకొరియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3-2 గోల్స్‌తో విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. సోమవారం మొదటి మ్యాచ్‌లో 1-0 గోల్స్‌తో విజయం సాధించిన భారత జట్టు రెట్టించిన ఉత్సాహంతో రెండో మ్యాచ్‌లో ఆడింది. భారత క్రీడాకారిణి పూనమ్ రాణి ఆరో నిమిషంలో గోల్ చేసి ఆధిక్యతను అందించింది. పదో నిమిషంలో కొరియా ప్లేయర్ యూరిమ్ లీ కొట్టిన గోల్‌తో స్కోరు సమం అయింది. అయితే 27 నిమిషంలో రాణి చేసిన మరో గోల్‌తో భారత్ ఆధిక్యం 2-1కి పెరిగింది. ఫస్ట్ హాఫ్ తర్వాత భారత్ దూకుడుకును అడ్డుకున్న కొరియా 31వ నిమిషంలో గోల్ చేసింది. జుగెన్ సియో చేసిన ఈ గోల్‌తో స్కోరు 2-2తో సమం అయింది. ఈ సిరీస్‌లో మూడో మ్యాచ్ గురువారం జరుగుతుంది.

# బీర్ తాగుతూ.. కలసిపోండి

### వార్నర్ - డికాక్‌లకు షేన్‌వార్న్ సలహా







సిడ్నీ : డర్బన్‌లో దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్ట్‌లో నాలుగో రోజు జరిగిన స్లెడ్జింగ్ వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. రెండు జట్ల మేనేజర్లతోనూ, మ్యాచ్ రిఫరీతోనూ ఇంటర్నేషనల్ కౌన్సిల్ (ఐసిసి) సంప్రతింపులు జరుపుతోంది. రెండు దేశాల క్రికె ట్ బోర్డులతోనూ చర్చిస్తోంది. ఇక ఈ ఘటనపై మాజీలు తలో రీతిలో స్పందిస్తున్నారు. క్రికెట్‌లో ఆటగాళ్ల మధ్య స్లెడ్జింగ్ సహజమని మాజీ కికెటర్ షేన్‌వార్న్ అభిప్రాయపడ్డాడు. నాలుగో రోజు టీ విరామ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళుతున్న సమయంలో వార్నర్-డికాక్ దూషించుకున్నారు. వార్నర్ ఆవేశంగా డికాక్‌పై దూసుకెళ్లటం సిసీ టీవీల్లో రికార్డయింది. తోటి ఆటగాళ్లు పక్కకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా వార్నర్ తగ్గలేదు. వార్నర్‌కు బదులిస్తూ డికాక్ కూడా పక్కకు వెళ్లిపోయాడు. ఈ వ్యవహారంపై ట్విట్టర్లో వార్న్ స్పందించాడు. 'ఆటగాళ్ల మధ్య ఎగతాళి, చీదరింపులు, స్లెడ్జింగ్‌లు సహజం, ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలేయటం మంచిది, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయటం మానేసి బీర్ తాగుతూ ఎంజాయ్ చేయండి' అని వార్న్ ట్వీట్ చేశాడు. వ్యక్తిగత దూషణలు మానుకోవాలని ఇద్దరికీ సలహా ఇచ్చాడు. వార్నర్ నోటి దురుసు కొత్తేమీ కాదని ఇక ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. గతంలో చాలా సార్లు ఇలాంటి అనుభవం ఇంగ్లండ్ ఆటగాళ్లకు వార్నర్ నుంచి ఎదురైం దన్నాడు. సౌతాఫ్రికా జట్టు మేనేజర్ మమ్మద్ మోసాజీ కూడా వార్నర్‌ను తీవ్రంగా తప్పు బట్టాడు. డర్బన్ టెస్ట్‌లో నీచమైన సంఘటన జరిగిందని, ఇలా ఆటగాళ్లు వ్యక్తిగతంగా దూషించుకోవటం మంచిది కాదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గిల్‌క్రిస్ట్ అన్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాళ్ల పట్ల వార్నర్ ఎన్నో సార్లు హద్దులు దాటి ప్రవర్తించాడని మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ ట్వీట్ చేశాడు. డికాక్ తల్లి, చెల్లిని వార్నర్ తిట్టాడని దక్షిణాఫ్రికా క్రికెటర్లు మండిపడుతున్నారు. వార్నర్ సంగతి తెలుసే అతని రియాక్షన్ పట్ల మేం ఆశ్చర్యపడలేదన్నాడు.



సాన్ జోస్‌లో జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెదరర్‌తో కలిసి టెన్నిస్ ఆడిన బిల్‌గేట్స్

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.